thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 249 | కరీంనగర్ ఆదివారం, 16 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00


## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.

# నో డౌట్ మళ్ళీ నితీశే సీఎం?



## మరోసారి ఆయనకే పగ్గాలు ఖాయమంటున్న ఎన్డీయే వర్గాలు

### కేంద్రంలో ప్రభుత్వ మనుగడకు జేడీయూ ఎంపీలే కీలకం

న్యూఢిల్లీ : బిహార్‌లో బీజేపీకి జేడీయూ కన్నా ఎక్కువ సీట్లు వచ్చినా.. అధికారంలో కొనసాగడానికి గతంలోలాగా జేడీయూ అవసరం అంతగా లేకపోయినా.. ఈసారి కూడా నీతీశే సీఎం అయ్యే అవకాశం ఉందని, ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మోదీ హాజరవుతారని ఎన్డీయే వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ నేత రామ్ కృపాల్ యాదవ్, ఎల్జేపీ ఎంపీ శాంభవి చౌదరి, హిందుస్థానీ అవామ్ మోర్చా నేత జితన్ రామ్ మాంఝీ వంటివారు నీతీశే సీఎం అవుతారని, అందులో సందేహం లేదని తేల్చిచెబుతున్నారు. మహిళలు, దళితులు, అత్యంత వెనుకబడిన వర్గాల్లో (ఈబీసీలు) నీతీశ్‌కున్న పట్టు.. ప్రస్తుత ఘన విజయంలో ఆయా వర్గాల పాత్ర నేపథ్యంలో.. బీజేపీ ఆయన్ను కాదని మరొకరిని సీఎంగా చేయలేదని ఎన్డీయే వర్గాలు పేర్కొంటున్నట్టు తెలుస్తోంది. వీటన్నింటికీ మించి.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో జేడీయూ ఎంపీలు అత్యంత కీలకం. బీజేపీ, టీడీపీ తర్వాత అత్యధికంగా ఎంపీలు ఉన్నది ఆ పార్టీకే. ఆ కోణంలో కూడా బీజేపీ తప్పనిసరి పరిస్థితుల్లో నీతీశ్‌కు సీఎం పీఠం అప్పజెప్పక తప్పదని రాజకీయ నిపుణులు గుర్తుచేస్తున్నారు. అయితే.. ఐదేళ్లూ నీతీశ్ ఆ పదవిలో ఉండకపోవచ్చని.. బీజేపీకి వరుసగా రెండు ఎన్నికల్లో జేడీయూ కన్నా ఎక్కువ స్థానాలు వచ్చిన నేపథ్యంలో ఒకటి-రెండేళ్లు మాత్రమే ఆయన్ను సీఎంగా ఉండనిచ్చి, తర్వాత తమ పార్టీ నేతను సీఎంగా చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు. నీతీశ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేదని.. జేడీయూలోనే కొందరు నేతలు ఆయన ప్రభుత్వాన్ని నడపడానికి అవసరమైనంత ఫిట్‌గా లేరని భావిస్తున్నట్టు సమాచారం. దీన్ని సాకుగా చూపి బీజేపీ తమ పార్టీకి చెందిన నేతను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టే ప్రయత్నం చేయొచ్చని విశ్లేషిస్తున్నారు.

**నితీశ్ సీఎం అయితే.. పదోసారి!...** గిట్టనివాళ్ల దృష్టిలో నీతీశ్ కుమార్.. పదే పదే జట్టును మార్చే 'పల్టూ రామ్'! దశాబ్దాల తరబడి సాగిన ఆటవిక పాలనలో మగ్గిన బిహార్ ప్రజలకు మాత్రం.. ఆయన అభివృద్ధి రుచి చూపిన 'సుశాసన్ బాబు'!! అందుకే ఆయన ఎన్నిసార్లు రాజకీయ పిల్లిమొగ్గలు వేసినా.. ఒకసారి బీజేపీతో, మరొకసారి ఆర్జేడీతో.. మళ్లీ అంతలోనే బీజేపీతో కలిసి రాజకీయం చేసినా.. బిహార్ ప్రజల దృష్టిలో మాత్రం ఆయన పరపతి ఏ మాత్రం తగ్గలేదు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎం పదవిని చేపట్టి.. అందులో కేవలం వారం రోజులే(2000 మార్చి 3 నుంచి మార్చి 10 దాకా) ఉన్న నీతీశ్.. సభలో తన పార్టీకి తగిన మెజారిటీ లేకపోవడంతో రాజీనామా చేశారు. 2005లో మరోసారి సీఎం అయ్యి ఐదేళ్లూ పాలించారు. 2010 నవంబరు నుంచి 2014 మే దాకా మూడోసారి సీఎంగా వ్యవహరించారు. ఆ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూకి కేవలం 2 సీట్లే రావడంతో సీఎం పదవికి రాజీనామా చేసి జితన్ రామ్ మాంఝీని ముఖ్యమంత్రిని చేశారు. మళ్లీ 2015 ఫిబ్రవరిలో ఆయన్ను తప్పించి తానే సీఎం అయ్యారు. ఆ ఏడాదిలో బిహార్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జనతా పరివార్ అలయన్స్ గ్రూప్ తరఫున సీఎంగా పాలనాపగ్గాలు చేపట్టారు. 2017 దాకా ఆ కూటమి తరఫునే సీఎంగా ఉన్న నీతీశ్.. 2017 జూలై నుంచి 2020 నవంబరు దాకా బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి సీఎంగా ఉన్నారు. మళ్లీ 2020లో బీజేపీతో కలిసి పోటీ చేసి ఆ ఏడాది నవంబరులో ఏడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 2022లో ఎన్డీయే కూటమిని వదిలి మహాగఠ్బంధన్‌తో జట్టుకట్టి.. ఆ ఏడాది ఆగస్టులో ఎనిమిదోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. మళ్లీ 2024 జనవరిలో ఎన్డీయేతో చేతులు కలిపి మరోసారి సీఎం అయ్యారు. అలా ఇప్పటికి తొమ్మిదిసార్లు ఆయన సీఎం అయ్యారు.

ఇప్పుడు మరోసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపడితే.. పదోసారి ఆ పదవిని చేపట్టినట్టు అవుతుంది. నీతీశ్ విషయంలో మరో రికార్డు ఏంటంటే.. ఇప్పటికి దాదాపు 20 ఏళ్లపాటు బిహార్‌కు సీఎంగా వ్యవహరించిన ఆయన ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైంది రెండుసార్లే. 1985లో ఒకసారి.. 1995లో మరోసారి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. కానీ తొలిసారి సీఎం అయింది 2000లో. అప్పట్నుంచీ ఇప్పటిదాకా.. తొమ్మిదిసార్లూ ఆయన విధాన పరిషత్తు (శాసనమండలి) సభ్యుడుగానే సీఎం పదవి చేపట్టారు.

## బిహార్ అయిపోయింది.. రాబోయే ఎన్నికలు ఇవే..

### మరో మూడు నెలల్లో పెద్ద సందడీ.. !

2027 ఎన్నికలకు ప్రీఫైనల్, సెమీఫైనల్ అంటూ సాగిన బీహార్ ఎన్నికల కోలాహలం ముగిసింది. 2025 నవంబర్ 14వ తేదీన బీహార్ ఎన్నికల ఫలితాలు విడుదలవటంతో.. ఈ ఏడాది ఎన్నికల సందడి ముగిసింది. బీహార్ లో విజయ సంబరాలు జరుగుతున్న సమయంలోనే.. ఇదే ఊపులో రాబోయే ఎన్నికలకు బీజేపీ రెడీ అయిపోతుంది. 2025లో బీహార్ ఇచ్చిన కిక్ తో.. 2026లో స్టార్టింగ్ లో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికలకు హుషారులో రెడీ అవుతుంది.

**2026లో జరిగే రాష్ట్రాల ఎన్నికలు ఇవే :** 1. అసోం రాష్ట్రం : అసెంబ్లీ సీట్లు : 126. 2. కేరళ రాష్ట్రం : అసెంబ్లీ సీట్లు : 140. 3. తమిళనాడు రాష్ట్రం : అసెంబ్లీ సీట్లు : 234. 4. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం : అసెంబ్లీ సీట్లు : 294. 5. పాండిచ్చేరి కేంద్ర పాలిత రాష్ట్రం : అసెంబ్లీ సీట్లు : 30. అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో షెడ్యూల్ ప్రకారం 2026, ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇక పాండిచ్చేరిలో మే, జూన్ నెలలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగాలి. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించింది కేంద్ర ఎన్నికల సంఘం. %ూ×=%.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తోంది. అంటే ఆ రాష్ట్రాల్లో ఓట్లను రివిజన్ చేయనుంది. వినియోగంలో లేని ఓటర్ల తొలగింపు.. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను చేపడుతోంది ఎన్నికల సంఘం. 2026 ఎన్నికలు మే-జూన్ వరకు ముగిసిన వెంటనే మళ్లీ 2027 జనరల్ ఎలక్షన్స్ మొదలుకానున్నాయి. అంటే బీహార్ ఎన్నికలతో మొదలైన ఎలక్షన్ల సందడి 2027 వరకు కొనసాగనుంది.

**2027 లో ఈ రాష్ట్రాల్లో ఎన్నికలు:** 1.గోవా రాష్ట్రం: 40. 2.మణిపూర్ రాష్ట్రం: 60. 3.పంజాబ్ రాష్ట్రం: 117. 4.ఉత్తరప్రదేశ్ రాష్ట్రం: 403 సీట్లు. 5.గుజరాత్ రాష్ట్రం: 182. 6.హిమచల్ ప్రదేశ్ రాష్ట్రం: 68.

## జూబ్లీ గెలుపు... రేవంత్ రాజకీయాలకు మలుపు!



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం దక్కించుకుంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ఆదిత్యం ప్రదర్శిస్తూ వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ విజయాన్ని నమోదు చేశారు. అయితే ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఇప్పుడు కీలకంగా మారిందన్న చర్చ నడుస్తోంది. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వచ్చిన తర్వాత దాదాపు పది రోజులపాటు కాంగ్రెస్ చర్చల్లోనే మునిగిపోయింది. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు అధిష్టానం అనుమతి కోసం ఢిల్లీ చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక అప్పటికే బిఆర్ఎస్ పార్టీ ప్రచారానికి దిగిపోవడం, అభ్యర్థిని ప్రకటించడం, బిఫారం కూడా ఇచ్చేయటం వెనువెంటనే ఒక ప్రణాళిక ప్రకారం జరిగి పోయాయి. దీంతో పోల్చుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ వెనకబడిన వాదన బలంగా వినిపించింది. ఇక ప్రచార సరళిలో కూడా బీఆర్ఎస్ పార్టీ నాయకులు దూకుడుగా వ్యవహరించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు చాలా బలంగా ప్రభుత్వంపై ఎదురు దాడి చేశారు. అదేవిధంగా గతంలో తాము అమలు చేసిన పథకాలను ప్రచారంలోకి తీసుకురావడం ద్వారా ప్రజలను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ చివరి నాలుగు రోజులు అంటే ఎన్నికల పోలింగ్ కు ముందు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీనిలో ప్రధానంగా సీఎం రేవంత్ రెడ్డి పాత్ర తిరుగులేదనే చెప్పాలి. బహిరంగంగా ప్రచారం చేయడంతో పాటు బహిరంగ సభల నిర్వహించారు. అదేవిధంగా మీడియా పాయింట్లలో విస్తృతంగా ఆయన ప్రచారం చేశారు. పలు ఛానళ్లకు ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. తద్వారా అనూహ్యంగా చివరి నాలుగు రోజులు కాంగ్రెస్ పార్టీ పుంజుకుని బలమైన విజయాన్ని దక్కించుకునే విషయంలో రేవంత్ రెడ్డి కీలకపాత్ర పోషించారు అన్నది రాజకీయ వర్గాలు చెబుతున్న మాట. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఈ విజయం ప్రత్యక్షంగా నవీన్ యాదవ్ కు దక్కితే పరోక్షంగా ఈ విజయం రేవంత్ రెడ్డికే దక్కుతుందని పలువురు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. ఇప్పటివరకు మంత్రులు సహా పార్టీ నాయకుల్లో రేవంత్ రెడ్డి పై ఉన్న అనుమానాలు, అసహనం, అసంతృప్తి వంటివి పటాపంచలు అవుతున్నాయి అన్నది విశ్లేషకుల మాట. ఒక విజయంతో రేవంత్ రెడ్డి పుంజుకున్నారని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా జూబ్లీహిల్స్ విజయం కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఉత్సాహాన్ని తీసుకురావడంతో పాటు ప్రభుత్వం పై ఉన్న అనుమానాలను అదేవిధంగా అసంతృప్తి అనే మాటను కూడా లేకుండా చేసిందన్నది విశ్లేషకుల అంచనా.

## పంచాయతీ ఎన్నికలకు




## ముహూర్తం ఖరారు..?

### సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌కు లైన్ క్లియర్!

### 17న క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్న రేవంత్ సర్కార్!!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని, రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది. ఈ గెలుపును పునాదిగా చేసుకుని.. ప్రభుత్వం ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ (వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన (లీగల్) సమస్యలు, అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో.. అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని.. మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల, కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ముఖ్యమంత్రి మంత్రులకు కీలక సూచనలు ఇచ్చినట్లు సమాచారం. బీసీల నాయకులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి.. న్యాయపరమైన చిక్కుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఇది కేవలం తాత్కాలికమేనని వివరించాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది.

బీసీ సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని, భవిష్యత్తులో వారికి మరింత న్యాయం చేసే ప్రణాళికలను వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ప్రస్తుత పరిణామాలు గమనిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే.. ఎన్నికల తర్వాత కూడా తమ ఆరు గ్యారంటీల అమలుకు స్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై కాంగ్రెస్ పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది.. ఈ ఊపులోనే స్థానిక సంస్థలకు వెళ్తే బాగుంటుంది అనేది ప్రభుత్వం భావిస్తోంది.



## జూబ్లీహిల్స్ విజయం.. తెలంగాణ నేతలను అభినందించిన రాహుల్ గాంధీ

దిల్లీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేసిన తెలంగాణ నేతలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు శనివారం దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు రాహుల్ శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కష్టపడిన నాయకులను అభినందించారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విజయం గురించి రాష్ట్ర నేతలు రాహుల్‌కు వివరించారు.

## విద్యార్థులకు గుడ్ న్యూస్.. ఇకపై మెనూలో..




సిద్దిపేట జిల్లా, నవంబరు 15 : గురుకుల విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త తెలిపారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మటన్, చికెన్‌లాగా.. ఇప్పటి నుంచి చేపలు కూడా మెనూలో ఉండేలా.. చూస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూరతో కూడిన భోజనం కూడా ఉండాలని తన దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకువచ్చారని గుర్తుచేశారు.

**చేప పిల్లల పెంపకంలో పొరపాట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్...**
మంత్రి శ్రీహరి ఆకాంక్షలకు అనుగుణంగా గురుకుల మధ్యాహ్న భోజన మెనూలో చేపల కూరతో కూడిన భోజనాన్ని వడ్డించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇవాళ(శనివారం) హుస్నాబాద్‌లో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. చేప పిల్లల పెంపకంలో గత ప్రభుత్వంలో కొన్ని పొరపాట్లు జరిగాయని విమర్శించారు. చేప పిల్లల సైజు చిన్నగా ఉండటంతో కొంత ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. హుస్నాబాద్‌కు ఇప్పుడు మూడు లక్షల చేప పిల్లలు ఇచ్చామని వివరించారు. ఇంకో 60 వేల చేప పిల్లలు ఇవ్వాలని సంబంధిత మంత్రి వాకిటి శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. ఎల్లమ్మ చెరువుని సందర్శించడానికి వచ్చే టూరిజం పర్యాటకులు చేపలు కొనుక్కునేలా చేపల మార్కెట్ ఉండాలని సూచించారు. అక్కన్నపేట ఫోర్ లైన్ రోడ్డుకు రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు మంత్రి పొన్నం ప్రభాకర్. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద అభివృద్ధి జరిగేలా గోపాల మిత్రలు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కరించాలని మంత్రి శ్రీహరిని కోరుతున్నానని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో నిర్మించే వెటర్నరీ హాస్పిటల్ నూతన భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించాలని మంత్రి శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా ఉన్న మోడరన్ చేపల మార్కెట్‌ను కూడా పూర్తి చేయాలని కోరారు. ఇక్కడ వెటర్నరీ పోస్టును వెంటనే మంజూరు చేయాలని మంత్రి శ్రీహరికి వినతి పత్రం సమర్పించారు పొన్నం ప్రభాకర్.

**హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తా: మంత్రి వాకిటి శ్రీహరి...**
వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.122.22 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో 84 కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలని రాష్ట్రంలో ఉన్న 26వేల చెరువుల్లో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఐదు లక్షల మంది మత్స్య కారుల కుటుంబాలు మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు మంత్రి వాకిటి శ్రీహరి. చేపల ఉత్పత్తి కేంద్రాలని పెంచి గణనీయంగా ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అత్యాధునిక సదుపాయాలతో ఫిష్ మార్కెట్లు కూడా ఏర్పాటు చేస్తామని వ్యాఖ్యానించారు. గుర్తింపు పొందిన మత్స్యకారులకు రూ.1.40 లక్షలతో ఇన్సూరెన్స్ పాలసీ తీసుకువచ్చామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో హాస్టల్స్‌లో ఉండేలా మధ్యాహ్న భోజనంలో చేపల వంటకం అమలు అయ్యేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.



## హరీశ్‌రావు BRSను మోసం చేశారు

మెదక్: మోసం చేయడం హరీశ్‌రావు నైజమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. మెదక్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. భారత రాష్ట్ర సమితిలో ఒకరిపై ఒకరు బాణాలు వేసుకోవడంతోనే సరిపోతోందన్నారు. కేటీఆర్ ఇప్పటికైనా సామాజిక మాధ్యమాలు బంద్ చేసి బయటకు రావాలని హితవు పలికారు. “భారత రాష్ట్ర సమితి ఓడిపోగానే ఓటమికి కారణం తాను కాదని తప్పించుకోవడం హరీశ్‌రావు నైజం.

ఆయన గురించి గట్టిగా మాట్లాడితే నన్ను పార్టీ నుంచి బయటకు పంపారు. కేటీఆర్, హరీశ్‌రావు పేరుకు కృష్ణార్జునులని ట్వీట్ చేసుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో పనిచేయడంలేదు. 15 మంది ఇండిపెండెట్లు నా దగ్గరికి వచ్చి మేము ఉపసంహరించుకుంటున్నాం.. ఎవరికి మద్దతు ఇవ్వాలని అడిగారు. నాకు జూబ్లీహిల్స్ ఎన్నిక సంబంధం లేదు అని చెప్పా. తర్వాత వాళ్లు హరీశ్‌రావు దగ్గరికి వెళ్లారు. ఆయన కూడా ఇదే సమాధానం చెప్పారట. మీ ఇష్టం.. ఎవరికైనా మద్దతు ఇచ్చుకోండి అన్నారట. నేను భారత రాష్ట్ర సమితిలో లేను కాబట్టి ఉపఎన్నికకు దూరంగా ఉన్నాను. కానీ హరీశ్‌రావు ఆ పార్టీలో ఉంటూ మోసం చేశారు. గ్రూప్-1 ఉద్యోగాల్లో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది. ఉద్యోగాల కల్పనలో విఫలమైంది. హరీశ్‌రావు బినామీలు, వారి కంపెనీలతో సీఎంకు సంబంధాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో మాత్రమే భారత రాష్ట్ర సమితి ఉంది.. అందుకే జూబ్లీహిల్స్‌లో ఓడిపోయింది.

జగదీశ్ రెడ్డి, మదన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డికి.. ఇప్పుడు రూ.వందల కోట్లు ఎలా వచ్చాయి. ఆ పార్టీ నేతలు ఆస్తులు పెంచుకున్నారు... కేడర్‌ను పెంచుకోలేదు. పద్మా దేవేందర్ రెడ్డి 2009లో ఎక్కడున్నారు. రెండు చేతులతో కేసీఆర్ మీద దుమ్మెత్తి పోసి పార్టీ వదిలిపెట్టి వెళ్లారు. ఉద్యమం రాగానే మళ్లీ తిరిగి వచ్చారు. కేసీఆర్ మీద దుమ్మెత్తి పోసిన పద్మా దేవేందర్‌రెడ్డికి హరీశ్ రావు ఎలా సపోర్ట్ చేస్తారు?” అని కవిత ప్రశ్నించారు.

## ఫలితాలు వచ్చి 24 గంటలు దాటక ముందే కాంగ్రెస్ గూండాయిజం: కేటీఆర్



హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో తమ కార్యకర్తపై జరిగిన దాడిని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. రహమత్‌నగర్‌లో తమ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫలితాలు వచ్చి 24 గంటలు దాటక ముందే కాంగ్రెస్ గూండాయిజం చేస్తోందని విమర్శించారు. తాము కూడా అనేక ఎన్నికల్లో గెలిచామని.. కానీ ఇలా దాడులు చేయలేదన్నారు. “విజయ గర్వంతోనే కాంగ్రెస్ వాళ్లు శుక్రవారం ఊరేగింపు నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. దాడికి హస్తం పార్టీ పూర్తిగా బాధ్యత వహించాలి. దొంగ ఓట్లు, గూండాగిరి, డబ్బులు పంచి జూబ్లీహిల్స్‌లో గెలిచారు. కాంగ్రెస్ గూండాయిజం కొనసాగితే ప్రజలే బుద్ధి చెబుతారు” అని కేటీఆర్ హెచ్చరించారు.

రహమత్ నగర్‌లో భారత రాష్ట్ర సమితి కార్యకర్త రాకేశ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. తీవ్ర గాయాలపాలైన ఆయనకు ఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది. ఈ ఘటనపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.






## ఎర్రవల్లి ఫాంహౌస్‌కు కేటీఆర్..

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటమి తర్వాత మొదటిసారిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లిన కేటీఆర్.. తమ పార్టీ అధినేతతో భేటీ అయ్యారు.

జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో బీఆర్ఎస్ ఓటమి.. తదనంతర పరిణామాలపై కేసీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. భవిష్యత్ కార్యచరణపైనా సమాలోచనలు చేసినట్లు సమాచారం. మరోవైపు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్ వేదికగా కార్యకర్తలతో భేటీ కానున్నారు. ఓటమి నేపథ్యంలో జూబ్లీహిల్స్ క్యాడర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు కేటీఆర్. అయితే, పరాజయం తర్వాత జూబ్లీహిల్స్ కార్యకర్తలు నిరాశతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వారితో సమావేశం నిర్వహించాలని కేటీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి కార్యకర్తలను ఉత్తేజపరచడం, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఈ పర్యటన చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మరింతగా పోరాటం చేయనున్నట్లు తెలుస్తోంది.




## సిట్ ఎదుట హాజరైన రానా, విష్ణుప్రియ..

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో సినీ హీరో దగ్గుబాటి రానా, ప్రముఖ యాంకర్ విష్ణు ప్రియ విచారణకు హాజరయ్యారు. CID సిట్ అధికారుల ఎదుట వారిద్దరూ హాజరై విచారణ ఎదుర్కొన్నారు. బెట్టింగ్ యాప్స్ కేసులో తొలుత విష్ణుప్రియ ఇవాళ(శనివారం) మధ్యాహ్నం సిట్ ముందు హాజరయ్యారు.

ఈ మేరకు బ్యాంక్ అకౌంట్ వివరాలతోపాటు బ్యాంక్ స్టేట్మెంట్ వివరాలనూ సిట్ అధికారులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందంపై అధికారులు ప్రశ్నించారు. ప్రమోషన్ ద్వారా వచ్చిన పారితోషికాలపైనా విచారణ చేశారు. కాగా, తాజ్ 777 బుక్ డాట్ కామ్ సహా మరో రెండు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారు విష్ణు ప్రియ. మరోవైపు.. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ కేసులో దగ్గుబాటి రానా సైతం సీఐడీ సిట్ విచారణకు హాజరయ్యారు. బ్యాంక్ స్టేట్మెంట్లతో విచారణకు వచ్చారు. బెట్టింగ్ యాప్‌తో చేసుకున్న అగ్రిమెంట్, ఆ యాప్ యాజమాన్యం ద్వారా వచ్చిన పారితోషికంపై రానాను ప్రశ్నించారు సీఐడీ అధికారులు. కాగా, 2017లో బెట్టింగ్ అండ్ గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు రానా. అయితే, స్కిల్ బేస్డ్ గేమ్ యాప్‌ను మాత్రమే తాను ప్రమోట్ చేశానని సీఐడీకి ఆయన స్టేట్మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు గంటన్నరపాటు సీఐడీ అధికారులు రానాను విచారణ చేశారు. అయితే, విచారణ అనంతరం రానా మీడియాతో మాట్లాడారు. ఒప్పందం చేసుకునే సమయంలో తన లీగల్ టీమ్ అన్ని పరిశీలించాకే ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. చట్టబద్ధమైన యాప్ అని తెలుసుకున్న తర్వాతే ప్రమోట్ చేసినట్లు చెప్పుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఏ సంస్థతోనూ తాను ఒప్పందం చేసుకోలేదని పేర్కొన్నారు. తన లీగల్ టీమ్ పూర్తిగా వెరిఫై చేసిందని వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలన్నీ సిట్ అధికారులకు ఇచ్చానని, విచారణకు పూర్తిగా సహకరించినట్లు రానా పేర్కొన్నారు.



## హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

సైబర్ నేరగాళ్లు తెలంగాణ హైకోర్టుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసినట్లు తెలుస్తోంది. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ ఓపెన్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులను ఆశ్రయించారు. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులు BDG SLOT అనే బెట్టింగ్ సైట్ ఓపెన్ అవుతోంది అంటూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 11వ తేదీన ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. 11వ తేదీనే హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెబ్‌సైట్ హ్యాక్ చేసిన వారిని కనుక్కునే పనిలో పడ్డారు. వెబ్‌సైట్‌లోని సమస్యను క్లియర్ చేశారు. తెలంగాణ హైకోర్టుకు చెందిన ఈ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతీ కేసుకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. ‘ఈ కేసులు’ ఎప్పుడు ఉంటాయన్న దానితో పాటు జడ్జీల వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. వెబ్‌సైట్ హ్యాక్ అయిన విషయం గురించి ఐటీ టీమ్ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇచ్చింది. రిజిస్ట్రార్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పడ్డారు.



## భక్తులకు గుడ్ న్యూస్..

చెన్నై: శబరిమల క్షేత్రంలో అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం కాట్పాడి -సేలం మీదుగా కొట్టాయం వరకు ఈ నెల 24న ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. శబరిమలై భక్తుల కోసం తెలంగాణ రాష్ట్రం చర్లపల్లి నుండి కేరళలోని కొట్టాయం వరకు ప్రత్యేక రైలు నడుపుతున్నారు. ఈ రైలు 24వ తేదీ ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది.

మరుమార్గంలో కొట్టాయం నుంచి నవంబరు 25వ తేదీ రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున చర్లపల్లి కి చేరుకుంటుంది. ఈ రైలు కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్ రైల్వేస్టేషన్లలో ఆగివెళుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

## హైదరాబాద్‌లో ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

హైదరాబాద్, నవంబరు 15 : భాగ్యనగరంలోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్‌పై ఇవాళ (శనివారం) ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఫ్లై ఓవర్‌పై వేగంగా వెళ్తున్న కారు ఆకస్మాత్తుగా బోల్తా కొట్టింది. మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వైపు వెళ్తుండగా టైర్ దెబ్బతినడంతో ఈ ప్రమాదం జరిగింది. పిల్లర్ నెంబర్ 25 వద్ద డివైడర్‌ని ఢీకొని కారు బోల్తా కొట్టింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ముగ్గురు మహిళలతో పాటు ఓ చిన్నారి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారికి స్వల్ప గాయాలు అయ్యాయని వెల్లడించారు. ప్రమాదానికి గురైన కారు రోడ్డుపై అడ్డంగా పడటంతో భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు ఆ కారును పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

**కరీంనగర్ జిల్లాలో..** మరోవైపు.. కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మండలం తనుగుల శివారులో ఇవాళ(శనివారం) రోడ్డు ప్రమాదం జరిగింది. మహిళా వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో ట్రాలీ ఒక్కసారిగా బోల్తాపడింది. ఆటో ట్రాలీ బోల్తా పడటంతో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాలీ వేగంగా వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీణవంక మండలం ఎల్బాక గ్రామం నుంచి జమ్మికుంట మండలం నాగారం గ్రామానికి పత్తి తీయడానికి వెళ్తున్నామని వ్యవసాయ కూలీలు తెలిపారు.

# జానపద సినీ కథా నాయకుడు కాంతారావు

## నవంబర్ 16.. కత్తి కాంతారావు జయంతి



తెలుగు సినీరంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజుల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జానపద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు. తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతారావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నారదుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరించింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు". తెలంగాణలోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగువేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు. ఏడాది వయసులోనే తండ్రిని కోల్పో యారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దోషి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమాల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయ కుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొనగాడు' సినిమాలు తీశారు. రామారావు, నాగేశ్వరరావు లకు సమకాలికులుగా కొన్ని సందర్భాలలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వరరావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు. ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2000 లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతారావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పించాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్ర ల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు. కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969)బీ గండర గండడు (1969)బీ ప్రేమ జీవులు (1971)బీ గుండెలు తీసిన మొనగాడు (1974)బీ స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహ రించారు. సినీ ప్రొడక్షన్ లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది. సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీ రంగంలోనే వెతుక్కోవాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు. ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టు కున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరాబాద్ చేరారు. చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళ చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతంగా చాలా ఇబ్బందులు పడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు. అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు. అదీ ఆలస్యంగా గుర్తింపు. ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు. సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో, అలా సినీరంగమనే సముద్రపు ఆటు పోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతారావు, తన 85వ ఏట, 2009 మార్చి 22నక్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ రద్దు

## డిసెంబర్ లో రాష్ట్ర మహాసభలు - రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు






చురకలు ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 15: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తృతీయ మహాసభలు డిసెంబర్ లో జరపాలని ఫెడరేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్ణయించింది. కాలపరిమితి ముగిసినందున ఫెడరేషన్ రాష్ట్ర కమిటీని పూర్తిగా రద్దు చేస్తూ తీర్మానించింది. రాష్ట్ర మహాసభల నిర్వహణకు కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ సమావేశం తీర్మానించింది. శనివారం హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య ను సంఘం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఇటీవల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వ్యవస్థాపక సభ్యుల సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అదేవిధంగా 2025-27 సంవత్సరాలకు గాను రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో జరిగిన జిల్లాల మహాసభల్లో ఎన్నికైన జిల్లా కమిటీలు యధావిధిగా కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. ఇప్పటివరకు మహాసభలు జరగని జిల్లాల్లో ఉన్న అన్ని పాత కమిటీలను రద్దు చేస్తూ తీర్మానించింది. త్వరలో ఆయా జిల్లాల్లో అడ్ హక్ కమిటీలు వేసి జిల్లా మహాసభలు జరపాలని, నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ స్కీం అమలు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య,వైద్య సదుపాయం కల్పించాలని, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ స్కీం అమలు చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

**బసవ పున్నయ్య తొలగింపుకు రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఆమోదం...** ఫెడరేషన్ ను విచ్ఛిన్నం చేసి నవతెలంగాణలో పనిచేస్తున్న జర్నలిస్టులను, రాష్ట్ర నాయకులను, ఫెడరేషన్ సభ్యులను తప్పుదారి పట్టిస్తూ సంఘానికి సంబంధించిన లెక్కలు చెప్పకుండా సంఘం యొక్క కార్యక్రమాలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన బసవ పున్నయ్యను తొలగిస్తూ రాష్ట్ర అత్యవసర సమావేశం చేసిన తీర్మానాన్ని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సభ్యత్వ రుసుము లెక్కలు చెప్పకుండా, డైరీ, మ్యాగజిన్ ద్వారా ఫెడరేషన్ కు వచ్చిన ఆదాయం లెక్కలు చూపకుండా, జిల్లాల మహాసభలు జరపకుండా అడ్డుకుంటూ, సంఘాన్ని విచ్చినం చేసిన అతన్ని ఫెడరేషన్ నుండి శాశ్వతంగా బహిష్కరించడాన్ని సభ్యులందరూ విస్తృతస్థాయి ఏకగ్రీవంగా ఆమోదించారు. బహిష్కరణకు గురైన బసవ పున్నయ్య కు ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని సమావేశం స్పష్టం చేసింది. ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని సమావేశం తీర్మానించింది. ఈ విషయాన్ని జర్నలిస్టులు, ఫెడరేషన్ శ్రేయోభిలాషులు గ్రహించాలని విజ్ఞప్తి చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో ఆయన కార్యక్రమాలు చేస్తే... అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యతలను రాష్ట్ర కన్వీనింగ్ కమిటీకి అప్పగించింది.


**రాష్ట్ర మహాసభల కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు...** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర తృతీయ మహాసభల నిర్వహణ,ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఎనిమిది మందితో రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కన్వీనర్ గా మామిడి సోమయ్య, కో- కన్వీనర్లుగా పులిపలుపుల ఆనందం,బండి విజయ్ కుమార్,ఎం. యాదగిరి,వల్లాల జగన్,ఆర్.వెంకటేశ్వర్లు, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు,కర్ర అనిల్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లు ఉన్నారు. అదేవిధంగా సంఘం జాతీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టు కూసం సారంగపాణి ని సమావేశం నియమించింది.

# తెలుగు ప్రజల హృదయేశ్వరి "మల్లీశ్వరి"


## నవంబర్ 16... బి.ఎన్.రెడ్డి జయంతి సందర్భంగా




తెలుగు చలనచిత్ర చరిత్రలో స్వర్ణ యుగానికి చెందిన గొప్ప చిత్రంగా మల్లీశ్వరి ఖ్యాతి గాంచింది. ఆ సినిమా భారతదేశం లోనే కాక ఇతర దేశాలలో కూడా చాలా రోజుల పాటు ప్రదర్శింప బడింది. రాచరికపు ఆడంబరాలను, ఆచారాలను చిత్రించినా ఆ సినిమా కమ్యూనిస్టు దేశమైన చైనా లోనే వంద రోజులకు పైగా ఆడింది. ఆ సినిమాకు మాటలు, పాటలు, కళ, నటన, సంగీతం, ఛాయా గ్రహణం, ఎడిటింగులతో సహా అంతా తానై బి.ఎన్.రెడ్డి నడిపించినవే. అందుకే కృష్ణశాస్త్రి "మల్లీశ్వరి సృష్టిలో మేమంతా నిమిత్త మాత్రులం. బి.ఎన్.రెడ్డి దీనికి సర్వస్వం." అన్నారు. మల్లీశ్వరి బహుళ ప్రజాదరణ పొందిన చిత్రం. బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి) (నవంబర్ 16, 1908 - నవంబర్ 8, 1977) తెలుగు సినిమా దర్శకుడు, నిర్మాత. 1975లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన తొలి దక్షిణ భారతీయుడు. పద్మ భూషణ్ పురస్కార గ్రహీత. శ్రీకృష్ణదేవ రాయలంటే ఆరాధనాభావమున్న, ఆంధ్రాంగ్ల సాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేసిన బి.ఎన్.రెడ్డి రాయలవారి మీద ఒక సినిమా తీయాలని సంకల్పించారు. బి.ఎన్. తమ తొలి సినిమా 'వందేమాతరం' షూటింగు కోసం హంపి ప్రాంతానికి వెళ్ళినప్పటి నుండి అందుకు తగిన కథ కోసం వెదుకుతూనే ఉన్నారు. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వచ్చిన ఒక కథ, బుచ్చిబాబు వ్రాసిన "రాయల కరుణ కృత్యం" నాటిక కలిపి దేవులపల్లి కృష్ణశాస్త్రి చేత "మల్లీశ్వరి" స్క్రిప్టుగా అభివృద్ధి చేశారు. అయితే బుచ్చిబాబు పేరు కథా రచయితగా సినిమాలో స్థానం కల్పించ లేదు. వాహినీ వారి మల్లీశ్వరి. ఇది దేవులపల్లి వారి తొలి సినిమా. అయన పాటలు - మాటలు, ర'సాలూరు' రాజేశ్వర రావు కమ్మని బాణీలు, ఎన్.టి.ఆర్., భానుమతిల అద్భుత నటన, ఘంటసాల - భానుమతి గార్ల విలక్షణమైన గాన పటిమ అన్నీ కలబోసిన రాగేశ్వరి మల్లీశ్వరి. శ్రీ కృష్ణ దేవరాయలు పాలించే విజయ నగరానికి సమీపాన నివసించే పల్లెటూరి యువ ప్రేమికులు మల్లి, నాగరాజు. తెలియక వెటకారానికి, మారువేషంలో వున్న రాయలు, పెద్దనలతో రాణివాసం పల్లకి కోరి, తద్వారా ప్రేమికులు విడిపోయి, విరహ వేదన అనుభవిస్తారు. అలనాడు మహాకవి కాళిదాసు ప్రేమికుల సంకేతాలను 'మేఘ సందేశం' గా రచించగా, ఈ చిత్రంలో నాయికా నాయకుల నడుమ తొణికిసలాడే ప్రణయ స్పందనా తరంగాలను 'ఆకాశ వీధిలో హాయిగా' తేలియాడే మబ్బు తునకతో పంపారు కృష్ణ శాస్త్రి. అంతేకాదు ఈ మల్లీశ్వరి మేఘమాల నిజంగానే దేశదేశాలు తిరిగింది, చైనాతో సహా. సాలూరికి ఇష్టమైన చక్కని ఈ పాటను రాగ మాలిక గా భీంపలాస్, కీరవాణి, హంసానంది రాగాలలో కూర్చి ఘంటసాల, భానుమతి గార్లతో అందాల ఓ మేఘమాల పాట పాడించారు సాలూరు వారు. నందమూరి తారక రామారావు, భానుమతి, సురభి కమలాబాయి, బేబీ మల్లిక, మాస్టర్ వెంకటరమణ, న్యాపతి రాఘవరావు, ఋష్యేంద్ర మణి, శ్రీవాత్సవ, కుమారి, వంగర, కమలాదేవి తదితరులు తమ పాత్రలలో ఒదిగి పోయారు. చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలన నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుంది. అప్పటి రాజవిధానం ప్రకారం రాజాంతఃపురంలో పనిచేయడానికి ఇష్టపడిన యువతులను వారింటికి పల్లకీ పంపి, వారి కుటుంబానికి ధన కనక బహుమానాలు ఇచ్చి, రాజాస్థానానికి పిలిపించే వారు. కాని ఒకసారి అంతఃపురంలో చేరిన యువతులకు బయటి మగవారితో సంబంధాలు నిషిద్ధం. ఈ నియమాన్ని అతిక్రమించిన వారికి ఉరిశిక్ష వేసేవారు. చిత్రంలో పాటలు అన్నీ విశేషంగా జనాదరణ పొందాయి. లంబోదర లకుమికరా - పురందర దాసు కీర్తనబీ కోతీ బావకు పెళ్ళంట, కోవెల తోట విడిదంటబీ పిలచిన బిగువటరా ఔరౌరాబీ ఔనా! నిజమేనా! మరతునన్నా మరువలేను ఉషా పరిణయం యక్షగానం- కమలాదేవి, భానుమతి పరుగులు తీయాలి, గిత్తలు ఉరకలు వేయాలిబీ మనసున మల్లెల మాలలూగెనేబీ ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు ఎన్నినాళ్ళకీ బతుకు పండెనో, ఎంత హాయి ఈ రేయి నిండెనో ఝుం ఝుం ఝుం తుమ్మెదా తుమ్మెదా తదితర పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఒక సంప్రదాయ గానం, మరొక పురందరదాసు కీర్తన (గణేశ ప్రార్థన) తప్పించి మిగిలినవన్నీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలే. స్త్రీలను ఆకర్షించేందుకు భక్తి పాటలను ఏదో విధంగా చొప్పించే రోజుల్లో ఈ సినిమాలో టైటిల్స్ శ్రీగణనాథం అనే గీతం తప్ప మిగతా పాటలన్నీ సినిమాకు ముఖ్య కథాంశమైన అనురాగం, ప్రణయం, రెండవ థీం అయిన విజయనగర వైభవం చుట్టూ ఉండేలా రూపొందించారు. మొత్తం పాటల స్వరకల్పనకు ఆరు నెలల కాలం పట్టింది. సినిమాలో మల్లీశ్వరి నాగరాజు ముందు ప్రదర్శించిన నృత్య గానాలను మారువేషంలో చూసిన అల్లసాని పెద్దన ఆశువుగా ఆమెను మెచ్చుకుంటూ ఓ పద్యం చెప్పే సన్నివేశం ఉంది. అల్లసాని పెద్దన రాసినట్లుగా అల్లిక జిగిబిగితో రావాలన్న జాగ్రత్త వల్ల కృష్ణశాస్త్రితో 108 పద్యాలు రాయించుకుని అందులో ఒక్కటి ఎంపిక చేసుకున్నారు బి.ఎన్.రెడ్డి. మల్లీశ్వరి చలనచిత్రం ద్వారా చిత్రరంగానికి ప్రముఖ కవి, భావకవితోద్యమంలో ముఖ్యుడైన దేవులపల్లి కృష్ణశాస్త్రిని పరిచయం చేశారు. ఈ చిత్రాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ చూశారు. ఆయన గమనించిన విషయం - చిత్రంలో మల్లి, నాగరాజులు, మారువేషంలో ఉన్న రాయలవారిని కలిసింది పెద్దవర్షం వచ్చిన కారణంగా. ఐతే రాయలవారు వీరితో మాట్లాడి తిరిగి వెళ్ళిపోయే సమయంలో గుర్రాల స్వారీ వల్ల ధూళి రేగుతుంది. ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**




విశాఖ: విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సులో ఇప్పటి వరకూ రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. మొత్తంగా గడిచిన 18 నెలల్లోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు చెప్పారు. శ్రీసిటీలో మరికొన్ని యూనిట్లను చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక్కడ 12 ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 12,365 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చంద్రబాబు తెలిపారు. "ఒక ప్రణాళికతో శ్రీసిటీని ఏర్పాటు చేశాం. అభివృద్ధికి ఇది చక్కటి ఉదాహరణగా నిలిచింది. శ్రీసిటీ నుంచే డైకిన్, ఇసుజూ, క్యాడ్బరీ.. ప్రపంచానికి ఉత్పత్తులు అందిస్తున్నాయి. వివిధ దేశాల పరిశ్రమలు శ్రీసిటీ పారిశ్రామిక టౌన్‌షిప్‌నకు రావాలి. త్వరలోనే శ్రీసిటీకి 6 వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తాం. 50 దేశాలకు చెందిన కంపెనీలు ఇక్కడి నుంచే పనిచేస్తాయి. త్వరలోనే 1.5 లక్షల ఉద్యోగాలతో శ్రీసిటి అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. 2028 నాటికి దీనిని ఉత్తమ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తాం. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు భారీ ప్రణాళికలు వేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.




బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తిరుగులేని విజయం సాధించింది. 202 సీట్లు తన ఖాతాలో వేసుకోగా.. మహాగఠ్‌బంధన్ కూటమి తీవ్ర పరాజయం పాలైంది. ఈ ఓటమిపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఫలితంతో ఇండియా కూటమి ఎంతో నేర్చుకోవాలన్నారు. బిహార్ ఎన్నికల ఫలితాలు అందరికీ పాఠమంటూ స్టాలిన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

నిర్ణయాత్మక విజయం సాధించిన సీఎం నీతీశ్‌కుమార్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌కు కూడా శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమాలు, సామాజిక, సైద్ధాంతిక సంకీర్ణాలు, స్థిరమైన ప్రచారంపై ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. ఇండియా కూటమిలో అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో వచ్చే కొత్త రాజకీయ సవాళ్లను పరిష్కరించేందుకు వ్యూహాత్మక ప్రణాళిక వేయగలరన్నారు. ఈసందర్భంగా ఆయన ఎన్నికల కమిషన్‌ను ఉద్దేశిస్తూ పలు ఆరోపణలు చేశారు. ఈ ఫలితంలో ఈసీపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయలేమని వ్యాఖ్యానించారు. ఈసీ ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు.

ఓడిపోయిన అభ్యర్థుల్లో కూడా విశ్వాసాన్ని ప్రేరేపించేలా ఎన్నికల సంఘం ఉండాలన్నారు. బిహార్‌లో రెండు దశల్లో జరిగిన ఎన్నికలకు శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. 245 సీట్లకు గాను 202 సీట్లను సొంతం చేసుకుంది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్ బంధన్ కేవలం 34 సీట్లకే పరిమితమైంది.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# మహాగఠ్ బంధన్ కొంప ముంచిన ఎం ఫ్యాక్టర్?

బిహార్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మహాగఠ్ బంధన్ కూటమి ఆశలు అన్ని ఇన్ని కావు. ఎన్నికల వేళలో తమకున్న శక్తియుక్తుల్ని వాస్తవ పద్ధతిలో మదింపు చేసుకోవటం మానేసి.. లేని బలాన్ని ఊహించుకొని చతికిలపడింది మహాగఠ్ బంధన్ కూటమి. దీనికి తోడు తప్పుల మీద తప్పులు చేసిన ఈ కూటమి జరగాల్సిన శాస్తి జరిగిపోయింది. తమను అధికారంలోకి తీసుకొచ్చే ఎం ఫ్యాక్టర్ గురించి ఈ కూటమి నేతలు తరచూ మాట్లాడేవారు. అయితే.. తాము నమ్ముకున్న ఎం ఫ్యాక్టర్ వర్కువుట్ అయ్యేలా వ్యవహరించారా? అంటే అదీ లేదని చెప్పాలి. ఇంతకూ ఈ ఎం ఫ్యాక్టర్ అంటే ఏమిటి? అన్న విషయం లోకి వెళితే.. మహిళలు.. ముస్లింలు.. మల్లాలు తమ వైపునకు తిప్పుకుంటే అధికారం ఇట్టే తమ చేతుల్లోకి వచ్చేస్తుందని ఆశించారు మహాగఠ్ బంధన్ కూటమి నేతలు. నిజానికి వారి లెక్క కరెక్టే. ఎందుకంటే.. మొత్తం జనాభాలో ముస్లింలు 17.7 శాతం ఉండటం.. అందులో మహిళల వాటా ఏడు శాతాన్ని తీసేసినా.. పది శాతం.. యాభై శాతం వరకు ఉండే మహిళల్ని కలిపితే.. ఏకంగా 60 శాతం. వీరికి తోడుగా కూటమిలో ఉండే పార్టీలకు ఉండే సంప్రదాయ ఓటు బ్యాంకును కలుపుకుంటే గెలుపు నల్లేరు మీద నడకగా ఉండేది. ఏసీ రూంలో కూర్చొని కాగితాల మీద లెక్కలు వేసుకున్నంత సింపుల్ గా వాస్తవంలో ఓట్లు తమకు అనుకూలంగా మళ్లటం ఉండదన్న విషయాన్ని మహాగఠ్ బంధన్ మిస్ అయ్యింది. విపక్షంలో ఉన్న తాము అధికారంలోకి వస్తే మహిళలకు భారీ ఎత్తున మేలు చేకూరుస్తామంటూ ఇచ్చిన హామీలను మహిళలు నమ్మలేదు. ముస్లింలు మజ్లిస్ తో పాటు.. అధికార జనతాదళ్ (యూ)వైపునకు మళ్లటం.. డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని భావించిన వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ అధిపతి ముఖేశ్ సహాని ఆసక్తి చూపకపోవటం ఒక దెబ్బ అయితే.. మైనార్టీల్లో అత్యధికంగా ఉండే ముస్లింలకు కాకుండా మల్లాలకు పదవిని ఇస్తామని చెప్పటం కోపం తెప్పించింది. మొత్తంగా మహాగఠ్ బంధన్ మునిగేలా చేసింది. మరోవైపు పీకే పెట్టిన కొత్త పార్టీ కూడా మహాగఠ్ బంధన్ ను దెబ్బ తీశాయి. పీకే పెట్టిన జనసురాజ్ పార్టీ విపక్షాలు పోటీ చేసిన స్థానాల్లో మైనార్టీ ఓట్లను చీల్చింది. ఇలా ఎక్కడికక్కడ తప్పుల మీద తప్పులు జరిగి ఉండకపోతే ఇంత దారుణ పరాజయం ఎదురయ్యేది కాదు. విపక్షాల గెలుపులో కీలక భూమిక పోషిస్తాయని భావించిన మిథిలాంచల్, సీమాంచల్ లో వేసుకున్న లెక్కలు మొత్తం తప్పాయి. దీంతో.. మహాగఠ్ బంధన్ కు దారుణమైన పరాజయం దక్కింది.

# కానరాని మీడియా స్వేచ్ఛ... - నవంబర్ 16... జాతీయ పత్రికా దినోత్సవం

ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలంలో ఉంది. భారత దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 16 వ తేదిన జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటారు. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16 వ తేదిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదిన జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపు కోవడం జరుగుతుంది. భారత దేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్ళు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. అనేక సంవత్సరాలుగా ప్రెస్ కౌన్సిల్ పత్రికా రంగానికి ఎదురయ్యే సవాళ్లు, సమస్యల గురించి ప్రతి నవంబరు 16న సెమినార్లు నిర్వహించడం జరుగుతుంది. ఇక అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికలు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించడం కూడా జరిగింది. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్స వాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాక పోవడం విచారకరం. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చు కొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపు తున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే, కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార




సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా. పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగు తున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్ గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగి పోయింది. ఒకరి ప్రయోజ నాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డ పెట్టుకొని లాభాలు సంపాదిం చటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించ టంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్ను అమలు జరుపు తున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసు కోలేని గందరగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటు లోకి రావటంతో గోబెల్స్ను వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాటును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడిన దిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం. లక్ష్య సాధనకు ప్రెస్ కౌన్సిల్ పూర్తిగా అంకితం కావాలని ఆశిద్దాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల ... 9440595494**


# సాంస్కృతిక పునరుజ్జీవానికి అంకితమైన ఆదిరాజు - నవంబర్ 16..ఆదిరాజు వీరభద్రరావు జయంతి



తెలంగాణలో విద్యావైజ్ఞానిక రంగాల అభివృద్ధికీ, సాంస్కృతిక పునరుజ్జీవనానికీ నిరంతరం కృషి చేసిన వైతాళి కుడు, ప్రసిద్ధ రచయిత, చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు. తెలంగాణ ప్రాంతపు చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన గొప్ప బాషా శాస్త్రవేత్త. ఆయన సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాతగా, శాసన పరిశీల కునిగా, బాలవాఙ్మయ కర్తగా, ఉత్తమ అధ్యాపకునిగా, తెలంగాణ సాంస్కృతిక వికాస చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించు కున్నారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో గ్రంధాలయ అధికారిగా, కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేశారు. విజ్ఞాన చంద్రిగా గ్రంథమాల కార్యాలయ ప్రముఖులుగా, ఆంధ్ర జనసంఘ కార్యవర్గ సభ్యులుగా, లక్ష్మణరాయ పరిశోధకమండలి కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వతపరిషత్తు స్థాపక సభ్యులుగా, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రధాన సంపాదకులుగా, విజ్ఞానవర్ధినీ పరిషత్తు సభ్యులుగా, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ ప్రధాన సంగ్రాహకులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులుగా. బహుముఖ సేవలను అందించారు. ఆదిరాజు వీరభద్రరావు (16.11.1892 - 28.9.1973) 1892 నవంబర్ 16న ఖమ్మం జిల్లా దెండుకూరులో వెంకమ్మ, లింగయ్య పంతులకు జన్మించారు. తల్లి దండ్రులు చిరుప్రాయం లోనే మరణించగా, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం వ్యవ స్థాపకులైన రావిచెట్టు రంగారావు ఆదిరాజును చేరదీశారు. దాంతో హైదరా బాదులోని చాదర్‌ఘాట్ హైస్కూలులో మెట్రిక్ చదివారు. 1901లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం నిర్వహణలో భాగస్వామ్యం వహించే అవకాశం వీరభద్రరావు లభించింది. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయానికి తొలి గ్రంథపాలకులుగా ఆదిరాజు వీరభద్రరావు నియమితులైనారు. విఖ్యాత పరిశోధకులు కొమర్రాజు వెంకటలక్ష్మణ రావు హైదరా బాదులో 1905లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను స్థాపించారు. ఆదిరాజు దానిలో సహాయకునిగా చేరారు. స్థానిక అననుకూల పరిస్థితుల వల్ల కొమర్రాజు విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను 1908లో బ్రిటీషాంధ్ర రాజధాని మద్రాసు (నేటిచెన్నై)లు తరలించిన తరుణంలో, లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు వీరభద్రరావు కూడా మండలిలో పనిచేయటానికి మద్రాసు వెళ్ళారు. 1914 లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల హైదరాబాదుకు మారడంతో ఆదిరాజు వారు తిరిగి హైదరాబాదుకు చేరుకున్నారు. 1914లో హైదరాబాదుకు తిరిగివచ్చి మహబూబ్ కళాశాలలో తెలుగు ఆచార్యునిగా నియమితుడయ్యారు. ఆ తరువాత ఛాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలోనూ, నారాయణ గూడలోని బాలికోన్నత పాఠశాలలోనూ తెలుగు పండితులుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి ఇతని శిష్యులలో ప్రముఖుడు. 1914 నుండి 1921 దాకా చాదర్‌ఘాట్ హైస్కూలులో ఆతర్వాత 1949 నుండి 1953 దాక నారాయణ గూడా బాలికోన్నత పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశానికి ప్రధాన సంగ్రాహకులుగా వ్యవహరించారు. 1921లో తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికై ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించి నప్పుడు దానికి కార్యదర్శిగా ఆదిరాజు పనిచేశారు. ఆ సంస్థ తెలంగాణ లోని పలు చారిత్రక ప్రదేశాలు, శిలా శాసనాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి "తెలంగాణ శాసనాలు" పేరిట పెద్ద గ్రంథాన్ని ప్రచురించుటలో ఆదిరాజు కృషి అసమానమైనది. ఆదిరాజుకు బాగా పేరు తెచ్చిన గ్రంథాల్లో ప్రాచీనాంధ్ర నగరములు , మన తెలంగాణా అనేవి ప్రధానమైనవి. అలంపురం, ఆనెగొంది, కళ్యాణి, కొండాపురం, కొలనుపాక, గోలకొండ,పానుగల్లు, ప్రతిష్ఠానం, బోనగిరి, రాచకొండ, వరంగల్లు, వేల్పుగొండ అనే ప్రసిద్ధ నగరాలకు సంబంధించిన పూర్వరాజుల, రాణుల, మంత్రుల, శిల్పుల, గాయకుల, కవుల జీవిత చారిత్రక విశేషాలతో పాటు భౌగోళిక, సాంఘిక ఆర్థిక మత విషయాలను, ఆ పట్టణాల పతన హేతువులను నిష్పక్షపాతంగా వివేచించి ఎన్నో అపూర్వ విషయాలను వెలుగులోనికి తెచ్చారు. నాణెములను గురించి, చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్ర గురించి వివరిస్తూ భారతదేశంలో అతి ప్రాచీన నాణేలు తొలిసారిగా తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్ లో దొరికాయని, నాణేలు ముద్రించే టంకసాలలు సైతం తెలంగాణలో ఉండేవని ఒకటి కొండాపూర్‌లో, రెండవది కోయిలకొండలో ఉండేదని చారిత్రకాధారాలతో నిరూపించారు. ఆదిరాజు ఆనాడు పేర్కొన్న కొన్ని తాళపత్రగ్రంథాలు – శ్రీకృష్ణ శతానందీయం, తాలాంక నందినీ పరిణయం, దశరథరాజ నందినీ పరిణయం లాంటి కావ్యాలు పండిత పరిష్కృతాలయి వెలుగులోకి వచ్చాయి. తెలంగాణకు సంబంధించిన విభిన్న అంశాలను సత్య దృష్టితో పరిశీలిస్తూ వెలువరించిన గ్రంథం "మన తెలంగాణం". ఆదిరాజు వారికి బాగా పేరు తెచ్చిన మరో గ్రంథం "షితాబుఖాన్ లేక సీతాపతిరాజు" చరిత్ర. 68 గ్రీకు పురాణ దేవతలకు సంబంధించిన కథలను, హిందూ దేవతలతో పోల్చి బాలురకీ అర్థమయ్యే రీతిలో సులభ వ్యావహారిక శైలిలో "గ్రీకు పురాణ కథలు" పేరుతో ప్రచురించారు. విద్యార్థుల కోసం రఘునాథ నాయకుడు, మార్కోపోలో, మీరాబాయి, శ్రీహర్షుల సంక్షిప్త జీవిత చరిత్రలు ప్రచురించారు. జానపద సాహిత్యం, గ్రామనామాలు, వ్యక్తి చరిత్రలు, శాసనాలు, చరిత్రలు, దర్శనీయ స్థలాలు, సంస్కృతి సంబంధాలు, ఆచార వ్యవహారాలు, సామెతల జాతీయాల వివరణ, మహబూబునగర్, మెదక్, నల్లగొండ లాంటి వివిధ జిల్లాల స్వరూప స్వభావాల గురించిన వ్యాసాలు, వంటి ఎన్నో పరిశోధనాత్మక విశ్లేషణలు చేసారు. దక్కన్ రేడియోలో మొదటి సారి తెలుగులో ప్రసంగించిన వ్యక్తి ఆదిరాజు కావడం విశేషం. దాదాపు నూట యాభై రేడియో ప్రసంగాలు చేశారు. హైదరా బాదులో ఆ కాలంలో వెలసిన ప్రతీ సాహిత్య సాంస్కృతిక సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఆదిరాజు 1973 సెప్టెంబర్ 28న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు వేదిక.... శ్రీబాగ్ ఒడంబడిక - నవంబర్ 16... శ్రీబాగ్ ఒడంబడిక దినం

రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణకు 1937 నవంబర్ 16 వతేదీ జరిగిన శ్రీ బాగ్ ఒడంబడిక నివురు గప్పిన నిప్పులా రాజుకుంటూనే ఉంది. ఎనిమిది దశాబ్దాలు దాటినా, మానని గాయంలాగా ఇప్పటికీ కెలుకుతోంది. గత కొన్ని ఏళ్లుగా నవంబర్ మాసం వస్తే రాయలసీమలో అలజడి రేగుతోంది. ఈ ఏడు సైతం సీమలో ఎవరికి వారు పలు ప్రజా సంఘాలు నవంబర్ 16 వతేదీ శ్రీ బాగ్ ఒడంబడిక అమలు చేయాలని డిమాండ్ చేసేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులు యువత పలు పట్టణాల్లో ప్రచారంలో భాగంగా పోస్టర్లు కర పత్రాలు ఉపయోగిస్తున్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై కోస్తా ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య ఏర్పడిన అపోహలను, విభేదాలను తొలగించే ఉద్దేశంతోఉమ్మడి మద్రాసులో 1937లో నవంబరు 16న ఎనిమిది మంది సభ్యుల సమక్షంలో జరిగిన ఒప్పందమే శ్రీబాగ్ ఒడంబడిక. దీనినే పెద్ద మనుషుల ఒప్పందం అని కూడా అంటారు. దీని ముఖ్య ఉద్దేశం రాయలసీమ అభివృద్ధి, ప్రయోజనాలు. మద్రాసులో కాశీనాధుని నాగేశ్వరరావుగారి శ్రీబాగ్ మహలు లో 1937 నవంబరు 19న సమావేశమై (సర్కారాంధ్ర, రాయలసీమ) సామరస్య సాధనగా పెద్ద మనుషుల ఒప్పందం ( శ్రీబాగ్ ఒడంబడిక ) సాధించారు. ఆస్థల గౌరవార్థం ఆ ఒడంబడికను శ్రీబాగ్ ఒడంబడికగా పిలవడం జరిగింది. ఈ ఒప్పందం వీరిమధ్య సదవగాహనను పెంపొందించి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో కోస్తా, రాయలసీమ నాయకుల మధ్య విభేదాలు ఉండేవి. 1926లో ఏర్పాటైన ఆంధ్ర విశ్వ విద్యాలయమును ఎక్కడ ఏర్పాటు చెయ్యాలనే విషయంతో ఈ విభేదాలు మొదలయ్యాయి. అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి డా. సుబ్బారాయన్ తీసుకున్న నిర్ణయాలు ఇందుకు ఇతోధికంగా తోడ్పడ్డాయి. ఆ తరువాత, 1913నుండి, 1935 వరకు జరుగుతూ వచ్చిన ఆంధ్ర మహా సభ సమావేశాలలో, ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలోను ఇవి బయటపడుతూ ఉండేవి. 1917లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభ సమావేశాలలో ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని ఓడించ దానికి రాయలసీమ, నెల్లూరు ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నించారు. 1924లో విజయవాడలో జరిగిన ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలో అధ్యక్ష పదవికి పోటీచేసిన రాయలసీమకు చెందిన నాయకుడు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావును ఆంధ్ర నాయకులు ఓడించారు. ఆనాటి రాయలసీమ రాజకీయ నాయ కత్వంలో తమిళుల ప్రాబల్యం


Indian Express
NDHRA STATE INAUGURATE
hru's Appeal
r Unity
IN FUNCTION
KURNOOL
TRIVEDI ASSUMES OFFICE
Prakasam Cabin
Sworn I
SANJIVA RED
DEPUTY CHI
Sanjivayya, Koti R
Tenneti, Rest of

అధికంగా ఉండటం, వారు సహజంగానే ప్రత్యేకాంధ్రకు వ్యతిరేకంగా ఉండటం ఈ విభేదాలకు ఒక ప్రధాన కారణం. కేశవ పిళ్ళై, ఏకాంబర అయ్యర్ వీరిలో ప్రముఖులు. 1934 లో రాయలసీమ పరిరక్షణ పేరుతో జస్టిస్ సి. యల్. నరసింహా రెడ్డి కె. సుబ్రహ్మణ్యం చొరవతో రాయలసీమ మహాసభ ఏర్పాటు చేశారు. 1934 జనవరిలో మద్రాసులో తొలి సభ జరిగింది. కడపకు చెందిన నెమలి పట్టాభిరామా రావు సభకు అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సెంట్ మెంట్ ను వ్యతిరేకించే తమిళ కాంగ్రెస్ నేత యస్. సత్య మూర్తి సభను ప్రారంభించారు. తిరిగి 1935 సెప్టెంబర్ లో రెండవ సభ కడపలో జరిగింది. 1937 లో జరిగిన ఎన్నికల్లో జస్టిస్ నరసింహా రెడ్డి సుబ్రహ్మణ్యం ఓడి పోయారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందినది. 1937 ఎన్నికల తర్వాత ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్షులుగా భోగ రాజు పట్టాభి సీతారామయ్య ఎన్నికైనారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం తీవ్రతరం చేశారు. అయితే రాయలసీమ ప్రాంత నేతల సహకారం లేనిదే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించడం సాధ్యం కాదని కోస్తా కాంగ్రెస్ నేతలు గుర్తించారు. 1937 అక్టోబర్ లో విజయవాడలో ఆంధ్ర మహాసభ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు రాయలసీమకు చెందిన కడప కోటి రెడ్డి అధ్యక్షత వహించగా హలా హర్వి సీతారామ రెడ్డి ప్రారంభించారు. ఇరువురు కూడా రాయల సీమ నుండి శాసనసభ్యులుగా వున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు సహకరించాలంటే రాయలసీమ ప్రయోజనాలకు రక్షణ ఇవ్వ వలసినదిగా ఇద్దరూ కోరారు. ఈ మహాసభలో జరిగిన చర్చలు పరస్పరం భావాలు ఇచ్చి పుచ్చుకున్నందున శ్రీ బాగ్ ఒడంబడిక కుదరడానికి పునాది రాయి పడింది. నాయకులు విభేదాలను తొలగించుకోవాలన్న నిశ్చయానికి వచ్చారు. మంత్రివర్గం ఏర్పాటు, నీటిపారుదల, రాజధాని మొదలైన విషయాలలో రాయలసీమకు రక్షణలు అవసరమన్న భావనను రాయలసీమ నాయకులు వ్యక్తపరచగా, ఈ విషయాలను పరిశీలించేందుకు ఒక సంఘాన్ని నియమించారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, హాలహర్వి సీతారామరెడ్డి, కడప కోటిరెడ్డి, కొండా వెంకట ప్పయ్య, టి. ఎన్.రామకృష్ణారెడ్డి, మహబూబ్ ఆలీ బేగ్, దేశిరాజు హనుమంత రావు, కల్లూరు సుబ్బారావు, దేశపాండ్య సుబ్బారావు, వరదాచారి, పప్పూరి రామాచారి, సుబ్బరామి రెడ్డి, ముళ్ళపూడి పల్లంరాజు తదితర సంఘ సభ్యులంతా 1937 నవంబర్ 16న మద్రాసులో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు నివాసమైన శ్రీబాగ్ లో సమావేశమై, ఒక ఒప్పందానికి వచ్చారు. ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఆ ఇంటి పేరుమీదనే ఈ చారిత్రాత్మక ఒప్పందానికి శ్రీబాగ్ ఒడంబడిక అని పేరు వచ్చింది. రాష్ట్ర రాజధాని మద్రాసుగానీ, రాయలసీమలో ఏదో ఒక పట్టణం అయివుండాలి. శాసనసభలో రాయల సీమకు సరియైన ప్రాతినిధ్యము ఉండాలి. సరి సమాన సంఖ్యలో మంత్రులుండాలి. ఆర్థిక వెనుక బాటు తనం మూలాన వెంటనే తుంగభద్ర, హగరి ప్రాజక్టులు చేపట్టాలి. రాష్ట్ర ఆదాయాన్ని సమానంగా పంచాలి. ఆంధ్ర యూనివర్సిటీ రెండు కేంద్రాలు ఏర్పాటు చేయడం. ఒకటి – వైజాగ్ లో రెండవది అనంతపురంలో నెలకొల్పడం. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆర్థికాభివృద్ధి కోస్తా ప్రాంతంతో సమానంగా సాధించేందుకు తుంగభద్ర కృష్ణ, పెన్నా నదులపై నిర్మించే పెద్ద ప్రాజెక్టుల ప్రయోజ నాలు ప్రధమ ప్రాధాన్యత ఇవ్వాలి. చట్ట సభల్లో రిజర్వేషన్ స్థానాలు మినహా జనరల్ స్థానాలు జిల్లా స్థాయిలో సమానంగా వుండాలి. రాజధాని హైకోర్టు వేర్వేరు ప్రాంతాల్లో వుండాలి. ముందు ఛాయిస్ రాయలసీమకు ఇవ్వాలి. సదరు తీర్మానాలు సభలో ప్రవేశ పెట్టడం, ఏకగ్రీవంగా ఆమోదంపొందడం జరిగింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# స్థల కొరత.. ఆరబోతకు గోస

జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని బీట్‌బజార్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్థల కొరతతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. 5 వేల క్వింటాళ్ల దినుసులు వస్తే యార్డు పూర్తిగా నిండిపోతోంది. ఏ రోజు వచ్చినవి.. ఆ రోజు కొనుగోలు చేసి, తూకం వేసి తరలిస్తే రైతులు తెచ్చే ఉత్పత్తులు కుప్పలు పోయటానికి స్థలం ఉంటుంది. వివిధ కారణాలతో జాప్యం జరిగితే మరుసటి రోజు ధాన్యం ట్రాక్టర్లు, లారీలు వచ్చే వీలులేకుండా నిండిపోతోంది. దీంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా రూ.2.80 కోట్ల ఆదాయం ఉన్నా.. పంట ఉత్పత్తుల విక్రయ అవకాశాలు మెరుగుపరచటం లేదు. పాత యార్డులోని మొత్తం 5.20 ఎకరాల స్థలంలో 2 ఎకరాలు సమీకృత మార్కెట్కు ఇవ్వటంతో దినుసుల కల్లానికి స్థలం ఇరుగ్గా మారింది. మార్కెట్ కార్యాలయాన్ని 4 కిలోమీటర్ల దూరంలోని చల్‌గల్ యార్డుకు తరలించటంతో అధికారులు ఓ చోట, క్రయవిక్రయాలు మరోచోట జరుగుతున్నాయి.

**చల్‌గల్‌లో అరకొర వసతులే**

జిల్లా కేంద్రంలోని దినుసుల బీటును చల్‌గల్ యార్డుకు తరలిద్దామంటే.. అక్కడ పూర్తి స్థాయి సదుపాయాల్లేవు. వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి తొలుత తీసుకున్న 21 ఎకరాల్లో 16 ఎకరాల స్థలంలో 15 వేల టన్నుల సామర్థ్యంతో 4 భారీ గోదాములు, రైపెనింగ్ ఛాంబర్, కార్యాలయ భవనం, 2 ధర్మకాంటాలు, 4 వేయింగ్‌షెడ్లు నిర్మించారు. మిగిలిన 5 ఎకరాల భూమితో పాటు వాలంతరి నుంచి మరో 10 ఎకరాలు ఇటీవల తీసుకున్నారు. రూ.కోటితో గచ్చు, రూ.70 లక్షలతో సిమెంటు రహదారులు, రూ.5 లక్షలతో వాలంతరి ప్రదర్శన క్షేత్రంవైపు ఫెన్సింగ్, రూ.10 లక్షలతో గోదాములకు మరమ్మతులు



చేపట్టినా పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులో లేవు. చల్‌గల్ పట్టణానికి దూరంగా ఉండటంతో దినుసుల రక్షణ సమస్యగా మారింది.

**సౌకర్యాలతో అందుబాటులోకి తేవాలి**

పాత బీటులో స్థలం లేక రైతులు దినుసులు తేవటం లేదు. తెచ్చినవారికి తక్కువ ధరే పలుకుతోంది. చల్‌గల్ బీటులో రైతు విశ్రాంతి భవనం, క్రయవిక్రయాలు, తూకం చేపట్టేలా ఏర్పాటు చేసి తదితరాలు నిర్మించి అందుబాటులోకి తేవాలి. – భూమయ్య, రైతు, తాటిపల్లి

**మిగిలిన పనుల పూర్తికి ప్రతిపాదనలు**

చల్‌గల్ యార్డులో దశల వారీగా పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనుల పూర్తికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే పనులు చేపట్టి యార్డును తరలించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, కార్యదర్శి


# లక్ష్యం చేరని ఆయిల్‌పామ్ సాగు

జగిత్యాల : కరీంనగర్ జిల్లాలో పలువురు రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటల్లో గెలలురాగా టన్నుకు రూ.19 వేల ధరకు అమ్మకం ఆరంభమైంది. మరో నాలుగైదు మాసాల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలామంది రైతుల తోటల్లో గెలలు చేతికందనున్నాయి. ఓ వైపు ఆయిల్‌పామ్ నాటిన రైతులకు మంచి ధర దక్కుతున్నా.. ప్రభుత్వం నుంచి రాయితీలున్నా ఆశించినట్లుగా సాగు విస్తీర్ణం పెరగకపోవటం అధికారులను ఆశ్చర్యపరుస్తోంది...

మన ప్రాంత రైతులకు ఆయిల్‌పామ్‌పై అనుభవం లేకపోవడం, కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో సాగు చేయడానికి ఆలోచిస్తున్నారు. ఈ అనుమానాలను అధికారులు నివృత్తి చేయడంతోపాటు తగు అవగాహన కల్పిస్తే సాగు పెరిగే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో 131 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా ప్రతి ప్యాక్స్ పరిధిలో కనీసం 100 ఎకరాల విస్తీర్ణంలో రైతులతో ఆయిల్‌పామ్‌ను సాగు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ అంశాలపై దృష్టి సారిస్తే..

ఇటీవల వాతావరణ పరిస్థితులు మారటం, చీడపీడల తీవ్రతతో మామిడి సాగు నష్టాలకు గురవుతుండగా చాలామంది రైతులు మామిడి చెట్లను తొలగించి ఆయిల్‌పామ్ తదితర పంటలకు మళ్లుతున్నారు. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే కనీసం 30 ఏళ్ల పంటకాబట్టి మామిడిలా మధ్యలో వదిలేయాల్సిన పరిస్థితి రాకూడదని రైతులు భావిస్తున్నారు. గాలిలో తేమ శాతం అధికంగా ఉండే ప్రాంతంలో పండించే ఆయిల్‌పామ్‌ను ఉత్తర తెలంగాణలోనూ సాగు చేయవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకు అనువైన మొక్కలను కూడా విదేశాల నుంచి



తెప్పిస్తున్నారు. అయినా తొలుత నాటిన పంట దిగుబడిని చూసి ముందుకెళ్లాలని చాలామంది రైతులు వేచి చూస్తున్నారు.

నాలుగు జిల్లాల్లో మూడు కంపెనీల బైబ్యాక్ ఒప్పందం ద్వారా ప్రభుత్వం సాగు చేయిస్తుండగా క్రషింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆ సంస్థలు స్థలాలను కూడా తీసుకున్నాయి. గానుగ పరిశ్రమ ఏర్పాటుకు కనీస దిగుబడి ఉండాలి కాబట్టి యాజమాన్యాలు కొన్నిమాసాల తరువాత కంపెనీలను ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వచ్చిన గెలలను ఇతర ప్రాంతాల్లోని తమ పరిశ్రమలకు తరలిస్తున్నాయి. కాగా స్థానికంగా పరిశ్రమల్లేకపోవడం రైతులను సందేహంలో పడేస్తోంది.

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ. 44,000 వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా ఐదేళ్లనుంచి కాకుండా తొలి సంవత్సరం నుంచే పంట రుణాన్ని మంజూరివ్వాలని, పంటల బీమాను వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

# ఆలోచన ఉందా.. అద్భుతాలు చేయండి




కరీంనగర్ : అన్ని రంగాల్లో ఏఐ శరవేగంగా విస్తరిస్తోంది. ఈ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. విద్యార్థులు, యువతను భాగస్వాములను చేసి నూతన ఆవిష్కరణలకు స్వాగతం పలికే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, మై భారత్, నేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్తంగా యువ ఏఐ గ్లోబల్ యూత్ ఛాలెంజ్ పేరుతో పోటీలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ప్రతిభావంతులకు ప్రోత్సాహం, మరింత మెరుగైన అవకాశాలు కల్పించాలనేది దీని ముఖ్య ఉద్దేశం.

**వీటికి ప్రాధాన్యం**

నిజ జీవితంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పరిజ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలు, బాధ్యతాయుత వినియోగ పద్ధతులకు సంబంధించిన ఆలోచనలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. సామాజిక సాధికారత, ప్రాథమిక రంగాలు(వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా), స్మార్ట్ ఏకో సిస్టం, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర నగరాలు ఓపెన్ ఇన్నోవేషన్, పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాల్లో ప్రాజెక్టులు రూపొందించాల్సి ఉంటుంది.

**అర్హులు.. దరఖాస్తు విధానం**

ఇందులో పాల్గొనేందుకు 8వ తరగతి నుంచి పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ చదువుతున్నవారు ఒకరు లేక ఇద్దరు బృందంగా ఏర్పడి ఈనెల 30 లోపు %https///impact.indiaai.gov.in/eventsyuvai% ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు ప్రాజెక్ట్ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. విజేతలైన ప్రాజెక్టలను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దిల్లీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(దిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శిస్తారు.

**ఎంపిక ఇలా..** ప్రాథమిక ఎంపిక, ప్రాజెక్ట్ మెరుగుదల, ఇంటర్వ్యూ ద్వారా ప్రాజెక్ట్ విజేతలను ఎంపిక చేస్తారు. నిపుణుల పరిశీలనలో ఎంపికైన ప్రాజెక్టును ప్రభుత్వం దత్తత తీసుకునే అవకాశముంది. కృత్రిమ మేధో పరిజ్ఞానం, సృజనాత్మకత, ఆలోచనలు, బాధ్యతాయుత వినియోగ పద్ధతులకు చెందిన ఆలోచనలు చేయడం ద్వారా నగదు బహుమతి పొందే వీలు కల్పిస్తుంది. రూ.లక్షల్లో నగదుయువ ఏఐ గ్లోబల్ యూత్ ఛాలెంజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన రెండేసీ బృందాలు, ప్రత్యేక కేటగిరీలో మరో రెండు బృందాలను ఎంపిక చేస్తారు. మొదటి స్థానంలో నిలిచిన బృందాలకు రూ.15 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచినవారికి రూ.10 లక్షలు, ప్రత్యేక కేటగిరి కింద రూ.5 లక్షల చొప్పున అందజేయనున్నారు.

# పర్యావరణ హితం.. లాభాల్లో వ్యాపారం



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. సెర్ప్, మెప్మా పరిధిలోని సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలందిస్తున్నారు. అతివలకు మరింత ఆర్థిక ప్రోత్సాహం కల్పించేందుకు స్త్రీనిధి రుణాలను కేటాయించారు. వ్యవసాయంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం కల్పించారు.

**వడ్డీ భారం లేకుండా..**

సూక్ష్మ రుణాల బారినపడి ఆర్థికంగా చితికిపోతున్న మహిళలకు ఆర్థిక స్వాంతనగా నిలిచేందుకు 2011లో స్త్రీనిధి నిధులు ప్రారంభమయ్యాయి. రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. చిరు వ్యాపారాలు, వ్యవసాయం, వాహనాల కొనుగోళ్లు, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది సెర్ప్ పరిధిలో రూ.51.56 కోట్ల లక్ష్యం విధించగా.. ఇప్పటివరకు రూ.36.31 కోట్లు.. మెప్మాకు రూ.18.43 కోట్లకుగానూ రూ.13.61 కోట్లు పంపిణీ చేశారు.

**3147 యూనిట్లు లక్ష్యం**

జిల్లా వ్యాప్తంగా స్త్రీనిధికి 3147 యూనిట్లు కేటాయించారు. పాడి, కోళ్ల పరిశ్రమలతోపాటు ఈ–ఆటోలు, ఈ–బైక్, మహిళా క్యాంటీన్లు, సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు.. ఇలా 15 రకాల కేటగిరిలో రుణాలందిస్తున్నారు. లక్ష్యాలకనుగుణంగా సిబ్బంది ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నారు. రుణాల కిస్తీలు సకాలంలో చెల్లిస్తే పావలా వడ్డీ వర్తించనుందని చైతన్యం కల్పిస్తున్నాయి.

**నెలకు రూ. 18 వేల ఆదాయం**

నా భర్త డిజీల్ ఆటో నడిపేవారు. నెలకు ఇంధనం, ఇతర నిర్వహణకు రూ.6 వేలు ఖర్చయ్యేది. నెలంతా కష్టపడితే సగం వాటికే సరిపోయేది. స్త్రీనిధిలో రూ.3 లక్షలు తీసుకొని ఈ–ఆటో తీసుకున్నా. నెలకు రూ.20 వేలు వస్తున్నాయి. విద్యుత్తు రూ.1500 ఖర్చుపోను రూ.18,500 ఆదాయం వస్తుంది.

–రజిత, ఈ–ఆటో నిర్వాహకురాలు, కనగర్తి, పెద్దపల్లి మండలం

కేటాయించిన యూనిట్లు.. బర్రెల పెంపకం: 90 గొర్రె పిల్లలు: 90 పెరటి కోళ్లు: 150 తల్లి కోళ్ల పెంపకం: 3 క్యాంటీన్లు:2 ఆహారశుద్ధి పరిశ్రమలు:60 ఇంటి నిర్మాణం:150 ఈ–ఆటోలు: 30 ఈ–బైక్: 150 వీధి వ్యాపారుల రుణం:90 కేబుల్ ఆపరేటర్లు:90 రాజీవ్‌యువ వికాసం: 300 ఇతర వ్యాపారాలు: 1,790 సోలార్:2 ఇంటిపైభాగం సోలార్: 150

# పైకం ముడితేనే పత్రాలు చేతికి

మల్యాల: జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కాసులిస్తే కాని పని అంటూ ఏది లేదు. ఖాళీ స్థలాలకు అధికారులు ఇంటి నంబర్లు కేటాయిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్‌కు అధికారులు సెలవు పెడితే ఇన్‌ఛార్జిలు రెట్టింపు డబ్బులు వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు ఇంటి నంబరు కేటాయించి అందించే ధ్రువీకరణ పత్రం ఉండాలి. ఇటీవల మల్యాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన ఓ మహిళ పేరుమీది ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్‌కు అధికారులే ఇంటి నంబరు కేటాయించారని సమాచారం. కాసుల కక్కుర్తితో రిజిస్ట్రేషన్ అధికారులే ఖాళీ స్థలానికి ఇంటి నంబరు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ రోజు సదరు స్థలానికి ఇంటి నంబర్ లేదని సబ్ రిజిస్ట్రార్ పేర్కొనగా.. అదో రోజు ఆన్‌లైన్‌లో అదే స్థలానికి ఇంటి నంబరు 1–0గా ధ్రువీకరణ పత్రం జారీ కావడం గమనార్హం.

**మధ్యవర్తుల ప్రమేయంతో..**

బ్యాంకులో ఇళ్లు, ఇంటి స్థలాలు కుదవపెట్టి(మార్టిగేజ్) అప్పుతీసుకున్న వ్యక్తులు వాటిని తీర్చకుండా మరో వ్యక్తి పేర రిజిస్ట్రేషన్ చేయడంతో ఆరు నెలల క్రితం జగిత్యాలకు చెందిన ఓ బ్యాంకు అధికారులు మల్యాల రిజిస్ట్రేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

3 గుంటల కంటే అధిక స్థలానికి రిజిస్ట్రేషన్ చేయటానికి.. గుంటకు వేలల్లో ముట్టజెపితే రిజిస్ట్రేషన్ అమలవుతోంది. ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలో సాకులు చూపుతూ.. మధ్యవర్తుల ప్రమేయంతో డబ్బులు మాట్లాడుకుని పనిచేస్తున్నారు.

పాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ప్రకారం స్థల రిజిస్ట్రేషన్‌కు ఎల్.ఆర్.ఎస్ పేరుతో అభ్యంతరాలు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ మ్యారేజ్ ధ్రువీకరణ పత్రం కోసం కూడా రూ.500లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దస్తావేజు లేఖరుల ద్వారా రిజిస్ట్రేషన్ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. కొందరు దస్తావేజులేఖరుల సంపాదన రోజుకు రూ.5వేలకుపైగా ఉందంటే అధికారుల సంపాదన ఇంకెంత




ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

**ఆరోపణల్లో వాస్తవం లేదు**

మహిళ స్థలం రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటి నంబరు మేము కేటాయించలేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి దస్తావేజులేఖరులతో కాకుండా నేరుగా వస్తే 10 నిమిషాల్లో పత్రాలు అందజేస్తాం. మ్యారేజ్ ధ్రువీకరణ పత్రానికి డబ్బులు వసూలు చేయడం లేదు. కొందరు వ్యక్తులు చేసే ఆరోపణల్లో వాస్తవంలేదు. 2021 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే స్థలాలకు ఎల్.ఆర్.ఎస్ చెల్లించాలి.

– ఇమ్రాన్‌ఖాన్, సబ్‌రిజిస్ట్రార్, మల్యాల

**1–0 సంఖ్యతో కేటాయించం**

చెప్యాల గ్రామానికి చెందిన సదరు మహిళకు పంచాయతీ కార్యాలయం నుంచి ఇంటి నంబరు కేటాయించలేదు. ఖాళీ స్థలంలో ప్రహరీ నిర్మాణానికి అనుమతి మాత్రమే ఇచ్చాం. గ్రామ పంచాయతీ నుంచి 1–1 నుంచి మాత్రమే ఇంటి నంబరు అలాట్ చేస్తాం. 1–0 సంఖ్యతో కేటాయించం.

– స్వామి, చెప్యాల పంచాయతీ గ్రామకార్యదర్శి

# ఖాకీల ఠాణాల్లో.. కాసుల తందానా..!

సూర్యాపేట: శాంతిభద్రతల పరిరక్షణే పరమావధిగా విధులు నిర్వర్తించాల్సిన పోలీసుల్లో కొందరు వ్యవహరిస్తున్న తీరు బాధితులను కుదేలు చేస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కొన్ని ఠాణాల్లో పంచాయితీలకే పెద్దపీట వేస్తూ 'పంచుకుంటున్నట్లు' విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చే ఫిర్యాదుల్లో మాకేం లాభం అని వెదుక్కునే వారు భూవివాదాల్లో జోక్యం చేసుకుంటూ జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు హెచ్చరించినా పద్ధతిని మార్చుకోకపోవడంతో ఆ వ్యవస్థపైనే నమ్మకం సన్నగిల్లుతోందని బాధితులు వాపోతున్నారు.

కొన్నిస్టేషన్ల అధికారులు కేసుల్లో ప్రమేయం ఉన్న వారిని తప్పించేందుకు, స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దాదాపు పది నెలల కిందట సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్సై ఓ కేసులో సంబంధం ఉన్న వ్యక్తి పేరును తొలగించేందుకు భారీగా డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీకి పట్టించారు. మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌కు స్థిరాస్తి వ్యాపారులు వెంచర్ కోసం కొనుగోలు చేసిన నాలుగెకరాల వ్యవసాయ భూమికి సంబంధించి యజమానికి డబ్బుల చెల్లింపుల్లో జరిగిన జాప్యంపై ఫిర్యాదు వచ్చింది. ఆ విషయంలో నేరుగా పోలీస్



ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిష్కరించినట్లు తెలిసింది. అందుకు పెద్దమొత్తంలోనే డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. కోదాడ సబ్ డివిజన్ పరిధిలోని ఓ ఠాణాలో పనిచేస్తున్న ఎస్సై సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తించిన అధికారులు అక్కడి విధుల నుంచి తప్పించాలనుకున్నారు. కానీ, రాజకీయ పలుకుబడితో ఎలాంటి చర్యలు లేకుండానే అదే కుర్చీలో కూర్చుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**బాధితులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు**

నరసింహ, ఎస్పీ, సూర్యాపేట

న్యాయం కోసం వచ్చినప్పుడు స్టేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే బాధితులు వారిపై నేరుగా మాకు ఫిర్యాదు చేయొచ్చు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ఉమ్మడి జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోలు పంచాయితీలకే మొగ్గుచూపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డబ్బులు ఇచ్చిపుచ్చుకునే విషయంలో తలెత్తే వివాదాలు, ప్రైవేటు చీటీల వ్యవహారం, భూముల సరిహద్దు ఘర్షణలు, స్థిరాస్తి వ్యాపారుల మధ్య గొడవలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. ఆ పంచాయితీల పరిష్కారం స్టేషన్ పరిసరాలకు దూరంగా జరిగేలా చేస్తున్నారు. మధ్యవర్తుల్లో తమకు అనుకూలురైన వారుండేలా చూసుకుంటున్నారు. గొడవ సద్దుమణిగాక వారి చేత డబ్బులు వసూలు చేయిస్తున్నట్లు సమాచారం.

# చెత్తంతా చెరువుల్లోకి.. విషమంతా తనువుల్లోకి..!

నల్గొండ: సాగు, తాగు అవసరాలకు ఉపయోగపడే చెరువులు వ్యర్థాలతో చెత్తకుండీలుగా మారాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 3,500 వరకు పెద్ద చెరువులున్నాయి. 60 శాతం మేర సమీప పరిశ్రమల నుంచి వ్యర్థాలతో కలుషితమవుతున్నాయని జల సంరక్షణ నివేదికల సర్వేలు వెల్లడిస్తున్నాయి. చెరువుల్లో కలుషితాల వ్యాప్తికి కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు చేపడితేనే వ్యర్థాలతో కలిగే అనర్థాలు నియంత్రణలోకి వస్తాయని నీటి సంరక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

నాంపల్లి మండలం నాగుల చెరువులో సమీప ప్రాంతాల చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులు పెద్దఎత్తున డ్రమ్ముల్లో తీసుకువచ్చి పారవేసి వెళ్తున్నారు. వ్యర్థాల మూలంగా ఈ ప్రాంతంలోకి వెళ్తే భరించలేని దుర్వాసన వస్తోంది. నల్గొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువులో అండర్‌డ్రైనేజీ నీరు కలుస్తుందని పలుమార్లు స్థానికులు పురపాలిక అధికారులకు విన్నవించినా.. ఫలితం లేదు.


సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఎల్లారం చెరువులో కోదాడ, సూర్యాపేట, నేరేడుచర్ల ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను తెచ్చి పారవేసి వెళ్తున్నారు. చేపలు పెరిగేందుకు మాంసం వ్యర్థాలను వేస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ః మేళ్లచెరువు, మిర్యాలగూడ, దామరచర్ల, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం మిల్లులు, సిమెంట్ పరిశ్రమలు సైతం కాలువల ద్వారా సమీప చెరువుల్లోకి వ్యర్థాలను వదులుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు, వలిగొండ, అడ్డగూడూరు, బీబీనగర్, చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి మండలాల్లోని పలు గ్రామాల్లోని చెరువుల్లో కాలుష్య వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తున్నారు. కొందరు రాత్రి రసాయన వ్యర్థాల ద్రావణాలను ట్యాంకర్ల ద్వారా తెచ్చి అత్యంత ప్రమాదకరమైన వ్యర్థాలను పారవేస్తున్నారు. తమ పరిశ్రమల పరిధిలోనే వ్యర్థాలను నిర్వీర్యం చేయాల్సి ఉండగా సమీపంలో, శివారులో ఉండే చెరువుల్లో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా డంపింగ్ చేయడం గమనార్హం. ఈ నీటిని పొలాలకు ఉపయోగించడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**నోటీసులు ఇస్తున్నాం** ఔషధ, సిమెంట్, రైస్‌మిల్లులు, రంగుల పరిశ్రమల నిర్వాహకులకు గతంలో నోటీసులు ఇచ్చి జరిమానాలు విధించాం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధాన చెరువుల్లో మాంసం వ్యర్థాలను పారవేస్తున్న వారిపై నిఘా పెట్టి వారికి జరిమానాలు విధిస్తాం. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులను పంపించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అజయ్‌కుమార్, సీఈ, నీటిపారుదలశాఖ

# కటిక నేలపై.. చలికి వణుకుతూ...

హైదరాబాద్: చలికాలం ప్రారంభమైంది. ఒకవైపు.. దోమల బెడద.. మరోవైపు కప్పుకోవడానికి ఒంటి నిండా దుప్పట్లు లేక గజగజ వణకుతున్నారు.నిమ్స్, నిలోఫర్, ఎంఎన్‌జే, ఉస్మానియా, గాంధీ తదితర ప్రభుత్వాసుపత్రుల వద్ద చాలీచాలనీ షెల్టర్లతో రోగుల సహాయకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాటిల్లో చికిత్సలకు తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వందల మంది రోగులు వస్తుంటారు. వారి వెంట ఇద్దరు, ముగ్గురు సహాయకులూ ఉంటారు. కొందరు ఓపీలో చికిత్స తీసుకొని సాయంత్రానికి తిరిగి వెళ్లిపోతుంటారు. మరికొందరికి మాత్రం.. వైద్యుడు చూశాక టెస్టులు రాస్తే ఒకటి లేదా రెండు రోజుల



వరకు అక్కడే ఉండాలి. శస్త్రచికిత్సలు, రేడియేషన్ లాంటివి అవసరమైతే మూడు, నాలుగు రోజులపాటు నిరీక్షణే. రోగులు సైతం ఆసుపత్రిలో చేరాలి. ఈ క్రమంలో ఒక్క సహాయకుడినే లోపలకు అనుమతిస్తారు.

**వేధిస్తున్న మౌలిక వసతుల కొరత**

నిమ్స్, ఉస్మానియా, గాంధీ, ఎంఎన్‌జే, నిలోఫర్, పేట్లబుర్జు తదితర దవాఖానాలకు రోజూ 7-10 వేల మంది రోగులు వస్తుంటారు. వారిలో వెయ్యి నుంచి 1200 మంది వరకు ఆసుపత్రుల్లో చేరుతుంటారు. వారితోపాటు వచ్చే సహాయకుల సౌకర్యార్థం.. ఆయా ఆసుపత్రుల వద్ద షెల్టర్లు నిర్మించినా ఎటూ సరిపోవడం లేదు. వాటి వద్ద మౌలిక వసతులలేమి కూడా వేధిస్తోందని, సులభ్ కాంప్లెక్సులకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. నిమ్స్‌లో షెల్టర్లు కూడా రోగుల రద్దీకు అనుగుణంగా లేవు. దీంతో కటిక నేలపై చలికి వణుకుతూ నిద్రించాల్సి వస్తోంది.

# నెల తిరగకముందే వసూళ్లా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ఇళ్ల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతుండగా వాణిజ్య సంస్థల నుంచి సేకరణ బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. నిబంధనల ప్రకారం వీరు ఈ నెల 1 నుంచి నగరంలోని 14.5 కిలోమీటర్ల పొడువునా రహదారికి ఇరువైపులా ఉన్న అన్ని రకాల వాణిజ్య సంస్థలు, దుకాణాల సముదాయాల నుంచి చెత్త సేకరణ చేయాల్సి ఉంది. అయితే ముందుగానే వసూళ్లకు పాల్పడుతున్నారు. నగరవ్యాప్తంగా ఈ తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నెల మొత్తం చెత్త సేకరణ చేసిన తర్వాత నోటీసులు ఇచ్చి టెండర్‌లో పొందుపర్చిన విధంగా వసూలు



చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ.61 లక్షలతో టెండరు**

వాణిజ్య సంస్థలు, దుకాణాల నుంచి చెత్త సేకరించి యూజర్ ఛార్జీలు వసూలు చేసుకోవడానికి నగరపాలక సంస్థ ఆరు నెలల కిందట రూ.61.09 లక్షలతో టెండర్ నిర్వహించి ఖరారు చేసింది. సదరు సంస్థ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా ఆదేశాలు జారీ చేశారు. అయితే వీరు అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నారని, సకాలంలో చెత్త తరలించడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దుకాణాన్ని బట్టి బల్దియా ధరలు ఖరారు చేయగా ఏజెన్సీ మాత్రం అవేవీ పాటించడం లేదని తెలుస్తోంది.

**అంతర్గత వీధుల్లోకొచ్చి..**

ప్రైవేటు ఏజెన్సీ ప్రధాన రహదారి వెంబడి వాణిజ్య సముదాయాల నుంచి చెత్త తీసుకెళ్లడానికి నిర్ణయించగా అంతర్గత వీధుల్లోకి పరుగులు పెడుతోంది. అపార్ట్‌మెంట్ల దగ్గరికి వెళ్లి నోటీసులిచ్చి చెత్త సేకరణ చేస్తామంటున్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు బహుళ అంతస్తుల్లో చెత్త సేకరణకు ఇళ్లు లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.

# దిశ లేకపాయె..!

నల్గొండ: మొంథా తుపాను ప్రభావంతో వరిధాన్యం తడిచి మొలకలు వచ్చాయి. పత్తి పంట వర్షార్పణమైంది. ఉద్యాన పంటలు ఏ ఆధారం లేకుండా పోయాయి.  ఈ తరుణంలో.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించేందుకు ఎంపీ ఛైర్మన్‌గా వ్యవహరించే జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో తేలడం లేదు. ఎంపీ కీలక పాత్ర పోషించాల్సిన కమిటీ అంతిమ లక్ష్యం..కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఎన్నో పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవడమే. రైతుల సమస్యలతో పాటు గ్రామాలు, పట్టణాల్లో తాగు, సాగు, రహదారి వసతులు అరకొరగా ఉన్నాయి. అభివృద్ధి నిధులున్నా ప్రగతి ముందుకు సాగడం లేదు. సంక్షేమ పథకాలు అటకెక్కాయి. పేదల అభ్యున్నతికి అమలవుతున్న నిధులు మూలుగుతున్నాయి.ప్రతి సంవత్సరంలో మూడునెలలకోసారి సమావేశం నిర్వహించాల్సి ఉండగా గతేడాది ఒకసారి మాత్రమే నిర్వహించారు. ఈ ఏడాది అసలు లేనే లేదు. గత ఏడాది నవంబరు 22న జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ విషయాలను నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డితో 'ఈనాడు' ప్రస్తావించగా..త్వరలో 'దిశ' కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని వివరించారు.

నల్గొండ జిల్లావ్యాప్తంగా సిమెంట్, గ్రానైట్, ఇసుక క్వారీలు, ఇతరత్రా పరిశ్రమల నిర్వహణతో వచ్చే నిధులతో పనులు శరవేగంగా జరగాల్సి ఉంటుంది. పత్తి, వరి రైతులకు మద్దతు ధరలు కల్పించే నిర్ణయాలు, ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ్‌యోజన పథకం కింద ప్రభావిత గ్రామాలకు కేటాయింపులు, ఎంపీ ల్యాడ్స్ కింద రూ.5 కోట్లను ప్రతి ఏడాది కేటాయిస్తున్నారు. ఇందులో నియోజకవర్గాల వారీగా ఏయే అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంటుందో చర్చించాలి. ప్రధానమంత్రి సడక్, ముద్ర, ఆవాస్ యోజన, సికింద్రాబాద్ నుంచి గుంటూరు వయా నల్గొండ, మిర్యాలగూడ, రైల్వే స్టేషన్ల విస్తరణ, ఇతర పనులపై కూడా చర్చించాల్సి ఉంటుంది.

# దుప్పట్లు రాలేదు.. మంచాలు లేవు



హుజూరాబాద్ : కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుతుండటంతో చలి బాగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని హాస్టళ్లకు దుప్పట్లు రాకపోగా, మరికొన్నింట్లో మంచాలు లేక కింద పడుకోవాల్సి వస్తోంది. చాలా చోట్ల విరిగిన కిటికీలు, తలుపులు ఉండటంతో చలి తీవ్రత పెరిగి విద్యార్థులు వణుకుతున్నారు. సరిగ్గా నిద్ర పట్టక చదువుల మీద శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

**సమస్యల నిలయాలుగా..**

జిల్లావ్యాప్తంగా మొత్తం 30 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఇందులో మూడు నుంచి పదో తరగతి వరకు 1,182 మంది ప్రీమెట్రిక్ విద్యార్థులుండగా ఇంటర్ నుంచి పీజీ వరకు 1,539 మంది పోస్ట్ మెట్రిక్ విద్యార్థులున్నారు. మొత్తం 19 బీసీ వసతి గృహాలున్నప్పటికీ అన్నింట్లో ఏదో ఒక సమస్యతో వసతులు లేక దయనీయంగా తయారయ్యాయి. హుజూరాబాద్ బీసీ బాలుర వసతి గృహంలోని 30 మంది విద్యార్థులకు దుప్పట్లు, మ్యాట్లు ఇచ్చారు కానీ మంచాలు లేవు. జమ్మికుంట బాలుర వసతి గృహంలోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులంతా ఒకే గదిలో అందరూ కలిసి నేలపై పడుకుంటున్నారు. పలు చోట్ల కిటికీలు విరిగి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాటికి ఏర్పాటు చేసిన జాలీలు చిరిగిపోయాయి. చలితోపాటు దోమలు కూడా వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**టెండర్లు పూర్తయ్యాయి**

విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు ఇంకా అందలేదు. వీటి టెండర్ల ప్రక్రియ ఇటీవలే పూర్తయింది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. అతి త్వరలో వసతి గృహాలవారీగా విద్యార్థులకు అందజేస్తాం. ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నాం.

– నాగులేశ్వర్, డీడీ, కరీంనగర్

ప్రీమెట్రిక్ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు దుప్పట్లు నేటికీ రాలేదు. కొందరు ఇంటి నుంచి దుప్పట్లు తీసుకొచ్చుకోగా మరికొందరు వసతి గృహాల్లో ఇస్తారని తెచ్చుకోలేదు. కొన్ని వసతి గృహాల్లో దుప్పట్లతోపాటు మంచాలు లేక నేల మీదే నిద్రిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉంటున్న పరిసరాలతో నేల మీద పడుకోవడం ప్రమాదకరమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

# కాలగర్భంలో కాకతీయుల కళావైభవం



సైదాపూర్: ఎంతో ప్రాశస్త్యం కలిగి.. ఒకప్పుడు భక్తులతో కళకళలాడిన కాకతీయులు నిర్మించిన పంచలింగ శివాలయానికి(త్రికూటాలయం) ఆదరణ కరవైంది. మొదటి వేములవాడగా పిలిచే ఈ ఆలయాన్ని పట్టించుకోకపోవడంతో పూజలు నిలిచిపోయాయి. భక్తులు రావటమే గగనమైంది. సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామ సమీపంలో కాకతీయులు నిర్మించిన ఈ ఆలయానికి వందేళ్ల క్రితం వరకు పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేవారు. కాలక్రమేణ ఆదరణ కోల్పోయి అద్భుత కళాసంపద కాలగర్భంలో కలుస్తోంది. దేవాదాయశాఖ అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అప్పటి రాష్ట్రమంత్రి పీ.వీ రంగారావు కొన్ని నిధులు విడుదల అయ్యేలా చూడగా.. పనులు నాటి పాలకులు మధ్యలోనే వదిలేశారు.

**గొడిశాల గుళ్లుగా పిలిచేవారు**

రేచర్లరుద్రుడు సామంతరాజుగా ఉన్న కాటయ్య హయాంలో ఆలయం నిర్మించారు. దీనిని గొడిశాల గుళ్లుగా పిలుస్తారు. కాకతీయుల కళాతృష్ణకు ఇక్కడి రాతి శిల్పాలు, శిలాశాసనాలు, నంది విగ్రహాలు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఆలయాన్ని 16 పెద్ద రాతి స్తంభాలపై నక్షత్రాకారంగా శిల్పకారులు అద్భుతంగా మలిచారు. రామప్ప ఆలయం స్ఫూర్తిగా కాటయ్య ఈ గుడిని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తూర్పున నంది విగ్రహం, పడమర, ఉత్తరం, దక్షిణ భాగంలో మూడు శివలింగాలు ఉండటంతో త్రికూటాలయంగా పేరొందింది. **గుప్త నిధుల కోసం తవ్వకాలు**

ఆలయంలో బంగారు నిధులు ఉన్నాయని ప్రచారం కావటంతో దుండగులు రాత్రివేళల్లో చుట్టూ, లోపల తవ్వకాలు చేపట్టి విగ్రహాలను ధ్వంసం చేశారు. ఇలా పలుమార్లు తవ్వకాలు జరిపారు. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో శివలింగాలు తవ్వి, నంది విగ్రహం జరిపి, కొలనులో తవ్వి ఆలయ ఉనికే లేకుండా చేశారు.

# ఆడుతూ పాడుతూ.. దిద్దాలి ఓనమాలు




ఎల్లారెడ్డిపేట: ఆడుతూ పాడుతూ చిన్నారులు ఓనమాలు దిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నాలుగేళ్ల వయసు దాటిన పిల్లలకు ప్రభుత్వమే యూకేజీ విద్యనందించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతోంది. అందుకు సమగ్ర శిక్షాభియాన్ కింద భారీ మొత్తంలో నిధులను కేటాయిస్తున్నారు. ఈ నిధులతో అధునాతన సౌకర్యాలను కల్పించనున్నారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులను ఆకర్షించేలా మరో కిడ్స్ కేర్ కేంద్రాలను తలపించనున్నాయి. ప్రీ ప్రైమరీ విద్య తర్వాత పిల్లలు అదే ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరడం మూలంగా విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఆట పాటలతో కూడిన బోధనా పద్ధతుల్లో తీర్చిదిద్దే విషయంపై సమగ్ర శిక్షాభియాన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

**జిల్లాలో 13 బడుల్లో..** జిల్లాలో 13 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు రూ.1.70 లక్షల చొప్పున కేటాయించనున్నారు. 13 పాఠశాలలకు కలుపుకొని మొత్తం రూ. 22.10 లక్షలను వెచ్చించనున్నారు. ఈ నిధులతో ఆట పాటలతో చిన్నారులకు బోధించేందుకు చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నిచర్, ఆటవస్తువులు, అవుట్ డోర్ ప్లే మెటీరియల్, షూ, బెల్టు, పాఠశాల బ్యాగులు, ఏకరూప దుస్తులను సమకూర్చనున్నారు. వీటితోపాటు తరగతి గదుల గోడలకు రంగులు వేసి, అందమైన బొమ్మలను చిత్రీకరించనున్నారు. బడికి వెళ్లాలంటే మారాం చేసే చిన్నారులను ఆట వస్తువులు, గోడలకు వేసే వివిధ రకాల చిత్రాలు ఆకర్షించనున్నాయి. తల్లిదండ్రులను కూడా ఆకట్టుకోనున్నాయి. దీంతో పిల్లలు ఉత్సాహంగా ప్రీ ప్రైమరీ పాఠశాలలకు వెళ్తారని అధికారులు భావిస్తున్నారు. పలు రకాల వస్తువులు, ఆట బొమ్మలు, రంగు రంగుల ఆకారాలు వంటివి అందించనుండటంతో చిన్నారులు చదువుపై ఆసక్తి కనబరుస్తారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పాఠశాల తరగతి గదులు ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్దనున్నారు. సర్కారు అందించే ప్రీ ప్రైమరీ విద్యతో తల్లిదండ్రులకు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు అయ్యే ఖర్చులు మిగలనున్నాయి. **కలెక్టర్ ఆదేశాలే తరవాయి..** జిల్లాలో ఇప్పటికే ఏయే పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలను నిర్వహించాలనే విషయంపై అధికారుల నుంచి స్పష్టత వచ్చింది. ఈ మేరకు ఆట పాటలతో కూడిన యూకేజీ విద్యనందించేందుకు ఆయా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను గుర్తించారు. వీటిని నడిపేందుకు ఇన్‌స్ట్రక్టర్ (తాత్కాలిక ఉపాధ్యాయులు), ఆయాల నియామకాలు చేపట్టారు. ఇంటర్మీడియట్, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన వారిని ఎంపిక చేశారు. వీరి నియామకంలో స్థానికతకు ప్రాధాన్యం ఇస్తూ ముఖాముఖి పరీక్ష కూడా పూర్తి చేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8 వేలు, ఆయాకు నెలకు రూ.6 వేలను వేతనంగా చెల్లించనున్నారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వెలువడగానే నూతన సొబగులతో పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభం కానున్నాయి.

# కుటుంబ మేలు తలపెట్టి.. పలుగు, పార పట్టి..!

రాజపేట : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నిలువరించి నిరుపేదలకు ఉపాధి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి కనీసం 100 రోజుల పనిదినాలు కల్పిస్తున్నారు. ఈ పథకంలో మహిళామణులే అధికంగా భాగస్వాములవుతున్నారు. ఇంటి పనులను చక్కదిద్దడంలో ముందుండే మహిళలు కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు 'ఉపాధి' పనుల బాట పడుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో ఎప్పటికప్పుడు గ్రామీణ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేస్తూనే ఉంది. జిల్లాలో పురుషులకంటే మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగ పరచుకోవడం సంతోషంగా ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డికు తెలిపారు.

**అవసరాలకు ఆసరా...**

ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద చెరువులు, కుంటలు, కాల్వల్లో



పూడికతీత, ఇంకుడుగుంతలు, ఫామ్‌పాండ్స్, ఫిష్ పాండ్స్, గట్ల నిర్మాణం, బీడు భూముల అభివృద్ధి, పశువులు, జీవాలకు షెడ్ల ఏర్పాటు తదితర పనులు చేస్తున్నారు. కొంచం కష్టంతో కూడిన పనులే అయినా మహిళలు వెరవకుండా పురుషులకు దీటుగా ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఎక్కడ ఉపాధి పనులు జరిగినా మహిళలే రెట్టింపు సంఖ్యలో కనిపిస్తున్నారు.ఇంట్లో ఖాళీగా కూర్చోలేక ఉపాధి పనులకు వెళున్నామని, నిత్యావసర ధరలు, పిల్లల చదువు ఖర్చులు పెరిగిన దృష్ట్యా ఈ పథకం కింద వస్తున్న డబ్బులు కుటుంబ అవసరాలకు ఆసరాగా ఉంటున్నాయని మహిళలు చెబుతున్నారు.పథకం కింద ఇప్పుడు రోజుకు రూ.307 ప్రభుత్వం ఇస్తుండగా, చాలా మంది మహిళలు రూ.300 వరకు కూలీ తీసుకుంటున్నట్లు సమాచారం.

# విద్యుత్తు వినియోగమే ఆధారం..!

ఖమ్మం : స్టోన్ క్రషర్స్ (రాతి కంకర మిల్లులు)పై ప్రభుత్వం సాంకేతిక పంజా విసురుతోంది. ఇప్పటివరకు ఇష్టారాజ్యంగా క్రషింగ్ జరుపుతూ, తప్పుడు లెక్కలతో సర్కారు ఆదాయానికి గండికొడుతున్న కొన్ని స్టోన్ క్రషర్స్‌ను సక్రమ మార్గంలో నడపటం, ఆదాయం పెంచుకునేందుకు కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. ఇవి డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**సీసీ కెమెరాలు  అమర్చాల్సిందే..**

స్టోన్ క్రషర్స్‌లో విద్యుత్తు వినియోగం ఆధారంగా ఎంత ముడిరాళ్లు క్రషింగ్ చేశారనే లెక్క మేరకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. స్టోన్ క్రషర్ నిర్వాహకులు ముడిరాళ్లను ఎక్కడి క్వారీల నుంచైనా తెచ్చుకోవచ్చు. క్వారీ నుంచి వచ్చే ముడిరాళ్లకు రాయల్టీ చెల్లించి.. పర్మిట్ పొంది.. వాహనంలో రవాణాకు వేబిల్లు తీసుకోవాలి.

తెచ్చిన ముడిరాళ్లను క్రషింగ్ చేసేందుకు వినియోగించిన విద్యుత్తు ఆధారంగా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించారా లేదా అనే లెక్క అధికారులు  తేల్చనున్నారు. రాయల్టీ చెల్లించకుండా ముడిరాళ్లు తెచ్చి క్రషింగ్ చేస్తే విద్యుత్తు వినియోగం ఆధారంగా అధికారులు లెక్కించి.. ఎక్కువగా క్రషింగ్ విషయం నిర్ధారించుకుని ఐదు రెట్లు జరిమానా విధించనున్నారు.ఖమ్మం జిల్లాలో.. స్టోన్ క్రషర్స్ 35 (వీటిలో పనిచేస్తున్నవి 25) ఉన్నాయి. నెలకు సగటున 2 లక్షల మెట్రిక్ టన్నుల కంకర ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత విధానం ద్వారా జిల్లాలో నెలకు రూ.1.20 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. నూతన విధానం అమల్లోకి వస్తే నెలకు రూ.2కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందని అంచనా. మెట్రిక్ టన్ను  ముడిరాళ్లకు రాయల్టీ, ఇతర పన్నులు కలిపి  రూ.160 చెల్లించాలి. ప్రతి స్టోన్ క్రషర్ నిర్వాహకులుఒక మెట్రిక్ టన్ను ముడిరాళ్ల క్రషింగ్‌కు నాలుగు యూనిట్ల విద్యుత్తు అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

స్టోన్ క్రషర్స్‌లోని విద్యుత్తు మీటర్ నంబర్లు, రీడింగ్ వివరాలు ప్రతినెలా విద్యుత్తు పంపిణీ సంస్థ యాప్, వెబ్‌సైట్‌లో నమోదవుతున్నాయి.

అన్ని స్టోన్ క్రషర్స్‌లో సీసీ కెమెరాలు, వాహనాల నంబర్లు క్యాప్చర్ చేసే కెమెరాలు అమర్చాలి. వీటన్నింటి ఐపీ అడ్రస్‌లతో పాటు జిల్లాకేంద్రంలో మైనింగ్ ఏడీ అధికారుల మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేయాలి. ప్రతినెలా 10వ తేదీ నాటికి క్రషర్స్ నిర్వాహకులు మాసం రోజుల్లో ఎంత ముడిరాళ్లు తెచ్చింది, ఎంత క్రషింగ్ చేసింది, నిల్వ ఎంత ఉందనే వివరాలు  సమర్పించాలి. ఈనెలలో ప్రభుత్వానికి రూ.50వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.స్టోన్‌క్రషర్స్ నిర్వహణలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానం డిసెంబర్ 1 నుంచి అమలవుతుందని గనులశాఖ ఏడీ రావూరి సాయినాథ్‌కు తెలిపారు.

# పెగళ్లపాడులో గరుడ యాప్‌తో భూసర్వే

తెలంగాణ భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ గ్రామాల వారీగా భూములను వేర్వేరు పద్ధతుల్లో సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొబైల్ యాప్‌తో భూములు సర్వే చేసేందుకు రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడు గ్రామాన్ని ఎంపిక చేశారు. ట్రాక్ అనే సంస్థ ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్), రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మొబైల్ యాప్ రూపొందించింది. దీనికి 'గరుడ' యాప్‌గా నామకరణం చేసింది. ఈ యాప్‌లో ముందుగా ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామం పహాణీలోని సర్వేనంబర్, విస్తీర్ణం, పట్టాదారు పేరు సహా ఇతర వివరాలను నిక్షిప్తపరుస్తారు. క్షేత్రస్థాయికి వెళ్లి యాప్‌లోని పహాణీ ఆధారంగా సర్వే నంబర్ వారీగా భూమిని సర్వే జరిపి.. అక్షాంశ, రేఖాంశాలతో లొకేషన్ నమోదు చేయటం ద్వారా షేప్ ఫైల్ మ్యాప్ జనరేట్ అవుతుంది. దాన్ని అక్కడే అప్‌లోడ్ చేస్తారు. పహాణీలో రైతు భూమి వివరాలతో పాటు సర్వే మ్యాప్ (పటం) ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వస్తుంది. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్  సమయంలో అక్రమాలకు తావుండదు. భూముల వివరాలు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ సర్వే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులుకు తెలిపారు.

ఈ ప్రక్రియ ద్వారా భూసర్వేలో కచ్చితత్వం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం), రోవర్స్, డ్రోన్లు ఉపయోగించి భూసర్వే చేస్తున్నారు. తాజాగా గరుడ మొబైల్ యాప్ ప్రవేశపెడుతున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సర్వే బాధ్యతలు అప్పగించే అవకాశముంది.

# విడుదలలో జాప్యం.. ఉపాధిపై ప్రభావం

బోయినపల్లి : మత్స్యకారుల జీవనోపాధికి జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లలను ఏటా వదులుతుండగా.. ఈ ఏడాది జాప్యం నెలకొంది. ప్రతి సంవత్సరం ఆగస్టు లేదా సెప్టెంబరు నెలల్లో పంపిణీ చేస్తుండగా.. సకాలంలో వదలకపోవడంతో ఎదుగుదలపై ప్రభావం పడుతుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. జిల్లాలో బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద రాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు), గంభీరావుపేట మండలం నర్మాలలో ఎగువమానేరు, ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద అన్నపూర్ణ, కోనరావుపేట మండలంలో మల్కపేట రిజర్వాయర్‌లు ఉన్నాయి. వీటితోపాటు ఎంపిక చేసిన చెరువుల్లో చేప పిల్లలను వేయాల్సి ఉంది.

**ఇటీవల పరిశీలించి వచ్చారు**

జిల్లాలో సుమారు 168 మత్స్యపారిశ్రామిక సంఘాలు ఉండగా.. 9526 మంది సభ్యులున్నారు. ఏటా చెరువుల్లో 35-40 ఎంఎం, జలాశయాల్లో 80-100 ఎంఎం బరువు గల రాహు, బంగారు తీగ, బొచ్చె రకం నెలరోజుల వయస్సు చేప పిల్లలను వదులుతున్నారు. వేసవికాలం వరకు జలాశయంలో చేపలు ఒక్కోటి సుమారు కిలో నుంచి 20 కిలోల బరువు పెరుగుతాయి. గత ఏడాది సకాలంలో పంపిణీ జరగక అనుకున్న లక్ష్యం చేరలేదు. మత్స్యకారుల ఉపాధిపై ప్రభావం పడింది. ఈ సంవత్సరంలో చేప పిల్లల విడుదల టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ప్రాంతానికి చెందిన గుత్తేదారుల వద్ద చేప పిల్లలను ఇటీవల అధికారులు పరిశీలించి వచ్చారు. గతేడు సకాలంలో చేప పిల్లలు విడుదల చేయకపోగా లక్ష్యం తగ్గించారు.

**విడుదల లక్ష్యం ఇలా..**



మధ్యమానేరు జలాశయంలో 28.50 లక్షలు, ఎగువ మానేరులో 10.50 లక్షలు, అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 13.69 లక్షలు, మల్కపేట రిజర్వాయర్‌లో 7.49 లక్షల వదలనున్నారు.

మల్కపేట జలాశయంలో మొదటిసారి వదలాలని అధికారులు నిర్ణయించారు.

44 శాశ్వత(నీరు నిల్వ ఉండే) చెరువుల్లో 20 లక్షలు, 410 వర్షాధారిత(సీజనల్) చెరువుల్లో 68.53 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు.

గత ఏడాది తక్కువ వదిలారు

మధ్యమానేరు జలాశయంలో చేపల వేటతో ఉపాధి పొందుతున్నాను. అదను దాటుతున్న చేప పిల్లలను జలాశయంలో వదలలేదు. చేప ఎదుగుదలపై ప్రభావం పడి మా ఉపాధి దెబ్బతింటుంది. గత ఏడాది తక్కువ పిల్లలను వదిలారు.

దేవయ్య, మత్స్యకారుడు, కొదురుపాక

త్వరలోనే పంపిణీ జలాశయాలు, చెరువుల్లో త్వరలోనే చేప పిల్లలను వదలడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల పిల్లలను పరిశీలించి వచ్చాం. 148.71 లక్షలు వదలాలని లక్ష్యంగా నిర్దేషించుకున్నాం. లక్ష్యం మేరకు చెరువులు, జలాశయాల్లో వదులుతాం. సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

# సేవలు విస్తృతం.. శస్త్రచికిత్సల్లో ప్రథమం

పెద్దపల్లి : ప్రథమ చికిత్సలకే పరిమితమైన పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి.. కొన్ని రోజులుగా గణనీయమైన ప్రగతి కనబరుస్తోంది. ప్రసవాలతోపాటు శస్త్రచికిత్సల్లోనూ పురోగతి సాధించి, రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించింది. మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందుతుండటంతో గడిచిన సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో 250 ప్రసవాలు జరిగాయి. ఇదే తరహాలో ఆర్థోపెడిక్, దంత వైద్యంతోపాటు సాధారణ శస్త్రచికిత్స లు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. వైద్యవిధాన పరిషత్తు పరిధిలోని జిల్లా ఆస్పత్రుల్లో ఉత్తమ స్థాయిలో



వైద్య సేవలందుతున్నాయి. దీనికి పెద్దపల్లి ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్రచికిత్సలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.7.10 కోట్ల విలువైన ఆరోగ్య శస్త్రచిక్సితలు నిర్వహించారు.

అందుబాటులోకి ఎన్‌వీపీ పరీక్షలు

రోగికి వ్యాధి నిర్ధారణ జరిగితేనే చికిత్స సులభమవుతుంది. ఇదే సిద్దాంతాన్ని ఇక్కడి వైద్యులు అనుసరిస్తున్నారు. ఇక్కడి టీ హబ్‌లో వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తుండటంతో ఆస్పత్రిపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ఈ క్రమంలోనే వివిధ రకాల వైద్యసేవలు పొందేందుకు ప్రజలు జిల్లా ఆస్పత్రిని ఎంపిక చేసుకుంటున్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి, కడుపులోని శిశువు గుండె స్థితిని తెలుసుకునే ఎన్‌ఎస్‌పీ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. టీపాస్కాన్, నవజాత శిశువు కేంద్రంలో వెంటిలేటర్లు, ఫొటో థెరపి యంత్రాలు, వార్మర్లు అందుబాటులో ఉన్నాయి. ఆర్థోపెడిక్, డెంటల్, కంటి చికిత్సలకు సంబంధించి అన్నిరకాల ఆధునిక యంత్ర పరికరాలతోపాటు ఫిజియోథెరఫికి సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

# ఉత్సాహమున్నా.. ప్రోత్సాహం కరవే!



పరిగి : మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు విశేషంగా కృషి చేస్తోంది. పెట్రోల్ బంకులు మొదలుకొని ఇటుకల తయారీ, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు వరకు అవకాశాలు కల్పిస్తోంది. జిల్లాలో మాత్రం ఇప్పటివరకు ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. వీటిని నిర్వహించాలన్న ఆసక్తి పొదుపు సంఘాలకున్నా.. క్షేత్రస్థాయిలో ఆ దిశగా అడుగులు మాత్రం పడటం లేదు. అధికారులు రేపుమాపంటూ కాలయాపన చేస్తున్నారు.

**పొరుగు జిల్లాలు భేష్..**

పక్క జిల్లాలైన నారాయణపేట, సంగారెడ్డి మాత్రం ముందంజలో దూసుకుపోతున్నాయి. రూ.లక్షల్లో వ్యాపారం నిర్వహిస్తున్నాయి. ఇక్కడ మాత్రం మహిళలు చిన్నాచితకా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తొలి దశలో తాండూరు, వికారాబాద్ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామని స్థలం పరిశీలించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు చెప్పినా ప్రారంభించడంలో జాప్యమవుతోంది. కొత్తగా దుద్యాల మండలం హకీంపేటలో ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఎన్‌ఓసీ రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇటుకల తయారీకి మహిళతో బట్టీలు పెట్టించాలని ప్రభుత్వం నిర్ణయించినా అమలు కాలేదు. జిల్లాలో 11,681 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇటుక ఖరీదు రూ.8 వరకు ఉంది. ఇంటికి తీసుకొచ్చే సరికి అదనంగా మరో రూ.2 అవుతోంది. మహిళలే తయారు చేస్తే కొంతవరకైనా భారం తగ్గుతుంది.

పూడూరు మండలం రాకంచర్ల దగ్గర గార్మెంట్ సిటీ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉంది. ప్రభుత్వం పరిశ్రమల కోసం కేటాయించిన ఉచిత భూమి, మిషన్ భగీరథ నీరు, విద్యుత్తు, రోడ్లు జాతీయ రహదారికి దగ్గరలోనే ఉన్నాయి. పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే ఏర్పాటుకు పరిశీలించే అవకాశముందని పలు సంఘాలు కోరుతున్నాయి.

**ఏర్పాటుకాని సౌరశక్తి యూనిట్లు..**

కోట్‌పల్లి, బషీరాబాద్ మండలాల్లో సౌరశక్తి యూనిట్లు నెలకొల్పుతామని డీఆర్డీఏ అధికారులు ఊదరగొట్టారు. ఇందుకోసం రూ.2 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రకటించినా అమలు కాలేదు.

**చర్యలు తీసుకుంటున్నాం.. - కొమరయ్య, డీపీఎం**

వివిధ రంగాల్లో మహిళల ఉన్నతికి కృషి చేస్తున్నాం. పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లకు ప్రతిపాదించాం. ఒకదాని తరవాత మరోటి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మండలాలు: 20 మండల సమాఖ్యలు: 19

గ్రామ సమాఖ్యలు: 657

స్వయం సహాయక సంఘాలు: 15,697

నమోదైన సభ్యులు: 1.63 లక్షలు

# నిధుల లేమి.. అభివృద్ధి నిలిచి..



వికారాబాద్ : జిల్లాలో మూడేళ్లుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీల్లేక పర్యవేక్షణ కరవైంది. జడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీల పదవీకాలం ముగిసి ఏడాదికిపైనే అయింది. కొత్తగా కమిటీలు ఏర్పాటు చేయలేదు. దీంతో చాలావరకు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

**మంజూరు లేదు..:**

పభుత్వ ఆసుపత్రులకు సర్కారు సరిపడా నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వైద్యాధికారులు వాపోతున్నారు. ప్రతి మూణ్నెల్లకోసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. సమావేశమైనా నిధుల కొరతతో ఫలితం ఉండదనే భావనతో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పీహెచ్‌సీలకు ఏటా రెండు పర్యాయాలు కలిపి సుమారుగా రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేస్తారు. అభివృద్ధి కమిటీ ఆమోదం మేరకు వాటిని వసతుల కల్పనకు వినియోగిస్తారు.

**ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏదీ..**

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. రెండేళ్ల కిందట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మార్చారు. మే నెలలో రూ.30 కోట్లతో నిర్మించిన భవనంలో సేవలు ప్రారంభించారు. నిర్వహణ బాధ్యతలు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల వారు తీసుకున్నారు. ప్రత్యేకంగా వైద్య కళాశాలకు సంబంధించిన పర్యవేక్షకుణ్ని నియమించారు. ప్రత్యేక వైద్య నిపుణులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీని మాత్రం ఏర్పాటు చేయలేదు.

**ఎన్నికల తర్వాత అవకాశం.. - డా.రవీందర్ యాదవ్, జిల్లా ఉప వైద్యాధికారి, వికారాబాద్**

జిల్లాలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు ఎన్నికల తర్వాత ఏర్పాటు చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. జిల్లా ఆసుపత్రికి జిల్లా పరిషత్తు ఛైర్మన్, సివిల్ ఆసుపత్రులకు ఎమ్మెల్యేలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మండల పరిషత్తు అధ్యక్షుడు ఛైర్మన్‌గా ఉంటారు. ఛైర్మన్లు లేకుండా కమిటీ ఏర్పాటు కుదరదు.

ఏర్పాటు కాని జిల్లా ఆసుపత్రి: 1

సామాజిక ఆరోగ్య కేంద్రాలు: 3

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి: 1

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 23

బస్తీ దవాఖానాలు: 4

అర్బన్ దవాఖానాలు: 2 కమిటీలు

# మత్తు దందా.. కొత్త పంథా

హైదరాబాద్: మత్తు దందా కొత్త దారులు తొక్కుతోంది. స్మగ్లర్లు.. కొత్తగా ప్రైవేటు కొరియర్లు, పార్శిల్ డెలివరీ సర్వీసులను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా సింథటిక్‌డ్రగ్స్(హెరాయిన్, కొకైన్, ఎండీఎంఏ తదితరాలు), హైడ్రోఫోనిక్, ఓజీ గంజాయి లాంటి ఖరీదైన మత్తు పదార్థాలు ఈ విధానంలో రవాణా చేస్తున్నట్లు తెలంగాణ ఈగల్ గుర్తించింది. ఎక్కువ మొత్తంలో రవాణా చేస్తే తనిఖీలకు పట్టుబడతామనే ఉద్దేశంతో చిన్నపాటి కొరియర్ల ద్వారా రాష్ట్రాల సరిహద్దులు దాటించేస్తున్నారు. ఇటీవల నగరంలోని ఓ ప్రైవేటు వర్సిటీలో విద్యార్థులు గంజాయి రవాణా, వినియోగాన్ని ఈగల్ బట్టబయలు చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థులకు గంజాయి ఎలా వస్తోందని పోలీసులు ఆరాతీయగా దిల్లీ, కర్ణాటక నుంచి కొరియర్ల ద్వారా వస్తున్నట్లు బయటపడింది. ఈ కేసు అనంతరం.. డ్రగ్స్ రవాణా మీద దృష్టి సారించగా ఎక్కువ మంది స్మగ్లర్లు కొరియర్ ఏజెన్సీలను ఉపయోగిస్తున్నట్లు వెలుగుచూసింది. ఏజెన్సీల ఉద్యోగులకు ఇందులో ప్రమేయమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**తప్పుడు చిరునామాలతో..**

కొంతకాలంగా బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఇతర మార్గాల్లో తనిఖీలు పెరిగాయి. ఇదే సమయంలో కొరియర్లపై నిఘా తక్కువగా ఉండడం స్మగ్లర్లకు అవకాశంగా మారుతోంది. సరకును చిన్న మొత్తాలుగా



విభజించి వివిధ వస్తువుల మాటున కొరియర్ చేస్తున్నారు. పోలీసులకు అనుమానం రాకుండా జాగ్రత్తపడుతున్నారు. సాధారణంగా కొరియర్ పంపినప్పుడు డెలివరీ చిరునామా స్పష్టంగా ఉండాలి. డ్రగ్స్ ముఠాలు చిరునామాలో ప్రాంతం పేరు ఇస్తున్నా ఇల్లు, ఆఫీసు, భవనం పేర్లు అస్పష్టంగా పేర్కొంటున్నారు. దీంతో డెలివరీబాయ్‌లు తప్పని పరిస్థితుల్లో ఫోన్ నంబరుకు కాల్‌చేస్తారు. దీంతో రిసీవర్లు సమీపంలోని మరో ప్రాంతానికి రప్పించి తీసుకుంటున్నారు. ఈ కొరియర్ పార్శిళ్లలో అత్యధికం గోవా, దిల్లీ, బెంగళూరునుంచే వస్తున్నాయి.

# దిగుబడి సగమే.. దినదిన గండమే!

ఖమ్మం: అధిక వర్షాలు పత్తి రైతులను నట్టేట ముంచాయి. ఆగస్టు వరకు విరగబూసిన పూత, కాతతో పచ్చగా కళకళలాడిన పైర్లు ఆ తరువాత కురిసిన వానలకు దెబ్బతిన్నాయి. ఎండలు కాయక.. సూర్యరశ్మి తగలక వేరుకుళ్లి సోకి చెట్లు నిలువునా ఎండిపోయాయి. పూత రాలింది. నీళ్లు చేరటంతో కాయలు నల్లగా మారాయి. దిగుబడి సగానికి పడిపోవటంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

**భారంగా పెట్టుబడి..**

ఖమ్మం జిల్లాలో 2,34,182 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2,21,345 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఒక్కో ఎకరాకు సగటున రూ.30,450(ఏరివేత కూలి కాకుండా) పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల కారణంగా దసరా ముందు పత్తిని ఏరలేదు. జనవరి వరకు



మూడుసార్లు తీయాల్సి ఉండగా ఒక్కసారి ఏరివేతనే కష్టమైంది. ఫలితంగా సగటు దిగుబడి ఐదున్నర క్వింటాళ్లకు పడిపోయిందని కర్షకులు చెబుతున్నారు. వర్షాలకు లోతట్టు భూముల్లోని పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. వేరుకుళ్లు సోకిన చేలల్లో ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దూది మాత్రమే పండింది. క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,150 కాగా.. అంతటా సీసీఐ కొనుగోళ్లు మొదలుకాకపోవటంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు సగటున రూ.6వేలకే కొంటున్నారు. ఈలెక్కన ఐదున్నర క్వింటాళ్లకు రూ.33వేలు వస్తున్నాయి. ఇందులో ఏరివేత కూలీల ఖర్చులు క్వింటాకు 1,500 చొప్పున రూ.8,250 పోతే రూ.24వేలు మాత్రమే మిగులుతున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడత దూది తీయగా.. చెట్టుకు ఉన్న కాయలకు గులాబి పురుగు ఆశించటంతో అవి పనికి రాకుండా పోతున్నాయి. లింగాకర్షక బుట్టలు పెడితే ఫలితం ఉంటున్నా రైతులు నిరాశతో వదిలేస్తున్నారు.

సొంత భూమి నాలుగెకరాలతోపాటు ఎకరాకు రూ.25వేల చొప్పున ఆరెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగుచేశాను. రూ.4.50లక్షలు ఖర్చుపెట్టాను. 58 క్వింటాళ్ల పత్తి వచ్చింది. ఏరివేతకు రూ.87వేలు వెచ్చించాను. సీసీఐ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర దొరుకుతుందని వేచిచూస్తున్నా. ఇంకా చెట్టుకు కాయలున్నా.. గులాబి పురుగు ఆశించటంతో వదిలేశాను.

కందుల భాస్కర్‌రావు, వెంకటాపురం, (ముదిగొండ)

ఎకరాకు రూ.20వేల చొప్పున మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాను. రూ.72వేలు ఖర్చుచేశాను. వర్షాలకు గడ్డి పెరగటంతోపాటు ఎర్రపేను కారణంగా ఆకు ముడుచుకుపోయి పూత, పిందె రాలిపోయింది. చేను ఎదగలేదు. అధిక వానలకు కాయలు నల్లగా మారాయి. ఎకరాకు మూడు క్వింటాళ్ల పంటపోగా ఎనిమిది క్వింటాళ్ల దిగుబడే వచ్చింది.

పొరెపల్లి రమేశ్, ముదిగొండ

ఒక ఎకరా పత్తి సాగుకు పెట్టుబడి (రూ.లల్లో)

విత్తనాలు: 3,800

ప్లవ్, రొటావేటర్: 5,500

గొర్రు, గుంటుక: 6,000

కూలీలకు: 3,200

ఎరువులు: 3,950

పురుగుమందులు: 8,000

# ఉపాధి పనులు.. 39 రకాలు

అశ్వారావుపేట: ఉపాధి పథకానికి సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపు కోసం ఈనెల 17 నుంచి గ్రామసభలు చేపట్టారు. నవంబర్ 30 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం జాబ్‌కార్డులకు సంబంధించిన ఈకేవైసీ కార్యక్రమం జరుగుతుండగా మరోవైపు పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామసభలు ఈనెల 2 నుంచి నిర్వహించాల్సి ఉండగా అప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాధ్యం కాలేదు. తాజాగా అధికారులు సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం గ్రామసభలు కొనసాగుతున్నాయి.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కూలీలు**



గ్రామాల్లో పనులు చేసే కూలీల సంఖ్యకు అనుగుణంగా పనులు గుర్తిస్తారు. ఉపాధి పథకం కింద 250 రకాల పనులు నిర్వహించవచ్చు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 39 రకాల పనులు చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటికి ప్రజాభిప్రాయం ప్రకారం ఆమోదం తీసుకోనున్నారు. గుర్తించిన పనులను మొదట మండల పరిషత్తు, తదుపరి జిల్లాస్థాయి అధికారులకు పంపి ఆమోదం పొందాలి. ఇప్పటికే గుర్తించిన పనులను 2026 మార్చి 31 వరకు పూర్తి చేయాలి. ఏప్రిల్ 1 నుంచి కొత్తగా గుర్తించిన పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి హామీ కూలీల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల లబ్ధిదారులకు మేలు జరగటమే కాకుండా నిర్మాణాలు ఊపందుకునే అవకాశం ఉంది. నీటి కుంటలు, కుంటల్లో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, ఇంకుడుగుంతల నిర్మాణం, పశువుల పాకలు, పంచాయతీ నర్సరీల్లో మొక్కల పెంపు, పండ్ల తోటలు, పశు గ్రాసం పెంపకం, నీటి మళ్లింపు కాలువలు, సీసీ రహదారులు, మట్టి రోడ్ల నిర్మాణం, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులు చేపడతారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేలా కసరత్తు చేస్తున్నాం. ఇందు కోసం పక్కా ప్రణాళికలు రూపొందించాం. రైతలు, కూలీలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమిస్తున్నాం. రవి, ఏపీడీ

# నిఘాకు మసక.. వ్యాపారి మస్కా

కర్నూలు : పంట చేతికొచ్చింది.. అమ్మకానికి సిద్ధంగా ఉన్న దిగుబడులను ఇటీవల వచ్చిన మొంథా తుపాన్ నిండా ముంచేసింది.. తడిసిన గింజలను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.

**కనిపించని సీసీ కెమెరాలు**

నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని చోట్ల డబ్బా రేకుల్లో కేంద్రాలుండగా.. మరికొన్ని చోట్ల అవికూడా కూడా లేవు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ప్రతి 12 గంటలకు ఇద్దరు చొప్పున పనిచేయాల్సి ఉంది. ఉద్యోగులు లేక కొన్ని ఉదయం.. మరికొన్ని రాత్రిళ్లు మూతపడుతున్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు.

**రైతు పేరుతో దాటిస్తున్నారు**

రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. కొందరు వ్యాపారులు రైతుల పేరుతో సరిహద్దు దాటిస్తున్నారు.




సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తగ్గిన ఆదాయం క్వింటా ధాన్యం రూ.2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ.12 వేలు ఫీజు చెల్లించాలి. పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెటింగ్ శాఖకు భారీగా గండి పడుతోంది. కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలుండగా.. ఒక్క పత్తికొండ మినహా మిగతా మార్కెట్లలో ఆదాయం తగ్గిపోయింది. నంద్యాల జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్లు ఉండగా 23 చెక్‌పోస్టులున్నాయి. రూ.12.57 కోట్లు వసూలైంది.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు.


సాగు (హెక్టార్లలో)
4,22,540 సాధారణం
3,83,072 సాగైంది
ఆదాయం (రూ.కోట్లలో)
ఈ ఏడాది లక్ష్యం: 40.40ఇప్ప
టికీ వసూలైంది: 13.07

# నిధులు దండి.. వివరాలు తొండి

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ 'లెక్క' తప్పింది.. ప్రతి నెలా సుమారు 3,200 మంది సేవలు పొందుతున్నారు.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొదటిస్థానంలో ఉన్నట్లు వైద్యాధికారులు గొప్పలు చెప్పుకొంటున్నారు. ఈ లెక్కలన్నీ డొల్లే అన్నట్లు తేలిపోయింది. ఆన్‌లైన్‌లోని లెక్కలకు.. ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు సరిపోలని విషయం బయటపడింది.

**నమోదు 800.. ఉన్నది 300**ఎన్టీఆర్ వైద్య సేవల కింద చికిత్స పొందుతున్న వివరాలు పరిశీలించాలని ఆదేశాలు రావడంతో ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి తదితరులు బుధవారం తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద 860 అడ్మిషన్లు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది. వివిధ విభాగాల్లో ఉన్న పడకలపై 300 మందికి మించి రోగులు లేరు.

**నాడితప్పిన పర్యవేక్షణ** జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, గైనిక్‌కు సంబంధించి కేసుల తీవ్రతను బట్టి ఎన్టీఆర్ వైద్యసేవల కింద రోగులను అడ్మిట్ చేసుకోవాలి. అలాకాక ప్రతి ఒక కేసును ఎన్టీఆర్ వైద్యసేవల కింద చేర్చారు. ఒకటి, రెండు రోజుల్లో నయమైపోవడంతో పలువురు



చెప్పకుండా వెళ్లిపోయారు. ఇలాంటి వారు వందల సంఖ్యలో ఉన్నారు. వారందరూ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది.

శస్త్రచికిత్సలు వాయిదా వేయడం.. నిరంతరం తిప్పుకొంటుండటంతో పలువురు వైద్యులకు చెప్పకుండా వెళ్లిపోయిన కేసులు వందల సంఖ్యలో ఉన్నాయి. చనిపోయినపోవారు 120 మంది వరకు ఉన్నారు. ఈ కేసులను మూసేయాల్సి ఉండగా అలానే ఉంచేశారు.

**నమోదు నలత**

ఎన్టీఆర్ వైద్యసేవల కింద విధులు నిర్వహించే డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఆసుపత్రిలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు సమన్వయం చేసుకోవాలి. వైద్యాలయంలో ఆ పరిస్థితి కానరావడం లేదు.

ఆస్పత్రిలో ఎంతమంది చేరుతున్నారు.. ఎంతమంది డిశ్చార్జి అవుతున్నారన్న వివరాలు పర్యవేక్షకుడికి తెలియడం లేదు.

ఎన్టీఆర్ వైద్య సేవలు కింద చికిత్స తీసుకుని డిశ్చార్జి అయి వెళ్లినవారికి ఛార్జీలు, మందులతోపాటు వైద్య పరీక్షలు బయట చేసి ఉంటే వాటికి సంబంధించిన బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గత ఆరు నెలలుగా చాలామందికి ఇవ్వలేదు. ఖాతాల్లో వేస్తామని రోగులకు చెప్పి పంపేస్తున్నారు.

# రాయితీ, ప్రోత్సాహకం ఏదీ?



హిందూపురం : హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్ల క్రయవిక్రయాలు జరగలేదు. ప్రభుత్వం బైవోల్టిన్ రైతులకు ప్రోత్సాహక మొత్తం, మల్బరీ సాగుకు ఎరువులు, మందులపై రాయితీ ఇవ్వకపోవటంతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలోనే వాటిని నిలిపేయడంతో రూ.20 కోట్ల వరకు బకాయి ఉంది. చెల్లించాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. పంటసాగు, పట్టుగూళ్ల పెంపకానికి పెరిగిన పెట్టుబడి వ్యయంతో రైతులు అవస్థలు పడుతున్నారు. 1985లో పట్టుగూళ్ల మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు బంద్ అయిన సందర్భాలు లేవని స్థానికంగా చెబుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వస్తోంది.

**ఉపాధిపై ప్రభావం**

మార్కెట్‌లో జరిగే పట్టుగూళ్ల లావాదేవీ ద్వారా రీలర్లు, కూలీల దాదాపు 8వేల మంది రీలింగ్ యూనిట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పట్టుగూళ్లు రాకపోతే రీలింగ్ యూనిట్లు కొనసాగక ఉపాధికి విఘాతం కలుగుతుంది. యూనిట్లు కొనసాగాలంటే ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న గూళ్లు ఇక్కడికి తీసుకురావాలని రీలర్లు కోరుతున్నారు.

**కర్ణాటకకు తరలిస్తూ..**

కర్ణాటక రాష్ట్రంలోని రాంనగర్, శిద్దలఘట్ట మార్కెట్‌లలో కిలోకు రూ.50 నుంచి 100 వరకు అదనంగా ధర లభిస్తుండటంతో ఈ ప్రాంతంలోని రైతులు బైవోల్టిన్, సీబీ పట్టుగూళ్లు తీసుకెళుతున్నారు. గతంలో బైవోల్టిన్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 ప్రోత్సాహకం అందిస్తుండటంతో అధికశాతం మంది పురం తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్ మేలు అనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి**

జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బైవోల్టిన్ రైతులకు రాయితీ, ప్రోత్సాహకం అందేలా చూడాలి. లేదంటే రైతులు కర్ణాటకకే పట్టుగూళు తరలించుకొని వెళ్లే అవకాశం ఉంది. నాలుగు దశాబ్దాల మార్కెట్ చరిత్రలో పట్టుగూళ్లు రాని రోజంటూ లేదు. దీనిని గుణపాఠంగా భావించాలి.

సిద్ధారెడ్డి, కార్యదర్శి, ఉమ్మడి జిల్లా పట్టు రైతుల సంఘం

**దిగుబడి తక్కువగా ఉంటోంది**

చలికాలంలో పట్టుగూళ్ల దిగుబడి తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున పట్టుగూళ్లు అంతంతమాత్రంగా వస్తున్నాయి. నుంచి గూళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి.హంపయ్య, హిందూపురం మార్కెట్ ఇన్‌స్పెక్టర్

# ద్రవిడ వర్సిటీలో పరిశోధనం



కుప్పం : వి.కోట ప్రాంతానికి చెందిన ఓ పరిశోధక విద్యార్థిని 'చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రుల కథలు, స్త్రీ జీవిత చిత్రణ' అంశంపై పరిశోధన చేశారు. దీనిపై సిద్ధాంత గ్రంథాన్ని ద్రవిడ వర్సిటీలో ఓ ఆచార్యుడికి సమర్పించగా.. తిరుపతిలోని ఓ వ్యక్తికి సిఫార్సు చేశారు. సదరు వ్యక్తి రూ.80 వేలు ఇస్తే.. ఈ పరిశోధన అంశాన్ని పూర్తిచేస్తామని చెప్పగా... రూ.10 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. రెండేళ్ల తర్వాత గ్రంథాన్ని తిరిగిచ్చినట్లు విద్యార్థిని ఆవేదన చెందుతోంది.

**ద్రావిడ భాషలు..** సంస్కృతి.. సంప్రదాయాలు పరిరక్షించాలనే లక్ష్యంతో త్రిరాష్ట్ర కూడలి అయిన కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. పరిశోధనల దిశగా అడుగులు వేస్తూ యూజీ, పీజీ కోర్సులకు కూడా శ్రీకారం చుట్టింది. కాలక్రమేణా నాటి పాలకులు.. అధ్యాపకులు.. ఆచార్యుల ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేపట్టలేకపోతున్నారు.

ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం సెప్టెంబరు 11న వర్సిటీ రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 14 విభాగాల్లో 62 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇప్పటివరకు నెట్, జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి ప్రవేశాలు కల్పించారు. ఇక్కడ నెలకొన్న లోపాలతో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయన్న నమ్మకం కొరవడింది.

ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఓ విభాగంలో పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ పరిశోధక విద్యార్థి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లాలో 'హొసూరు తెలుగు కథల'పై క్షేత్రస్థాయిలో తిరిగారు. అంతరించిపోతున్న కళలు.. కథలు.. సంస్కృతి.. సంప్రదాయాలపై పరిశోధన చేసి 2023లో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇంతవరకు పట్టా అందకపోవడంతో అతను వర్సిటీ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

కుప్పానికి చెందిన ఓ పరిశోధకురాలు తమిళనాడు రాష్ట్రం కంచి, మదురై ప్రాంతాల్లో పర్యటించి 'తొండనాడు కథలు'పై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీలో సమర్పించుకునేందుకు యత్నించారు. అక్కడ సరైన స్పందన లభించలేదని ఆమె ఆవేదన చెందడం గమనార్హం.

**సమర్పించినా.. కాలయాపన**

కొందరు విద్యార్థులు పరిశోధన గ్రంథాలను సమర్పించినా.. ఏదో ఒక కారణాలు చూపుతూ పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనివల్ల విద్యార్థుల సంఖ్య కనీస స్థాయికి పడిపోయి ఉద్యోగులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ద్రవిడ విశ్వవిద్యాలయం కొట్టుమిట్టాడుతోంది.

**కిం కర్తవ్యం**

కొందరు పరిశోధక విద్యార్థులను పలుకరిస్తేనే ఇన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయంటే.. ఇక పీహెచ్‌డీ పట్టాల జారీలో జాప్యం.. ప్రవేశాల రద్దు తదితర విషయాలపై లోతుగా ఆరా తీస్తే ఏ స్థాయిలో పరిశోధకులు ఇబ్బందులు పడుతున్నారో వెల్లడవుతుంది.

**30 శాతం సీట్లు భర్తీ చేశాం..**

యూజీసీ నిబంధనల ప్రకారం 30 శాతం నెట్, జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి వర్సిటీలో నేరుగా ప్రవేశాలు కల్పించాం. మిగిలిన సీట్ల వివరాలను ఏపీఆర్‌సెట్‌కు సమర్పించాం. అర్హులందరికీ పీహెచ్‌డీ పట్టాలు ఇస్తున్నాం. ఏదైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి. – ఆచార్య కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్

# ఆపరేషన్ స్వర్ణతో ఆటకట్టు




తిరుపతి : విశాలమైన లేఅవుట్‌లు, ఎనిమిది ఎకరాల్లో ఫాంహౌస్‌లు, అపార్టుమెంట్లు, అక్రమ కట్టడాలు, వందల ఎకరాల్లో మామిడి తోటలు.. ఇలా ఎన్నో అక్రమాలకు నెలవుగా మారింది స్వర్ణముఖి పరీవాహక ప్రాంతం. 'ఆపరేషన్ స్వర్ణ'లో భాగంగా తిరుపతి గ్రామీణ మండలంలో చేపట్టిన సర్వేలో గుర్తించిన ఆక్రమణల విలువ రూ.వెయ్యి కోట్ల పైమాటే. కొందరు రియల్టర్లు లేఅవుట్లు వేసి విక్రయించగా.. కొందరు ఐదారు అంతస్తుల భవనాలు నిర్మించుకున్నారు. వందల ఎకరాల్లో మామిడి తోటలు ఏపుగా పెరిగాయి. కుంట్రపాకం వద్ద విలాసవంతమైన ఫామ్ హౌస్ స్వర్ణముఖిలో వెలిసింది.

**తిరుపతి గ్రామీణ మండలంలోనే ఎక్కువ**

జిల్లాలోని 9 మండలాల మీదుగా ప్రవహించే స్వర్ణముఖి ఎక్కువగా ఆక్రమణకు గురైంది మాత్రం తిరుపతి గ్రామీణ మండలంలోనే. స్వర్ణముఖి, దాని బఫర్ జోన్‌లో సుమారు 2 వేల కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. చిగురువాడ, వేదాంతపురం, దుర్గసముద్రం, తిరుచానూరు, అవిలాల ప్రాంతాల్లో కుంట్రపాకం ప్రాంతాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయి. పరీవాహక ప్రాంతాల్లో 10 నుంచి 50 ఎకరాల వరకు ఆక్రమించుకుని పొలాలుగా మార్చారు. తిరుపతి గ్రామీణ మండలం తరువాత చంద్రగిరి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

**లక్షల మందిని ప్రమాదంలో పెట్టలేం: సి.దివాకర్‌రెడ్డి, ఛైర్మన్, తుడా**

ఆపరేషన్ స్వర్ణ ముఖ్యమంత్రి అనుమతితో ప్రారంభమైంది. వేలాది ఆక్రమణలతో లక్షలాది మందిని ప్రమాదంలో పెట్టలేం. ఇలాగే వదిలేస్తే భావితరాలకు స్వర్ణముఖి పవిత్రను, ప్రయోజనాల్ని ఇవ్వలేం. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఆక్రమణల్ని గుర్తించగలిగాం. వంద మీటర్ల బఫర్ జోన్‌ను 50 మీటర్లకు కుదించారు. ఆ నిబంధనల ప్రకారం సరిహద్దు రాళ్లు పాతుతాం. స్వర్ణముఖి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

**నది పొడవునా ఇలా..**

ముక్కోటి నుంచి కుంట్రపాకం వరకు సర్వే చేశారు.

స్వర్ణముఖి నది, దానికి ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్ హద్దుల్ని నిర్ణయించారు.

వీటి మధ్యలో ఉన్న కట్టడాలు, పొలాలు, లేఅవుట్‌లను గుర్తించి వాటి వివరాలు సేకరిస్తున్నారు.

తొలి విడతలో చంద్రగిరి నుంచి శ్రీకాళహస్తి వరకు సర్వే పూర్తి చేసి.. జనవరి నుంచి క్షేత్రస్థాయిలో సరిహద్దురాళ్లు పాతనున్నారు.

నిరుపేదలుంటే వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయిస్తారు.

అక్రమార్కుల చెరలోని నిర్మాణాలు కూల్చివేస్తారు. స్థలాలను స్వాధీనం చేసుకుంటారు.

అవసరమైన ప్రాంతాల్లో పూడిక తొలగిస్తారు.

స్వర్ణముఖి విస్తరించిన 155 కి.మీల మేర సర్వే పూర్తయ్యాక.. ఆక్రమణకు గురవుతున్న ప్రాంతాలకు ఇరువైపులా 4 మీటర్ల వెడల్పు గల తాత్కాలిక రోడ్లను నిర్మిస్తారు.

# మాన్యమున్నా.. నైవేద్యమేదీ

ప్యాపిలి : ప్యాపిలి పట్టణం నడిమిగేరిలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు ధూపదీప నైవేద్యాలతో కళకళలాడగా నేడు పట్టించుకునేవారే కరవయ్యారు. ఆలయానికి 201 ఎకరాల మాన్యం ఉన్నప్పటికీ అభివృద్ధి చేయడం లేదు. దేవాదాయ శాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

**కూలిపోయేలా ఉన్నా..**

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని శతాబ్దాల కిందట నిర్మించారు. ప్రస్తుతం ఆలనాపాలనా కరవైంది. గుడి స్తంభాలు, పైకప్పు దూలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పలుమార్లు ఆలయాన్ని పరిశీలించినా ప్రయోజనం శూన్యమే. **దేవాదాయ శాఖ పట్టించుకోక..**

దేవాలయానికి 201 ఎకరాల మాన్యం ఉంది. నలుగురు పూజారులు



30 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. ఇనాం భూముల కింద స్వామి సేవకులకు సంబంధించి 143 ఎకరాలు వారి ఆధీనంలో ఉంది. ఇందులో కొందరు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 28 ఎకరాలకు మాత్రమే ఏటా కౌలుకు వేలం నిర్వహిస్తుంటారు. దీనిద్వారా రూ.35 వేలు మాత్రమే వస్తోంది. ఈ నిధులతోనే ఉత్సవాల సమయంలో ధూపదీప నైవేద్యాలకు వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఇటీవల ఆలయాన్ని పరిశీలించారు.. అభివృద్ధికి తమవంతు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# అతివకు చిరుసాయం

రాజాం : ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు ఎక్కువ. ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాల్లో మన రైతులు ముందున్నారు. మహిళలు సైతం ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈక్రమంలో స్థానికంగా మిల్లెట్ క్లస్టర్ ఏర్పాటు చేయాలనే డిమాండు ఎప్పటినుంచో వినిపిస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి అనేక ప్రతిపాదనలు వెళ్లాయి. తాజాగా సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. తమ ఆమోదంతో సంబంధం లేకుండా పనులు ప్రారంభించాలని ఇప్పటికే రాష్ట్రానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో విజయనగరంలోని వైద్య కళాశాల సమీపంలో 13.48 ఎకరాలు గుర్తించినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.

**ప్రస్తుతం ఉన్నవి..**రాగి బిస్కెట్లు, రాగి లడ్డూలు, కొర్రలతో జంతికలు, మురుగులు తదితరాలు తయారు చేస్తున్నారు. మన్యంలో ఊదలతో ఇడ్లీలు, మిల్లెట్ పెరుగన్నం, మిల్లెట్ పెసరట్టు, కిచిడీ, మల్టీగ్రైన్ చపాతీలు, నువ్వుండలు, జొన్న గారెలు దుకాణాల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికే రస్తాకుంటుబాయిలోని కేవీకేలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. అక్కడే యంత్రాలను బిగించి తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

**1000 మందికి లబ్ధి..**

దేశవ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగింది. ఆరోగ్యం దృష్ట్యా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల మహిళలకు లబ్ధి కలగనుంది. క్లస్టర్ పరిధిలో ఏర్పాటయ్యే యూనిట్లతో వివిధ రకాల వంటల తయారీకి అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా దాదాపు 1000 మంది లబ్ధి పొందుతారని భావిస్తున్నారు.

**సర్వే జరుగుతోంది..**

'సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంశాలపై సర్వే చేపడుతున్నాం. యూనిట్ల ఏర్పాటుకు ఎంత మంది ఆసక్తి చూపుతారు? ఏఏ ఉత్పత్తులకు అవకాశం ఉంది.. విలువ జోడింపు తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నాం. పూర్తిస్థాయి అనుమతులు వస్తే ముందుకెళతాం' అని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. తృణధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉండొచ్చని, వ్యాపారాలు బాగుంటాయని కేవీకే గృహవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి తెలిపారు.

విజయనగరం జిల్లాలో..సంఘాల ఆధ్వర్యంలో సాగు..
రాగులు ఎకరాల్లో 846 రైతులు 886
గంటిలు ఎకరాల్లో 330 రైతులు 535
కొర్రలు ఎకరాల్లో 27.5 రైతులు 59
జొన్నలు ఎకరాల్లో 15 రైతులు 25
మన్యంలో 5,400 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి

# సొంత నిధులు పెంచుకునేలా!!

విజయనగరం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)కు సొంత నిధులు లేవు. ఆప్కాబ్, నాబార్డు ఇచ్చే సొమ్ముపైనే ఆధారపడుతోంది. అందులోనుంచే రుణాలిస్తోంది. తగినంత డిపాజిట్లు లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఉమ్మడి జిల్లాలో 24 సహకార బ్యాంకులున్నాయి. వీటి ద్వారా డిపాజిట్ల సేకరణపై దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్సన్ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో రూ.23 కోట్లు వచ్చాయి.

**రూ.400 కోట్ల లక్ష్యంతో..**

బ్యాంకు పరంగా ఏటా రూ.2,232 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. ఇందులో రుణాల కింద రూ.1893 కోట్లు ఇస్తున్నారు. దీని ప్రకారం రూ.800 కోట్ల మేర డిపాజిట్ ఉండాలి. ప్రస్తుతం రూ.339 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో రూ.27 కోట్లను సేకరించారు. డిసెంబరు నాటికి మరో రూ.375 కోట్లను సమీకరించాలని నిర్ణయించారు. 2026 మార్చి నాటికి రూ.400 కోట్లు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు సహకార బ్యాంకుల్లో అయితే 7.90 శాతం వడ్డీ, సొసైటీల్లో అయితే 8.90 శాతం వడ్డీ ఇవ్వనున్నారు.**కారణాలివీ..**గత పాలకవర్గాల్లో సొసైటీల స్పందన అంతంత మాత్రమే కావడంతో బ్యాంకు నష్టాల్లోకి వెళ్లింది. తొలి నాళ్లలో డిపాజిట్లపై నిషేధం ఉండడం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సహకార రంగంలో కొన్ని బ్యాంకులు, సంస్థలు దివాలా తీయడంతో ఆ ప్రభావం సైతం పడింది. రెండు జిల్లాల్లో 94 సొసైటీలున్నాయి. ఇందులో కెల్ల, తెట్టంగి, సతివాడ మినహా మిగిలిన అన్నింట్లో ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన కమిషన్‌నే డిపాజిట్‌గా చూపుతున్నారు. వ్యక్తిగతంగా సేకరించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రచారం చేయనున్నారు.**రైతుల మేలు కోసమే..**డిపాజిట్లు పెంచే దిశగా సొసైటీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇప్పటికే గాజులరేగ, చీపురుపల్లి తదితర కార్యాలయాలను సందర్శించాం. సొంత నిధులు పెంచుకోవడంతో తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు ఇవ్వొచ్చు. దీంతో లక్ష్యాలు విధించాం.

## తాడిపత్రి రాళ్లలో.. ఎన్నెన్ని సొబగులో

తాడిపత్రి : దేశవ్యాప్తంగా తాడిపత్రిలో లభించే గ్రానైట్ బండలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 25 ఏళ్లుగా ఇక్కడి పాలిషింగ్ యూనిట్లలో కోస్తున్న రంగు బండలు మన్నిక, నాణ్యతకు పేరు గాంచాయి. ముడిసరకు ఇక్కడ లభించకపోయినా ఇతర జిల్లాల నుంచి తెప్పించి...కటింగ్, పాలిషింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తాడిపత్రి పరివాహక ప్రాంతంలోని పెన్నా నది ఒడ్డున పుష్కలంగా నీరు ఉండటంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వెలిశాయి. ప్రతి నెలా పన్నులు, విద్యుత్తు బిల్లుల రూపంలో ప్రభుత్వానికి రూ.2.50 కోట్లకు పైనే ఆదాయం వస్తోంది. ఈ పరిశ్రమల ద్వారా కర్నూలు, కడప జిల్లాలతో పాటు కదిరి, గుంతకల్లు ప్రాంతాలకు చెందిన దాదాపు



8 వేలకు పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోలిస్తే తాడిపత్రిలో గ్రానైట్ తక్కువ ధరకు లభించడం ముదావహం.

తక్కువ ధరకే గ్రానైట్ పలకలు
గ్రానైట్ పరిశ్రమలు: 180
నెలకు వచ్చే ముడిసరకు: 1500 క్యూబిక్ మీటర్లు
ఏటా టర్నోవర్: రూ.100కోట్లకుపైనే
ప్రభుత్వానికి ఆదాయం (నెలకు): పన్ను, విద్యుత్తు ఛార్జీల రూపంలో రూ.2.50 కోట్లు
ఎగుమతులు: ముంబయి, చెన్నై, దిల్లీ, కోల్‌కతా తదితర రాష్ట్రాలకు
లభించే రకాలు: గ్రీన్, బ్లాక్, ఫిషర్ బ్లాక్, వైట్, రెడ్

## ప్రభుత్వ విద్యార్థి.. అందుకో బహుమతి

తిరుపతి : మీరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారా.. అయితే మీకో అవకాశం. మీ ప్రతిభకు పరీక్ష. ఇందులో విజయం సాధిస్తే నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. ఎపిఫనీ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ 2025)లో సత్తా చాటితే చాలు. ఈ వివరాలు ఏంటో తెలుసుకుందామా..!

**పరీక్షా విధానం**
పరీక్ష రెండు దశల్లో ఉంటుంది.
ప్రిలిమ్స్ ఇంటి నుంచి లేదా పాఠశాలలోనైనా ఆన్‌లైన్‌లో రాయాలి. ఇందులో ప్రతిభ కనబరిచితే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. నిర్దేశించిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
సిలబస్: ఏపీ ప్రభుత్వ, ఎస్‌సీఈఆర్టీ, పాఠ్యపుస్తకాలపై (గణితం, సైన్స్,



సోషల్, మానసిక సామర్థ్యం) ప్రశ్నలు ఉంటాయి.
పరీక్ష సమయం: 60 నిమిషాలు
ముఖ్యమైన తేదీలు: రిజిస్ట్రేషన్‌కు గడువు: ఈ నెల 14
ప్రిలిమ్స్: డిసెంబర్ 29
మెయిన్స్: జనవరి 19
ప్రోత్సాహకాలు
అర్హులు: ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి విద్యార్థులు.
ఫీజు: రిజిస్ట్రేషన్ ఉచితం.
బహుమతులు: రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజేతలకు మొత్తం రూ.9 లక్షల వరకు నగదు, సర్టిఫికెట్లు.
పదో తరగతి: రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు ర్యాంకులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు.
7వ తరగతి: రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తారు.
మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి గుర్తింపు (సర్టిఫికెట్లు, మెడల్స్) లభిస్తుంది.

## ఎప్పుడైనా విత్తుకునేలా..

చిత్తూరు : తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులనిచ్చే కొత్త వరి వంగడాన్ని వ్యవసాయశాఖ అందుబాటులోకి తెచ్చింది. నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిశోధన చేపట్టి ఎన్‌ఎల్‌ఆర్–3648 రకం కొత్త వరి వంగడాన్ని సిద్ధం చేసింది. ఇది సన్నరకం. పొట్టిగా ఉంటుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధన క్షేత్రంలోనే ప్రయోగాత్మకంగా తొలుతగా దీని సాగు చేపట్టారు. ఆశించిన స్థాయిలో మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో దీని విస్తరణకు మొదటగా జిల్లాకు 15కిట్లు(కిట్‌లో రెండు కిలోలు) అందజేశారు.

**అగ్గి తెగులు దరిచేరదు**
కొత్త రకం ఎన్‌ఎల్‌ఆర్–3648 వంగడం జిల్లాకు ఎంతో అనుకూలం. ఈ నెలలోనే సాగు చేపట్టాలనే నిబంధన లేదు. ఏడాదిలో ఎప్పుడైనా, ఏరోజైనా విత్తు కోవచ్చు. పంట కాలం 125 రోజులు. వరి కాండం గడుసుగా, వెన్ను దట్టంగా పెరుగుతుంది. ఎకరాకు 34–35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లాలో ప్రయోగాత్మకంగా దీని సాగుకు ఆసక్తి కలిగిన రైతులకు విత్తన కిట్లు అందజేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మంచి దిగుబడులు లభిస్తే కొత్త రకం వంగడం సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన కిట్లు కావలసిన రైతులు ఏవోలను సంప్రదించాలని ఆయన కోరారు.

## కుదిరితే కప్పు కాఫీ.. నాలుగు మాటలు




అనంతపురం : నగరాల్లో నలుగురు మిత్రులు కలిసి సరదాగా మాట్లాడుకోవడానికి, ఉరుకులు పరుగులతో అలసిన మనసుకు ఒత్తిడి తగ్గించుకునేందుకు, స్థిరాస్తి వ్యాపార లావాదేవీలకు టీ కేఫ్‌లు వేదికలవుతున్నాయి. ఎక్కడా లేని టీ కేఫ్ సంస్కృతి అనంతపురం నగరంలో, 44వ జాతీయ రహదారి వెంబడి రోజురోజుకు విస్తరిస్తోంది. అర కిలోమీటరు విస్తీర్ణం కూడా లేని ఆదిమూర్తినగర్‌లో 60కి పైగా ఉన్నాయంటే మార్పు ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు ఏ కేఫ్‌లో, ఏ సమయంలో చూసినా ఉదయం నుంచి సాయంత్రం దాకా సగటున 50, 60 మందికి తగ్గకుండా ఉంటున్న తీరు మారుతున్న ధోరణికి అద్దం పడుతోంది.

**భారీ పెట్టుబడి లేకుండానే..**
నగరంలో కనీసం 5 నుంచి 10 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చాలు. వ్యాపారం చేద్దామనుకున్న వారికి టక్కున మదిలోకి వచ్చేది టీ కేఫ్ పెట్టాలన్న ఆలోచనే. పైన రేకులు వేయడం, గుండ్రని టేబుళ్లు పరవడం, కింద రాళ్లతో చిప్స్ వేయడం, కొంతభాగం ఖాళీగా ఉంచి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసేస్తున్నారు.

**విస్తరణ ఇలా..**
నగరంలోని సాయినగర్ నుంచి అశోక్‌నగర్, విద్యుత్తు నగర్ కూడలి, హౌసింగ్ బోర్డు, జేఎన్‌టీయూ రోడ్డు, బెంగళూరు రోడ్డు, రాంనగర్ నుంచి శ్రీనగర్ కూడలి, ఆదిమూర్తినగర్, ఎన్టీఆర్ మార్గ్, 44వ జాతీయ రహదారి తపోవనం కూడలి, బళ్లారి, కళ్యాణదుర్గం, రుద్రంపేట నడకదారి, రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి కూడలి వరకు పెద్ద సంఖ్యలో కేఫ్‌లు విస్తరిస్తున్నాయి.

**ఏమేం ఉంటాయి** ఇరానీ టీ, గ్రీన్, తాటిబెల్లం, అల్లం, జింజర్, బ్లాక్, మసాలా, బ్లూ, బ్లాక్ జింజర్, దమ్, రాగి మాల్ట్

## ఆ 'గంట' గడిస్తే చాలు



అనంతపురం : గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. 2 వేల గ్యాలన్ల రక్తాన్ని శుద్ధిచేసి 60 వేల మైళ్ల దూరం పంపింగ్ చేయగలుగుతుంది. ఆధునిక మనిషి పరుగు వేగం అందుకునేందుకు అంతటి గుండెకు సైతం ఒత్తిడి పెరుగుతోంది. అలుపెరుగని హృదయానికి వచ్చే జబ్బులపై కన్నేసి కాపాడుకుంటేనే మనకు జీవితం..
1.ఆందోళన : ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు
2.కారణాలు : కల్తీ ఆహార పదార్థాలు తినటం, సరైన ఆహారం తీసుకోక, చెడు వ్యసనాలకు అలవాటు, శారీరక వ్యాయామం లేకపోవడం
3.ఊరట : ఆసుపత్రుల్లో రూ.45 విలువ చేసే టెనెక్టప్లెస్ ఇంజక్షన్ అందుబాటులో..

**గోల్డెన్ అవర్..**
గుండె సమస్యతో సదరు ఆసుపత్రులకు రోగులు వస్తే వెంటనే వారికి బీపీ, ఈసీజీ పరీక్ష చేసి వచ్చే ఫలితాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టెమీయాప్ ద్వారా గుండె వైద్య నిపుణులకు పంపితే వారు వాటిని పరిశీలించి రోగికి ఎలాంటి చికిత్సలు అందించాలో సూచిస్తారు. ఆ మేరకు టెనెక్టప్లేస్ ఇంజక్షన్‌ను వైద్యులు, సిబ్బంది రోగికి వేసి ప్రాణాలను కాపాడుతున్నారు. గుండె సమస్య తలెత్తిన గోల్డెన్ అవర్‌లో రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వారికి సకాలంలో ఇంజక్షన్ వేసి పునర్జన్మ ఇస్తున్నారు.
గుండెపోటు బాధితులకు సీపీఆర్ చేయాలి. వారిని గోల్డెన్ అవర్‌లోనే తీసుకొస్తేనే బతికించడం సాధ్యం అవుతుంది. వైద్యులు సూచించిన చికిత్స విధానాలు చేపడితే కొన్ని నిమిషాల్లో కుదుట పడతారు. అప్పటికీ ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోతే వెంటనే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ వేయాలి. ఆరోగ్యం నిలకడగా ఉన్న తరువాత ఆసుపత్రులకు తరలిస్తే శస్త్రచికిత్స ఉచితంగా చేస్తారు.
డాక్టర్ డేవిడ్ సిల్వన్‌రాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త

**ఈ లక్షణాలుంటే..** గుండెదడ, ఛాతీపై బరువు, మంటగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది, వాంతులు, దవడ నొప్పి, చెమటలు పట్టడం, తలతిరిగి కిందపడిపోవటం, ఛాతినొప్పి, ఎడమచేతి వరకూ రావటం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

## ఎక్కడ ఆగుతాయో ఏమో!



అనంతపురం : నిరంతర ప్రయాణం.. సంవత్సరాలు పెరిగే కొద్దీ బస్సులు రిపేర్లు రావడం సాధారణం. ఎప్పటికప్పుడు సక్రమంగా చూసుకొని మరమ్మతులు సాగిస్తేనే బండి ముందుకు కదులుతుంది. నిత్యం వేలాది ప్రయాణికులను గమ్యానికి చేర్చే ఆర్టీసీ బస్సుల సామర్థ్యాన్ని నిరంతరం పరిశీలించాల్సిందే. అయితే అలాంటి వాతావరణం ఉందా.. ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బస్సుల్లో సగానికి పైగా పదేళ్లు దాటినవే. అనంతపురం ఆర్టీసీ డిపోలో రెండు బస్సులు తుక్కుకు పంపగా మరో 4 బస్సులు పంపాల్సి ఉంది. 2026లో మరో 15 బస్సులు గడువు ముగుస్తోంది. వాటిని తుక్కుకు పంపాల్సి ఉంది. జిల్లాలోని 7 డిపోల పరిధిలో కాలం సమీపిస్తున్న బస్సులు ఇదే తరహాలోనే ఉన్నాయి. వాహనచట్టం ప్రకారం 15 ఏళ్లు కంటే ఎక్కువ సంవత్సరాలు బస్సుల్ని నడపకూడదు. 14 సంవత్సరాలు దాటిన బస్సులు కాలం సమీపిస్తుండటంతో అవి ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి.
ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకం ప్రారంభం తర్వాత 72 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేటు తాజాగా 85కు చేరుకుంది. గడువు సమీపిస్తున్న బస్సుల్లో ఈ తరహా ప్రయాణాలు ఆపేయాల్సి ఉంది.
ఈనెల 3న అనంతపురం డిపో బస్సు తాడిపత్రికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులతో వస్తుండగా క్లచ్ పని చేయలేదు. డ్రైవర్ బస్సును పాతూరు మార్కెట్ మీదుగా కాకుండా ఎన్టీఆర్ మార్గ్ మీదుగా తీసుకొచ్చి ప్రధాన రోడ్డులో ఆపి దించాల్సి వచ్చింది.
ఈనెల 5,6 తేదీల్లో వరుసగా పుట్లూరు మండలంలో బస్సులు అదుపు తప్పాయి. 5న చింతకుంటలో అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లింది. 60 మంది ప్రయాణికులకు ప్రమాదం తప్పింది.
మరమ్మతులు చేసి పంపుతున్నాం..
షెడ్యూల్ ప్రకారం బస్సును పరిశీలించి మరమ్మతులు చేసి పంపుతున్నారు. సక్రమంగా లేని విడిభాగాలను తొలగిస్తున్నాం. 15 సంవత్సరాల గడువు తీరిన బస్సులు ఎక్కడా పంపడం లేదు.
శ్రీలక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారిణి
అనంతలో ఆర్టీసీ డిపోలు: 7
బస్సులు: 470
15 సంవత్సరాలకు దగ్గరలో ఉన్న బస్సులు: 70
సగటున రోజుకు ప్రయాణికులు: 2.10 లక్షలు

## ప్రకృతి వనరు.. దోపిడీ ఆపరు



పుట్టపర్తి: పచ్చనిచెట్లతో ఆహ్లాదం పంచే కొండలు, గుట్టలను చూస్తే ఎవరికైనా మనసు పరవశించిపోతుంది. అక్రమార్కులకు వాటిని చూస్తే నోట్ల కట్టలు కనిపిస్తున్నాయి. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లు స్థానిక నాయకులు.. అధికారులతో కుమ్మక్కై ప్రకృతి వనరులను దోచేస్తున్నారు.

**రూ.లక్షల్లో గండి..** కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో రాయి, ఇసుక, మట్టి తవ్వకాలు జరిపే ముందు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. కొత్తచెరువులో పట్టా భూమి అని చెబుతున్నా.. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు లేవు. వ్యవసాయ యోగ్యం కాని గుట్టకు అప్పటి అధికారులు జేబులు నింపుకొని పట్టాలిస్తే.. గత వైకాపా ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా 50 శాతం గుట్టను అక్రమార్కులు మింగేశారు.

**కాసులు కురిపిస్తున్న ఇసుక** బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో ఇసుక రీచ్ నుంచి ట్రిప్పర్ల ద్వారా ధర్మవరం మీదుగా బెంగళూరుకు అక్రమంగా తరలిపోతోంది. చిత్రావతి నది నుంచి బత్తలపల్లి మీదుగా అనంతపురం, ముదిగుబ్బ, కదిరి మీదుగా మదనపల్లికి రవాణా చేస్తున్నారు. కొత్తచెరువు మండలం వంగపేరు నుంచి పట్టపగలే ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.
ఎక్కడ? కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లికాలనీకి సమీపంలో సర్వే నంబరు.392లో ఉన్న దాసరిపాము గుట్ట
ఏం చేస్తున్నారు? హిటాచీ, టిప్పర్లతో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. పెద్ద బండరాళ్లను ముక్కలు చేయడానికి పేలుళ్లు నిర్వహిస్తున్నారు.
స్థానికుల మాట కొత్తచెరువులో రెండ్రోజుల కిందట పేలుళ్లు జరిగాయి. వణికిపోయాం. ఇదేమని అడిగితే తమ పేరుతో పట్టా ఉందంటున్నారు. సొంత స్థలమైతే ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేసుకోవచ్చా? అని అడిగితే సమాధానం లేదు.

**చర్యలు తీసుకుంటాం** అనుమతి లేకుండా కొండలు, గుట్టలు తవ్వితే విచారణ చేపడతాం. పేలుళ్లు చేయాలన్నా నిబంధనలు పాటించాల్సిందే. స్థానిక అవసరాలకు కాకుండా వ్యాపారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఓబుళరెడ్డి, మైనింగ్‌శాఖ ఏడీ

## రూ. 50 కోట్లతో పద్మావతి ఘాట్

తిరుపతి : పవిత్ర స్వర్ణముఖి తీరంలోని తిరుచానూరులో పద్మావతి ఘాట్ ఏర్పాటుకు తుడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే పంచమీ తీర్థం నాడు లక్షలాది మంది ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఘాట్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది.

**సుమారు 50 ఎకరాల్లో..**
తిరుచానూరు నుంచి పాడిపేటకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న స్థలం వద్ద సుమారు 50 ఎకరాల్లో పద్మావతి ఘాట్ నిర్మించాలని నిర్ణయించారు. స్నానాలు ఆచరించడానికి నీటి నిల్వ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎగువ భాగంలో 11 చెక్‌డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేసేలా సర్వే చేపట్టారు. అందుకోసం రూ.18 కోట్లు అవసరమని అధికారులు నివేదికలు పంపించారు. రాజమండ్రికి చెందిన ఓ నిపుణుడు ఇప్పటికే ఘాట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించి నమూనాలు సిద్ధం చేసేందుకు అంగీకారం కోరినట్లు చెబుతున్నారు. ప్రతి శుక్రవారం పద్మావతి ఘాట్‌లో హారతి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.



జలవనరుల శాఖతో సంబంధం లేకుండా రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తుడా ప్రతిపాదించింది.

**మురుగును అడ్డుకోవడమే సవాలు**
ఘాట్ ప్రతిపాదిత ప్రాంతానికి ఎగువ భాగంలో స్వర్ణముఖిలోకి పలు ప్రాంతాల్లో మురుగునీరు ప్రవేశిస్తోంది. ఇవి నది పవిత్రతను దెబ్బతీస్తున్నాయనే ఆవేదన భక్తుల్లో ఎక్కువగా ఉంది. దీంతో అవసరమైన ప్రాంతాల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి కలుషితాలను నియంత్రించేందుకు నగరపాలిక సహకారం తీసుకోనున్నారు. ఇందులో రెవెన్యూ, జలవనరుల శాఖ, తుడా ప్రణాళిక విభాగం, సర్వే శాఖలను భాగస్వాములను చేశామని తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు.

## అత్యవసర వైద్య సేవలకు సన్నద్ధం


విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి ఉన్నతస్థాయి ప్రముఖులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్యారోగ్య సేవలను పర్యవేక్షించే బాధ్యతను డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.వాణికి అప్పగించారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే సేవలందించేందుకు సిద్ధంగా ఉండేందుకు వైద్యులు, సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు.

**వైద్య బృందాలు.. అంబులెన్సులు**
సదస్సు ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో మూడు షిఫ్టుల్లో అక్కడ వైద్యులు, సిబ్బంది సేవలందిస్తారు. అత్యవసర సేవలందించేందుకు వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.
జనరల్ ఫిజీషియన్, హృద్రోగ నిపుణులు, ఇతర వైద్య నిపుణులు, నర్సింగ్, ఇతర సిబ్బంది ఇక్కడుంటారు. పరిస్థితికి తగ్గట్టుగా చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు, ప్రాథమిక రోగనిర్ధారణ పరికరాలు సిద్ధం చేస్తున్నారు.
కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూం నుంచి వైద్యారోగ్య శాఖ తరఫున ఒక ప్రతినిధి నిత్యం పరిస్థితిని పర్యవేక్షిస్తారు.
కంట్రోల్ రూం, హాస్టల్, పార్కింగ్ స్థలం తదితర ఆరు ప్రాంతాల్లో అంబులెన్సులు అందుబాటులో ఉంటాయి.
ప్రతినిధులు బస చేయనున్న రాడిసన్ బ్లూ, నొవొటెల్, గ్రాండ్ బే, దసపల్లా హొటళ్ల వద్ద అంబులెన్సులతో పాటు వైద్య బృందాలు సిద్ధంగా ఉంటాయి. – కేజీహెచ్, అపోలో, కేర్, మెడికవర్ ఆసుపత్రుల యాజమాన్యాలను అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందిం చేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.
ప్రయాణ సమయంలో తక్షణ వైద్య సహాయం కోసం వీవీఐపీ కాన్వాయ్‌లో ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేయనున్నారు.

## ఆధార్ అధనంపై ఫిర్యాదు చేయొచ్చు

నంద్యాల : ఆధార్ కార్డుల్లోని తప్పుల సవరణ, పేరు, చిరునామాల్లో మార్పులు, నవీకరణ తదితరాల కోసం జనం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కు సంబంధించిన వివిధ మార్పులు చేర్పుల కోసం ఇదివరకు ఉన్న సర్వీసు రుసుము కాస్త పెంచింది. కేంద్రాల నిర్వాహకులు ఆ మేరకే వసూలు చేయాలి.

**ఆన్‌లైన్లో సంప్రదించొచ్చు**
రెసిడెంట్.యూఐడీఏఐ.ఇన్‌లోకి వెళ్లి లింక్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు లేదంటే హెల్ప్(అట్)యూఐడీఏఐ.జీవోవీ.ఇన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.




ఫిర్యాదు చేసిన వెంటనే రెఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ద్వారా నివేదికను ట్రాక్ చేసుకోవచ్చు.
కొత్త సర్వీసు ఛార్జీలు
కొత్తగా ఆధార్ నమోదు ఉచితం. డాక్యుమెంటు అప్‌లోడ్ చేయడానికి రూ.75 ఛార్జీలు ఉంటాయి. 5–7, 15–17 ఏళ్ల లోపు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితం. పేరు, చిరునామా, పుట్టిన తేదీ, జెండర్, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదుకు రూ.75 ఛార్జీలు ఉంటాయి. 17ఏళ్ల పైనున్న వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ రూ.125 ఛార్జీలు ఉన్నాయి. ఆధార్ కార్డు డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.40 ఛార్జీలు ఉన్నాయి. 1947 నంబరుకు ఫోన్ చేస్తే..
ఆధార్ కేంద్రాల్లో నిర్దేశిత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే 1947 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

# గాలి వీచికలో.. విద్యుత్తు విప్లవం

చిత్తూరు :రాయలసీమ ఎండలే.. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కాంతి అవకాశాలను సృష్టిస్తున్నాయి. ఇక్కడ వేడెక్కే సూర్యకిరణాలు, వీచే గాలి.. విద్యుత్తు రూపంలో కొత్త పరిశ్రమలకు శక్తిగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, స్థానిక యువత చేతిలో పునరుత్పాదక శక్తి రంగం వేగంగా విస్తరిస్తోంది. వాయు, సౌర విద్యుత్తు ప్రాజెక్టులు కొత్త ఉద్యోగాలను పెంచుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో కొండ రిడ్జ్‌లపై వాయు టర్బైన్ ప్రాజెక్టులు ఇప్పటికే అమలవుతున్నాయి. గ్రీన్‌కో, సుజ్లాన్, మైక్రోటెక్, హెటెరో ఎనర్జీ వంటి సంస్థలు కొన్నేళ్లుగా పెట్టుబడులు పెట్టాయి. ఇవి విద్యుత్తు ఉత్పత్తితో పాటు, స్థానికంగా ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి.

తితిదే స్వయంగా విండ్ టర్బైన్ ప్రాజెక్ట్ ద్వారా వాయు విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. స్థానిక ప్రాజెక్టుకు ఇది మంచి ఉదాహరణ.

**44 వేల మెగావాట్లు**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ అంచనా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో వాయు విద్యుత్తు సామర్థ్యం ఉంది. అందులో తిరుపతి, చిత్తూరు జిల్లాలనూ విండ్ జోన్‌గా గుర్తించారు.

టాటా పవర్ ఎంఓయూ టాటా పవర్, ఏపీ ప్రభుత్వం ఏడు వేల మెగావాట్ల సామర్థ్యమున్న సౌర, వాయు విద్యుత్తు హైబ్రిడ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ ఈ సంస్థ వాయు ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఉంది.

5–7 మీటర్లు: ఇక్కడి కొండల్లో గాలి సెకనుకు వీచే వేగం ఇది.



టర్బైన్‌లు తిరగడం సులభం. ఎందుకు అనుకూలమంటే: మదనపల్లె, పలమనేరు, కురబలకోట, పూతలపట్టు ప్రాంతాల్లో గాలివేగం ఎక్కువ.వాయుశక్తి పార్కులు: పలమనేరు, కురబలకోట, మదనపల్లె కొండ ప్రాంతాలు

**స్థానిక ప్రజలకు లాభాలు**

ఉపాధి అవకాశాలు: ఇన్‌స్టాలేషన్, ఆపరేషన్, మెయింటెనెన్స్, సెక్యూరిటీ రంగాల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు.

ఆర్థిక లాభాలు: భూమి లీజుకు ఇచ్చిన రైతులకు స్థిరమైన అద్దె లభిస్తుంది.విద్యుత్తు స్వావలంబన: స్థానిక స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి. గ్రామీణ ప్రాంతాలకు లాభం.పర్యావరణ సంరక్షణ: కర్బన ఉద్గారాలు తగ్గుతాయి, స్వచ్ఛమైన ఇంధనం అందుతుంది.

**భవిష్యత్తు అవకాశాలు**

చిత్తూరు జిల్లాలో వాయు ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికలు కొనసాగు తున్నాయి. తిరుపతి, మదనపల్లె ప్రాంతాలు రాబోయే 5–7 సంవత్సరాల్లో పునరుత్పాదక శక్తి కేంద్రాలుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. స్థానిక పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల్లో విండ్ టర్బైన్ ఎనర్జీ టెక్నీషియన్ కోర్సులు ప్రారంభించే అవకాశముంది.

**ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులు**


రాష్ట్ర ప్రభుత్వం ఏపీ విండ్ పవర్ పాలసీ–2018 అమలు చేస్తోంది. భూమి లీజు రాయితీలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, నెట్ మీటరింగ్, సబ్సిడీలు లభిస్తున్నాయి.

అదానీ గ్రీన్ ఎనర్జీ, టాటా పవర్ రిన్యూవబుల్స్ వంటి సంస్థలు రాష్ట్రంలో వాయు విద్యుత్తు విస్తరణకు భారీ పెట్టుబడులు పెట్టాలని ప్రణాళిక చేస్తున్నాయి. కొత్త ప్రాజెక్టులకు నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ అనుమతులు ఇస్తుంది.

సామర్థ్యం 1.83 మెగావాట్లు (కొత్తగా 800 కిలోవాట్ల టర్బైన్ స్థాపన)

# మక్క ధర ముక్కలు

ఆత్మకూరు : మక్క రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలో 53,605 హెక్టార్లు, కర్నూలులో 6,200 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేపట్టారు. సాధారణంగా ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది..ఈసారి అధిక వర్షాల నేపథ్యంలో 15–25 క్వింటాళ్లకే పరిమితం అవుతోంది. పంట చేతికొచ్చినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు..దీన్ని అదనుగా చేసుకొని వ్యాపారులు ధరలు అమాంతం తగ్గించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తక్కువకు కొంటున్నారు. ఈనెల 18వ తేదీన 1,950, 20న రూ.1,800 పలికింది. కమీషన్ వ్యాపారులు దగా చేస్తున్నారు. వ్యాపారులను మార్కెట్‌లోకి రాకుండా



లాడ్జీల వద్ద కూర్చోబెట్టి.. వారికి కావాల్సిన సరకును తామే అందిస్తామని మంతనాలు జరిపినట్లు ఆరోపణలున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యాపారికి ఎక్కువ ధరకు వియిస్తుండటం గమనార్హం.

'ధర'దడరవి, కరివేన


ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు కొంటున్నారు. 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఆరెకరాలు కోస్తే 80 క్వింటాళ్లు వచ్చింది. క్వింటాకు రూ.1,850 చొప్పున విక్రయించా. ఎకరా పెట్టుబడి రూ.45–50 వేలైతే.. దిగుబడి అమ్మగా ఎకరాకు రూ.26 వేల ప్రకారం వచ్చింది.

ప్రభుత్వానికి నివేదించాం

హరినాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. దస్త్రం సీఎస్ వద్ద ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

# అమ్మో... ఆ రహదారా!



యర్రగొండపాలెం : జాతీయ రహదారుల ఆకృతులు, నిర్మాణ పద్ధతులు లోపభూయిష్టంగా మారాయి. రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రమాదాలు తగ్గడం లేదు. ఈ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. దీన్ని సమీక్షించాల్సిన అవసరముంది..గత నెల 3వ తేదీన అన్నసముద్రం మెట్ట వద్ద జాతీయ రహదారి–544డిని దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న పాత అన్నసముద్రానికి చెందిన దంపతులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరికి పదేళ్ల లోపున్న ఇద్దరు పిల్లలున్నారు.

ఈ ఏడాది జులై 3న రాజుపాలెం వద్ద ట్రాలీ, లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందారు. ఇలా అనంతపురం– గుంటూరు జాతీయ రహదారి 544–డిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లె నుంచి జి.ఉమ్మడివరం దాకా 32 కిలోమీటర్ల పొడవునా రహదారి విస్తరించింది. రాయలసీమను రాజధానికి అనుసంధానించే కీలక రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇంతటి ప్రధానమైన రహదారి నిత్యం రక్తమోడుతోంది.

**నివారణ మార్గాలు...:** కేశినేనిపల్లె పైవంతెన సమీపంలో వేగనిరోధకాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వెల్లంపల్లె మినహా గ్రామాల పరిధిలో వేగనిరోధకాలు నిర్మించాలి. ముడివేముల, అన్నసముద్రం వైపు నుంచి వాహనాలు జాతీయ రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

**ఇక్కడే అత్యధికం...**

జాతీయ రహదారిపై కేశినేనిపల్లె, రాజుపాలెం, మేడపి మెట్ట, అన్నసముద్రం మెట్ట, ముడివేముల క్రాసింగ్ వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కేశినేనిపల్లె సమీపంలో పైవంతెన దిగే క్రమంలో వాహనాల వేగం ఎక్కువగా ఉంటోంది. దీని సమీపంలోని మిర్చి గోదాం వద్ద రహదారి పల్లంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకి వచ్చేదాకా కనిపించడంలేదు. పైవంతెనకు ఓ వైపు కింది వంతెన నిర్మాణం నిలిచిపోయింది. దీంతో దూపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు వై.పాలెం వెళ్లాలంటే ఇక్కడి పైవంతెన వద్ద రహదారిని దాటాల్సి వస్తోంది. పైనుంచి వచ్చే వాహనాల వేగానికి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అన్నసముద్రం, ముడివేములకు వెళ్లే రహదారులు జాతీయ రహదారిలో కలుస్తాయి. ఆయా గ్రామాల నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారిపైకి వచ్చేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి.

రహదారిపై గడిచిన మూడేళ్లలో 42 ప్రమాదాలు జరగ్గా 39 మంది మృత్యువాతపడ్డారు. మరో 86 మంది క్షతగాత్రులయ్యారు.

# కలిసొచ్చిన ఖరీఫ్!



ఒంగోలు : తగినంత వర్షపాతం, సకాలంలో సాగర్ నీరు విడుదల కావడం ఈ సారి ఖరీఫ్ సీజన్‌కు కలిసొచ్చాయి. దీంతో దాదాపు సాధారణ విస్తీర్ణం మొత్తం సాగులోకి వచ్చింది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 1,29,102 హెక్టార్లు కాగా, గడిచిన సంవత్సరం 1,18,783 హెక్టార్లు సాగులోకి వచ్చింది. ఈ ఏడాది 1,26,420 హెక్టార్లలో (99.11 శాతం) పంటలు వేశారు. సాధారణంగా అక్టోబరు 15తో ఖరీఫ్ సీజన్ ముగుస్తుంది. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే జిల్లాలో ఆలస్యంగా ఖరీఫ్ మొదలై ఆలస్యంగా ముగుస్తుంది.

**రాయితీపై వ్యవసాయ పరికరాలు**గత వైకాపా ప్రభుత్వంలో మూలకు చేరిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. రూ.2.78 కోట్ల రాయితీపై 1,253 మంది రైతులకు వారు కోరుకున్న వ్యవసాయ పరికరాలు అందజేసింది. తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. ఇలా జిల్లాలో ఎంపిక చేసిన రైతు సంఘాలకు 42 డ్రోన్లు అందజేసింది. ప్రస్తుతం వాటితోనే పంటలకు రైతులు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో జేడీఏ శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇప్పటివరకు పంటలు ఆశాజన కంగా ఉన్నాయన్నారు. రానున్న రెండు నెలల్లో ఉపద్రవాలు రాకుంటే పంటలకు మేలు జరుగుతుందన్నారు.

ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరగడానికి ప్రధానంగా రెండు అంశాలు దోహద పడ్డాయి. ఏటా సాగర్ నీరు ఆగస్టు చివరి వారంలో విడుదల చేసేవారు. అసలు ఇస్తారా లేదా తెలియక రైతులు వరినార్లు పోసేవారు కాదు. ఈ సారి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరుండడంతో జులైలోనే విడుదల చేశారు. ఫలితంగా వరి సాగు పెరిగింది. సాధారణ విస్తీర్ణం 12,826 హెక్టార్లు కాగా, గతేడాది 9,559 హెక్టార్లు సాగైంది. ఈ ఏడాది ఇప్పటివరకు 16,820 హెక్టార్లు (130.41 శాతం) సాగులోకి వచ్చింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. మార్కెట్‌లో శనగ ధర ఆశాజనకంగా లేకపోవడంతో మొక్కజొన్న వైపు రైతులు మొగ్గుచూపారు. సాధారణ విస్తీర్ణం 3,120 హెక్టార్లు కాగా, ఈ ఏడాది 8,801 హెక్టార్లు (282.08 శాతం) సాగు చేశారు.ఖరీఫ్ విస్తీర్ణం పూర్తిగా సాగులోకి రావడానికి కలిసొచ్చిన మరో అంశం వర్షపాతం. జూన్ నుంచి అక్టోబరు వరకు ఖరీఫ్ సీజన్ కాగా, ఈ అయిదు నెలల్లో నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం 574 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటివరకు 480 మిల్లీమీటర్లు నమోదైంది. గతేడాది ఆగస్టులో భారీవర్షాలు కురవడంతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ రైతుల వారీగా నష్టాలు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ సమస్య ఉత్పన్నం కాలేదు.

# పనుల తీరు.. 'నీరు'త్సాహం

ఆళ్లగడ్డ : అహోబిలం మండలం బండ్లగడ్డ చెంచుగూడెం, విద్యుత్తు సబ్ స్టేషన్ సమీపంలో ట్యాంకు నిర్మాణాలు జరుగుతున్నాయి. బండ్లగడ్డ చెంచుగూడెంలో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు చివరి దశకు చేరాయి. ట్యాంకు పైభాగం నిర్మించాల్సి ఉంది. సబ్‌స్టేషన్ సమీపంలోని ట్యాంకు పిల్లర్ల దశలో ఉంది. గుత్తేదారులకు నిధులు విడుదల కాకపోవడంతో ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. పల్లెల్లో ఇంటింటికి మంచినీరు అందించాల్సిన జల్‌జీవన్ పనులు నెమ్మదించాయి. ఉమ్మడి జిల్లాలో 53 మండలాల పరిధిలోని 6,92,790 మందికి శుద్ధి చేసిన నీరు అందించేలా 2020లో ఈ పథకానికి రూపకల్పన చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం 'నీరు'గార్చింది. 25 శాతం లోపు జరిగిన పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. పనులు నత్తను తలపిస్తున్నాయి.

**అందని బిల్లులు**

కర్నూలు జిల్లాలో 246 ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 53, నంద్యాల జిల్లాలో 183కుగాను 63 మాత్రమే పూర్తి చేశారు. రెండు జిల్లాల్లో కలిపి 532 కి.మీ. పొడవునా పైపులైను పనులు చేయాల్సి ఉంది.

కర్నూలు జిల్లాలో రూ.12.17 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.14.23 కోట్ల పనులకు సంబంధించి గుత్తేదారులకు చెల్లింపులు జరగాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

**ఇక్కడ మొదలే పెట్టలేదు** నంద్యాల జిల్లాలోని ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, గోస్పాడు, శిరివెళ్ల, ఆత్మకూరు, వెలుగోడు, పాణ్యం, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలాల్లో పనులు కనీస స్థాయిలో ప్రారంభం కాలేదు. గోనెగండ్ల, పెద్దకడబూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోసిగి, కోడుమూరు, పత్తికొండ, కౌతాళం, మద్దికెర మండలాల్లో మందకొడిగా సాగుతు న్నాయి.

**వేగం పెంచకపోతే కష్టమే**



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని పాత పనులను రద్దు చేసి కొత్తగా కర్నూలు జిల్లాలో 112, నంద్యాల జిల్లాలో 87 పనులు మంజూరు చేసింది. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది. నంద్యాల జిల్లాలో రూ.390 కోట్లతో చేపట్టనున్న పనుల్లో 14 వేల కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 3,560 కనెక్షన్లు ఇచ్చారు.

కర్నూలు జిల్లాలో 2,768 కనెక్షన్లు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో రూ.412 కోట్లతో చేపడుతున్న పనుల్లో భాగంగా ఇప్పటివరకు 15 శాతం పురోగతి మాత్రమే ఉండగా, నంద్యాల జిల్లాలో 13 శాతం పురోగతి మాత్రమే ఉంది. పనులు ఇలానే సాగితే నిర్దేశించిన సమయంలో పూర్తి చేయడం అసాధ్యమేనన్న భావన వ్యక్తమవుతోంది.

కర్నూలు జిల్లాలో పులికనుమ, పందికోన, గాజులదిన్నె రిజర్వాయర్లు, నంద్యాల జిల్లాలో గోరుకల్లు రిజర్వాయరు, వెలుగోడు, అవుకు, అలగనూరు, శ్రీశైలం ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 722 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం రూ4,343.80 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ప్రస్తుతం కొనసాగుతున్న పనులు: 423

అంచనా విలువ: రూ. 174 కోట్లు

ఇందులో పూర్తైనవి : 325

పురోగతిలో ఉన్నవి : 93

చేయని పనులు : 5

# 108కు ఊపిరి

ఆళ్లగడ్డ : గత వైకాపా ప్రభుత్వ హయాంలో 104, 108 సేవలు అధ్వానంగా మారాయి. వాహనాల నిర్వహణ పట్టించుకోలేదు. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ ఆగిపోయేవి. రోగులకు వైద్యం అందక ప్రాణాలు వదిలేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నూతన వాహనాలను ఏర్పాటు చేయడంతోపాటు భవ్య హెల్త్ సర్వీసెస్‌కు బాధ్యతలు అప్పగించింది. రోగులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చేలా సదరు ఏజెన్సీకి ఆదేశాలు ఇచ్చింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 57 వరకు 108 వాహనాలు ఉన్నాయి. 285 మంది ఈఎంటీలు, పైలెట్లు ఉన్నారు. వీరందరూ పకడ్బందీగా విధులు నిర్వహించేలా తగిన చర్యలు చేపట్టారు. అత్యవసర కేసులకే ప్రాధాన్యమిస్తున్నారు. నంద్యాల జిల్లా పరిధిలో పరిశీలిస్తే జూన్ నుంచి ఇప్పటివరకు 7,336 మంది రోగులను సకాలంలో ఆస్పత్రులకు తరలించి వారి ప్రాణాలు కాపాడారు.

**నాడు డయాలసిస్ రోగులకే ప్రాధాన్యం**

గతంలో మూత్రపిండ సమస్యలతో బాధపడే రోగులను 108 వాహనంలోనే తరలించేవారు. ఎక్కువ సర్వీసులన్నీ డయాలసిస్ రోగుల సేవకే పరిమితమయ్యేవి. ఆ తర్వాతే ఇతర అత్యవసర కేసులకు సిబ్బంది హాజరయ్యేవారు. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం డయాలసిస్ రోగులకు ఉచిత బస్సు పాసులను అందజేసింది. ఫలితంగా 108 వాహనాలు నిత్యం అత్యవసర రోగుల సేవలో ఉంటున్నాయి.

**ఆ రెండు నిబంధనలు తప్పనిసరి**

గోల్డెన్ అవర్ నిబంధనను కొత్త ఏజెన్సీ కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఘటన జరిగితే 18 నిమిషాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 23 నిమిషాల్లో రోగి లేదా క్షతగాత్రుడి వద్దకు చేరుకోవాలి. అక్కడి నుంచి వాహనంలోనే వైద్యం అందిస్తూ రోగిని ఆసుపత్రికి చేర్చాలి. ఏదైనా అత్యవసర కాల్స్ వచ్చిన సమయంలో తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ రెండు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలంటూ కొత్త కంపెనీకి ప్రభుత్వం షరతులు పెట్టింది.

పాతబడిన వాహనాలకు కొత్త ఏజెన్సీ మరమ్మతులు చేయిస్తోంది. సేవలకు ఆటంకం లేకుండా విడతలవారీగా బాగు చేయిస్తున్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాలకు 4 కొత్త వాహనాలు అందుబాటులోకి రానున్నాయి.

**అవసరం లేకపోయినా..**




అవసరం లేకపోయినప్పటికీ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నుంచి రెఫరల్ కేసులను 108లో జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులకు తరలించేవారు. వైద్యులు లేకున్నా.. ముందే సంతకంతో సిద్ధంగా ఉన్న రెఫరల్ లేఖ సాయంతో ఆరోగ్య సిబ్బందే 108 ద్వారా రోగిని ఇతర ప్రాంతాలకు పంపి చేతులు దులుపుకొనేవారు. ప్రస్తుతం నూతన ఏజెన్సీ దీనిపై దృష్టి సారించింది. 108లోని ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) వద్ద అదనపు రెఫరల్ లెటర్ సిద్ధంగా ఉంచి దానిపై నేరుగా వైద్యుడే సంతకం చేసి రెఫర్ చేస్తే తప్ప రోగిని తరలించ కుండా గట్టి చర్యలు చేపట్టింది.

**నాణ్యమైన సేవలపై దృష్టి**


అవుకులో చిన్నపాటి ప్రమాదం జరగ్గా.. బాధితుడిని 20 కి.మీ దూరంలోని బనగానపల్లికి తరలించాం. అక్కడ వాహనంలో నుంచి దించకుండానే నేరుగా నంద్యాలకు రెఫర్ చేశారు. మళ్లీ 40 కి.మీ ప్రయాణించి నంద్యాలలో చేర్పించారు. ఇలాంటివి తగ్గితే మరింత మెరుగైన సేవలు అందించగలమని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు

# 16 గ్రామాల్లో.. బహుళ భవనాలు

బుట్టాయగూడెం : మన్యంలోని మారుమూల కొండరెడ్డి తెగ గిరిజనుల నివాసిత గ్రామాలకు బహుళ ప్రయోజన భవనాల సదుపాయం ఒనగూరుతోంది. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకం కింద 16 గ్రామాల్లో భవనాల నిర్మాణానికి రూ.9.60 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.60 లక్షల చొప్పున కేటాయించారు. కేఆర్‌పురం ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

అవస్థలకు చెల్లు.. ఆయా గ్రామాల్లో సరైన పక్కా భవన సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. బహుళ ప్రయోజన భవనాలు పూర్తయితే అన్ని రకాల ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుతాయి. విద్య, వైద్య తదితర సదుపాయాలను ఈ భవనాల్లో సమకూర్చుతారు. స్థానికులు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలు కలుగుతోంది.

బుట్టాయగూడెం మండలం రామనర్సాపురం, నాగన్నగూడెం, ఉప్పరిల్ల,



గొట్టాలరేవు, రెడ్డిబొడ్డేరు, రేగులపాడు, రేపల్లి, వేరుమద్దిగూడెం, లంకపాకల, మోతుగూడెం, తానిగూడెం, వీరన్నపాలెం, పోలవరం మండలం కల్లుమామిడి, చిలకలూరు, తంగేడుకొండ, ఉడతపల్లి గ్రామాల్లో వీటి నిర్మాణం చేపట్టారు. గొట్టాలరేవు, రెడ్డిబొడ్డేరు గ్రామాల్లో పూర్తయ్యాయి. రామనర్సాపురం, నాగన్నగూడెం, ఉప్పరిల్ల, రేపల్లి, రేగులపాడు, కల్లుమామిడి, మోతుగూడెం, వేరుమద్దిగూడెం, లంకపాకల గ్రామాల్లో శ్లాబ్‌లు పూర్తి చేసుకున్నాయి. తానిగూడెం, చిలకలూరు, వీరన్నపాలెంలలో శ్లాబ్‌ల దశకు చేరుకున్నాయి. తంగేడుకొండ, ఉడతపల్లిలలో పునాదులు పూర్తి చేసుకున్నాయి. ఈ రెండు గ్రామాలకు సరైన రహదారి సదుపాయం లేక నిర్మాణ సామగ్రిని రవాణా చేసేందుకు అవస్థల కారణంగా పనులకు జాప్యమవుతోంది. చురుగ్గా భవనాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని డీఈ ఎం.శ్రీనివాసు తెలిపారు.

# చెరువులను చెరబట్టారు

హిందూపురం: లేపాక్షి పెద్దచెరువు, మల్‌రెడ్డిపల్లి, గొంగటిపల్లి చెరువుల్లో పది రోజుల నుంచి మట్టి దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. పొక్లెయిన్ ఉపయోగించి నిత్యం వందలాది ట్రాక్టర్ల మట్టిని తవ్వి స్థానికంగా, హిందూపురంలోని లేఅవుట్లకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నారు. ఈ వ్యవహారమంతా మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో కొనసాగుతోంది. అనుమతి లేకుండా ఇలా చేయటం తగదని వెంటనే అనుమతులు తీసుకోవాలని సబంధిత శాఖ అధికారులు చెప్పినా వారి మాటలు ఖాతరు చేయటం లేదు. పొక్లెయిన్, ట్రాక్టర్ అంతా వారిదే.. దురాన్ని బట్టి ఒక్కో ట్రిప్పు మట్టికి రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా రోజూ వందలాది ట్రాక్టర్ల



మట్టిని తరలిస్తున్నా స్థానిక అధికారులు తమకు సంబంధం లేదన్న వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

**అక్కడ ఆగింది.. ఇక్కడ మొదలైంది**

చిలమత్తూరు, హిందూపురం గ్రామీణ మండలంలో కొంత కాలం కింద ప్రభుత్వానికి చెందిన భూములు, హంద్రీనీవా కాలువమట్టిని హైవే ఏర్పాటుకు అనధికారికంగా తరలించే వారు. దీనిపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితం కావటంతో అక్కడ తవ్వకాలు నిలిపివేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువులోని మట్టి తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**తరలించ వద్దని చెప్పాం – శైలేశ్, డీఈ, ఇరిగేషన్, హిందూపురం**

గతంలో ఈ చెరువుల్లో కొంతమంది మట్టి తరలించేందుకు ప్రయత్నిస్తే తరలించవద్దని నిలిపివేశాం. ప్రస్తుతం ఎవరు తరలిస్తున్నారు ? అన్న విషయం తెలుసుకొని చెరువుమట్టిని తరలించకుండా చర్యలు తీసుకొంటాం.

# పరిశ్రమలొస్తున్నాయ్.. ప్రైవేట్ రాకెట్లూ దూసుకెళ్తాయ్!

తిరుపతి : చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో ఈ క్లస్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలలో ముఖ్యమైన భాగం. సిల్క్, గార్మెంట్స్ వంటి ప్రత్యేక రంగాలపై దృష్టి పెట్టడం ద్వారా రాష్ట్రానికి సంపద, ఉద్యోగాలను పెంచేలా చేస్తున్నారు. సుమారు వంద ఎకరాల్లో ఏపీఐఐసీ దీనిని అభివృద్ధి చేసింది. సిల్క్ (రేస్మీ), గార్మెంట్స్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి.

**ప్రాధాన్యం**

జాతీయ రహదారి–16, వెదురుపట్టు క్రాస్‌రోడ్ వద్ద ఉంది. చెన్నై, బెంగుళూరు, తిరుపతి నగరాలకు కనెక్టివిటీ.

**లక్ష్యం:** సిల్క్, గార్మెంట్స్ రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం, జౌళీ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాల సృష్టి, సిల్క్, గార్మెంట్స్ తయారీకి ప్రత్యేకమైన జోన్ ఏర్పాటు. ఆక్వారెల్, విశ్వ అపెరెల్స్, కోమల టెక్స్‌టైల్స్ లాంటి పరిశ్రమలు కొనసాగుతున్నాయి. స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.

**తిరుపతి పెలికాన్ వ్యాలీ ఐటీ పార్క్**


అమెరికాకు చెందిన ఎన్‌ఆర్‌ఐల బృందం తిరుపతి సమీపంలో టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. సుమారు 20 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. తొలిదశలో ఐటీ భవనాలు, వాణిజ్య కాంప్లెక్స్ నిర్మిస్తారు. భవిష్యత్తులో ఇంక్యుబేషన్ కేంద్రాలు, పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు, ఉత్పత్తి, సేవా ఆధారిత ఐటీ కంపెనీలు వస్తాయి. ప్రాజెక్ట్ ప్రారంభ దశలో ఉంది.

**తిరుపతి వద్ద ప్రైవేట్ ఉపగ్రహాల తయారీ**

తిరుపతికి సమీపంలో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను హైదరాబాద్‌కు చెందిన ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఉపగ్రహ ప్రయోగాలు, తక్కువ ధరలో చిన్న ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఇక్కడికి సమీపంలో ఉండటం అనుకూలం. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుంది.

**సౌకర్యాలు**

ఐఐటీ తిరుపతి, ఇస్రో శ్రీహరికోట, శ్రీసిటీ సెజ్‌లకు సమీపంలో ఉంది.



టెక్ కంపెనీలు, స్టార్టప్స్‌కు ప్రాధాన్యం.

**బి.ఎన్. కండ్రిగ పారిశ్రామిక పార్కు**

శ్రీకాళహస్తి నోడ్ ఇండస్ట్రియల్ పార్క్‌గా తొట్టంబేడు, బి.ఎన్. కండ్రిగ మండలాల్లో సుమారు 2,770 ఎకరాల్లో ఏపీఐఐసీ అభివృద్ధి చేస్తోంది. ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, ఆటోమొబైల్ పరిశ్రమలు, ఫుడ్, అగ్రో ప్రాసెసింగ్, గార్మెంట్స్, టెక్స్‌టైల్ తయారీ, బిల్డింగ్ మెటీరియల్స్, నాన్–మెటాలిక్ మినరల్స్, కెమికల్, ఫార్మాస్యూటికల్, లెదర్, ప్లాస్టిక్, ఉడ్ వంటి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, గోదాములు ఏర్పాటవుతాయి.

**రూ.300 కోట్లు అంచనా వ్యయం**

భవిష్యత్తు అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం జౌళీ రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షణకు చర్యలు తీసుకుంటోంది. ఇది క్లస్టర్‌లో మరిన్ని పరిశ్రమల స్థాపనతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

పెట్టుబడి రూ.400 కోట్లు విస్తీర్ణం 300 ఎకరాలు

భవిష్యత్తు ప్రణాళిక: విక్రమ్–1 రాకెట్‌ను అభివృద్ధి చేయడం

# భూముల ధరలకు రెక్కలు.. దర్జాగా కబ్జాలు



కదిరి : భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కన్నుపడుతోంది. కాపాడాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో విలువైనవి అన్యాక్రాంతమవుతున్నాయి. కదిరి ప్రాంతంలోని జాతీయ రహదారి, బాహ్యవలయ రహదారి పరిసరాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు పెరుగుతున్నాయి. కాలువలు, వాగులు, కొండలను సైతం కొల్లగొడుతున్నారు. కదిరి మండలం కాళసముద్రం రెవెన్యూ గ్రామం సర్వేనంబరు 555, 557లో 2.70 ఎకరాల్లో నీటి కాలువ విస్తరించి ఉంచింది. 556–2బి,2సిలో కదిరికి చెందిన ఓ వ్యాపారి జాతీయ రహదారి 42కు ఆనుకుని ఉన్న 2.84 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. భూముల ధరలు పెరుగుతుండటంతో కాలువను ఆక్రమించుకున్నాడు. మద్దిలేరువాగు నుంచి మళ్లించిన నీరు ఈ కాలువ ద్వారా కాళసముద్రం, పట్నం చెరువులకు చేరుతుంది. 20 సెంట్లకు పైగా భూమిని కబ్జా చేశారు. ఇక్కడ ఎకరం భూమి రూ. కోటికిపైగా పలుకుతోంది. స్థానికులు నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసిన పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**కుంచించుకుపోయిన వాగు**

సర్వేనంబరు 21లో 20ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. ఓ స్థిరాస్తి వ్యాపారి 2ఎకరాల డి.పట్టా భూమిని కొనుగోలు చేశాడు. గతంలో డి.పట్టా పొందిన కుటుంబసభ్యులు ఆ భూమిని స్థిరాస్తి వ్యాపారికి విక్రయించారు. బాహ్యవలయ రహదారికి ఆనుకుని ఉన్న భూమికి మంచిధర పలికే అవకాశం ఉందని భావించిన ఆయన.. వాగును ఆక్రమించుకుంటూ చదనుచేసి ప్లాట్లుగా మార్చాడు. ఈ ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.కోటిన్నరపైనే ఉంది.

**కొండను కరిగించేశారు..**

తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద సర్వేనంబరు 793లో సుమారు 12 గంటల విస్తరించిన ఉన్న కొండను పేదలకు పట్టాల పేరుతో ప్రజాసంఘాల నాయకులు కొందరు చదును చేసేశారు. పట్టాలు ఇప్పిస్తామంటూ అమాయక ప్రజల నుంచి డబ్బు వసూలు చేసి.. భూమిని చదునుచేస్తున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. జాతీయరహదారికి సమీపంలో ఉండటంతో సెంటు సుమారు రూ.3 లక్షల మేర పలుకుతోంది. **బాధ్యులపై చర్యలు తీసుకుంటాం– వీవీఎస్‌శర్మ, ఆర్డీఓ, కదిరి**

ప్రభుత్వభూములను ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. కబ్జాలను అడ్డుకునేలా గ్రామ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో కార్యాచరణ రూపొందిస్తాం. అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ఆక్రమణలకు భూములను గుర్తించి.. స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేస్తాం.

# వావి వరసలు మరిచారు



ధర్మవరం : వావివరసలు మరిచి చెల్లెళ్లయిన ఇద్దరు బాలికలపై సోదరులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితుల్లో ఒకరు మృత శిశువుకు జన్మనివ్వగా, మరొకరు 8 నెలల గర్భంతో ఉన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన నిందితుల్లో ఒకరు బాలుడు కావడం గమనార్హం. ఈ రెండు ఘటనలు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరం పట్టణంలో ఓ బాలిక తన తల్లితో కలిసి ఉంటూ ఇంటర్ చదువుతోంది. చెన్నేకొత్తపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడు బాలికకు వరసకు సోదరుడు అవుతాడు. ఇంటికి తరచు వచ్చి వెళుతూ బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తర్వాత ఇంట్లోనే పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చింది. ఆదివారం రాత్రి ఓ ఆసుపత్రిలో తల్లి బాలికను చేర్పించగా, మృత మగ శిశువును ప్రసవించింది. ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు బాధ్యుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపునకు తీసుకున్నట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు.

మరో ఘటన..: శింగనమల మండలానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. రోజూ ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి వచ్చేది. బాలికకు వరసకు సోదరుడైన బాలుడు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం చేయడంతో గర్భం దాల్చింది. ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలియకుండా జాగ్రత్తపడింది. ఆమె కడుపు ఎత్తుగా ఉండటంతో కళాశాలలోని మహిళా అధ్యాపకులు అనుమానించి, ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించగా 33 వారాల గర్భిణిగా తేలింది. విషయం తెలుసుకున్న శింగనమల ఐసీడీఎస్ అధికారులు దీనిపై శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇద్దరూ మైనర్లు కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిసింది.

# ఆహార తనిఖీ.. పట్టేదెవరికీ!



పుట్టపర్తి: ఉరుకుల పరుగుల జీవితంలో అందరూ బిజీ అయిపోయారు. ఇంట్లో తయారు చేసుకునే సమయం లేక, కొందరికి ఓపిక లేక.. ఆహార పదార్థాలను బయట కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఇదే కొందరు వ్యాపారులకు వరంగా మారింది. అక్రమంగా వ్యాపారం చేసేవాడికి పాపం, పుణ్యం అంటూ ఏమీ ఉండవు. ఇష్టమొచ్చినట్లు కల్తీ చేసి వ్యాపారం సాగిస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. దీంతో చాలా మంది ఆహార పదార్థాలు తని అనారోగ్యం బారిన పడుతున్నారు.

**మూణ్నెళ్లకోసారి..!**

తరచూ తనిఖీలు చేయకపోవడానికి కొందరు వ్యాపారుల నుంచి మూణ్నెళ్లకోసారి మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో దుకాణం నుంచి రూ.1,200 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దాబాలు, హొటళ్ల నిర్వాహకులు నెలనెలా ఇవ్వాల్సిందే.

**అవగాహన కల్పిస్తే ఒట్టు..** కల్తీ సరకులు కొనుగోలు, నాసిరకం ఆహారం తీసుకోవడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఎక్కడైనా అక్రమాలు జరుగుతుంటే ఎలా ఫిర్యాదు చేయాలో తెలియజేయాలి. ఈ ఏడాదిలో అలాంటి అవగాహన కార్యక్రమం జరగకపోవడం గమనార్హం.

**మొక్కుబడిగా..**

అధికారుల తనిఖీలు మొక్కుబడి తంతుగా మారింది. హడావుడిగా చేసి నమూనాలను పరీక్షలకు పంపి చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రతినెలా ఆయా హొటళ్లు, దాబాలు, కిరాణా దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి 12 వరకు నమూనాలను సేకరించి నాణ్యతా పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించాలి.

గత ఆరునెలల్లో పరిశీలిస్తే.. ఏప్రిల్‌లో 12, మే 11, జూన్ 5, జులై 3, ఆగస్టు 14, సెప్టెంబరులో 9 చొప్పున తనిఖీలు నిర్వహించారు. ఈ ఏడాది మొత్తంగా 12 వరకు కేసులు నమోదు చేశారు. విధించిన జరిమానా మొత్తం రూ.20 వేలు దాటలేదంటే ఆశ్చర్యం వేయకమానదు.

అధికారులకు ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే కదులుతున్న పరిస్థితి.

**సిబ్బంది కొరతతోనే..**

– రామచంద్ర, జిల్లా ఆహార నాణ్యత తనిఖీ అధికారి

శ్రీసత్యసాయి జిల్లాలో తనిఖీలు చేస్తున్నాం. అనంతపురం జిల్లాలోనూ కొన్ని ప్రాంతాలను పర్యవేక్షించాల్సి ఉంది. సిబ్బంది కొరత కారణంగా పూర్తి స్థాయిలో చేయలేకపోతున్నాం. ఎక్కడా, ఎవరి నుంచీ మామూళ్లు వసూలు చేయడం లేదు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

# కార్గో కళ్లు గప్పి టపాసుల రవాణా

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పార్శిల్ రవాణా (కార్గో) కళ్లు గప్పి టపాసులు రవాణా అవుతున్నాయి. తెలంగాణ నుంచి, పత్తికొండ నుంచి అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో వరకు రవాణా అయి వచ్చాయి. ఆర్టీసీ నిఘా వ్యవస్థ గుర్తించడంతో టపాసులు గమ్యాలకు చేరకుండా సరఫరా ఆగింది. పలు ప్రాంతాలు దాటి రాగా మార్గమధ్యలో టపాసులు పేలి ఏమైనా జరగకూడనిది జరిగి ఉంటే బాధ్యులు ఎవరు అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఒకటి చూపి మరొకటి పార్శిల్ చేయాలని చూసినా తప్పిదమే. ఇలా టపాసులు రవాణా చేస్తే కార్గో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు, పోలీసుల పేర్లు చెప్పి ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు.

ఆర్టీసీ కార్గో సర్వీసులు ద్వారా విజయనగరం నుంచి పార్వతీపురానికి టపాసులు పార్శిల్ చేశారు. ఈనెల 19న పార్వతీపురం బస్టాండ్‌లో టపాసులు పేలడంతో ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులు ఉలిక్కి పడ్డారు. పార్శిల్ ద్వారా మందు గుండు సామగ్రి, టపాసులు తీసుకెళ్లకూడదని బ్యానర్లు సైతం రాశారు. అయినా కార్గో ద్వారా



పార్శిళ్లు చేస్తుండటం గమనార్హం.

**మందు బిళ్లలు అంటూ..**

కనీసం సామాజిక స్పృహ లేకుండా టపాసులను బస్సుల్లో పార్శిల్ పంపాలని చూస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాలు ఏమైతేనేం వారు అనుకున్న గమ్యస్థానానికి టపాసులు చేర్చాలనే ఉద్దేశంతో మందు బిళ్లలు (మెడిసిన్), ఆహార పదార్థాలు అంటూ పార్శిల్ చేశారు. అనంతపురం నుంచి హిందూపురానికి టపాసులు పార్శిల్ రాగా అనంతపురంలోనే ఆర్టీసీ నిఘా అధికారులు గుర్తించారు. పత్తికొండ నుంచి అనంతపురానికి, హైదరాబాద్ నుంచి అనంతపురానికి టపాసులు రవాణా అయి పార్శిళ్లు వచ్చాయి. మార్గమధ్యలో ఎవరూ గుర్తించిన దాఖలాలు లేవు.

**నిషేధిత సామగ్రి సరఫరా చేయనివ్వం–** మోతీలాల్ నాయక్, ఆర్టీసీ కార్గో అధికారి నిషేధిత సామగ్రి సరఫరా చేయకుండా నిఘా ఉంచాం. మూడు పార్శిళ్లు గుర్తించడంతో వాటిని సీజ్ చేసి అపరాధ రుసుం విధించాం. కార్గోలో పార్శిల్ చేసే సమయంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఉండాలి.

# వృద్ధులూ.. తస్మాత్ జాగ్రత్త



ఐతేపల్లెలో కొన్ని రోజుల కిందట ఒంటరిగా ఉన్న వృద్ధుడి ఇంటి బయట ఆగంతకులు కారు హారన్ మోగించారు. మాటిమాటికీ హారన్ శబ్దం రావడంతో వృద్ధుడు బయటకు రాగా.. దుండగులు దాడి చేసి చోరీకి పాల్పడ్డారు. చిత్తూరు నగరంలో కొన్ని నెలల కిందట గుర్తు తెలియని ఓ మహిళ వృద్ధ దంపతుల ఇంటి తలుపు తట్టింది. చిరునామా అడిగి నీళ్లు అడిగింది. వృద్ధులు నీళ్లు తెచ్చేందుకు లోనికి వెళ్లగా సదరు మహిళ ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడింది.

జిల్లాలో దొంగతనాలు రోజురోజు కు పెరిగిపోతున్నాయి. రోజుల తరబడి తలుపులకు తాళాలున్న ఇళ్లే కాకుండా.. తెరచి ఉన్న వృద్ధుల ఇళ్లల్లో కూడా చోరీలు జరుగుతు న్నాయి. గుర్తు తెలియని దుండగులు ఒకట్రెండు రోజులు రెక్కీ నిర్వహించి.. ఖాళీ ఇళ్లు, వృద్ధులున్న ఇళ్ల వివరాలను సేకరిస్తున్నారు. ఆ ఇళ్లల్లో ఎవ్వరూ లేని సమయంలో తలుపులు పగులగొట్టి వెళ్లి దోచుకుంటున్నారు. ఇలాంటి చోరీలు శివారు ప్రాంతాల్లోనే కాదు.. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ జరుగుతున్నాయి.

**గస్తీ పెంచాలి**

వివిధ వస్తువుల విక్రయాల పేరుతో స్థానికులే కాకుండా పొరుగు రాష్ట్రాల ప్రజలు వీధుల్లో తిరుగుతున్నారు. అందులో ఎవ్వరు రెక్కీ నిర్వహిస్తున్నారో? ఎవ్వరు వ్యాపారం చేస్తున్నారో? తెలియడం లేదు. పోలీసులు నిరంతరం ప్రజలకు కనిపించేలా గస్తీ ఏర్పాటు చేసి, విజిబుల్ పోలీసింగ్‌ను బలపరిస్తే నేరాలు చాలా వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**ఈ సూచనలు పాటించాలి..**

ఒంటరిగా ఉంటున్నారా? అయితే ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఇంటి తలుపులకు అలారమ్ తాళాలను వినియోగించడం మంచిది.

ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

ఏదైనా చప్పుడు వచ్చినా, ఆగంతకులు వచ్చినట్లు తెలిసినా డయల్–121కు కాల్ చేయాలి.

సమాచారం ఇవ్వండివృద్ధులు ఒంటరిగా ఉన్నారనే సమాచారం స్థానిక పోలీసు స్టేషన్ లేక పోలీసు కమాండ్ కంట్రోల్‌కు తెలిపితే.. స్థానికంగా పోలీసు బీట్స్‌ను పెంచుతాం. వృద్ధుల కుటుంబ సభ్యులు సమాచారం అందించి సహకరించాలి. ఉమామహేశ్వర్, క్రైం సీఐ, చిత్తూరు

చురకలు



## గ్లామర్ తో కట్టిపడేస్తున్న రకుల్ ప్రీత్ సింగ్!

ఈ మధ్యకాలంలో చాలామంది హీరోయిన్స్ గ్లామర్ ను వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకొని ఫాలోవర్స్ ను పెంచుకోవడమే కాకుండా.. మరొకవైపు సినిమా ప్రమోషన్స్ కూడా చేస్తూ సినిమాపై హైప్ పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా గ్లామర్ ఉట్టిపడేలా తన ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఈమె దేదే ప్యార్ దే సీక్వెల్ దే దే ప్యార్ దే 2 సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు కేవలం ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో తాజాగా అభిమానులను ఆకట్టుకోవడానికి అలాగే తన సినిమాను ప్రమోట్ చేసుకోవడానికి సోషల్ మీడియాలో దర్శనమిచ్చింది. తాజాగా బీచ్ ఒడ్డున గ్లామర్ తో కట్టిపడేస్తూ అందమైన బ్లాక్ డ్రెస్ ధరించి ఫోటోలను షేర్ చేసింది రకుల్ ప్రీత్ సింగ్. పైగా ఈ ఫోటోలను షేర్ చేస్తూ.. "ఆయేషాను మీట్ అవడానికి ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉంది. నేను కూడా నవంబర్ 14 కోసం చాలా ఎక్సైటెడ్ గా ఎదురు చూస్తున్నాను.. టికెట్స్ బుక్ చేసుకోండి " అంటూ క్యాప్షన్ కూడా జోడించింది.



ఈమె అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా సినిమాపై కూడా ఆసక్తి పెంచుకుంటున్నారు. మరి రేపు విడుదల కాబోయే ఈ సినిమా రకుల్ కి ఎలాంటి సక్సెస్ అందిస్తుందో చూడాలి. దేదే ప్యార్ దే 2 సినిమా విషయానికి వస్తే..అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్, ఆర్. మాధవన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం ఇది. అన్షుల్ శర్మ దర్శకత్వంలో టి సిరీస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.. ఇకపోతే తాజాగా ఈ సినిమా నుండి "విరహగీతం ఆఖరి సలాం" అంటూ లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. సాగర్ భాటిగా రాసి స్వరపరిచిన ఈ పాటను.. అర్మాన్ మాలిక్ తన గొంతుతో ఆలపించారు. ప్రస్తుతం ఈ పాట ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్ విషయానికి వస్తే.." ప్రార్ధన.. ప్రతి రూపాయి కౌంటింగ్ ఇక్కడ" అనే డైలాగ్ తో భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా సందీప్ కిషన్ హీరోగా వచ్చిన వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. తెలుగులోకి తొలిసారి కెరటం అనే సినిమాతో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇకపోతే తెలుగు చలనచిత్ర నటిగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. తమిళ్, కన్నడ, హిందీ భాషల్లో నటిస్తూ బిజీగా మారిపోయింది. చివరిగా అయలాన్ 2, భారతీయుడు 2, మేరే హస్బెండ్ కీ బీవీ వంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె.. ప్రస్తుతం భారతీయుడు 3, దేదే ప్యార్ దే 2 వంటి చిత్రాలలో నటిస్తోంది.

## ఇదంతా అతడి నమ్మకం వల్లే: త్రిప్తి దిమ్రీ

తన కెరీర్ గేమ్ ఛేంజింగ్ హిట్‌ని అందించిన దర్శకుడిని ఏ నటీమణి అయినా మర్చిపోగలరా? ఇప్పుడు త్రిప్తి దిమ్రీ కూడా అందుకు మినహాయింపు కాదు. ఈ బ్యూటీ నటి అయ్యాక, వరుసగా సినిమాల్లో నటిస్తోంది. కానీ ఆశించిన గుర్తింపు దక్కలేదు. లైలా మజ్ను, ఖాళా, బుల్బుల్ లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఆ సినిమాలను ఎవరూ పట్టించుకోలేదు. ఆ సమయంలో త్రిప్తి అస్సలు ఊహించలేదు. తన లైఫ్ గేమ్ ఛేంజింగ్ సినిమాని ఒక తెలుగు దర్శకుడు అందిస్తాడని.. అది కూడా రణబీర్ కపూర్ లాంటి పెద్ద హీరో సినిమాలో నటించే అవకాశం. ఒకే ఒక్క యానిమల్ చిత్రం త్రిప్తి దిమ్రీ దశను మలుపు తిప్పేసింది. యానిమల్‌లో చేసింది చిన్న పాత్రలోనే అయినా అది తన కెరీర్ గేమ్ ఛేంజర్ గా మారింది. ఈ సినిమా విడుదలైన తర్వాత త్రిప్తి దిమ్రీ ఎవరు? అంటూ గూగుల్ లో ఆరాలు తీసారు. మీడియా విస్తృతంగా తన గురించి ప్రచారం చేసింది. అంతేకాదు త్రిప్తి దిమ్రీ



నటించిన గత చిత్రాలు లైలా మజ్ను, ఖళా , బుల్బుల్ లను కూడా ప్రజలు చూడటానికి ప్రయత్నించారు. జీవితం 360 డిగ్రీల మలుపు తీసుకుందని చెప్పింది త్రిప్తి. యానిమల్ విడుదలయ్యాక అనూహ్యంగా త్రిప్తి నేషనల్ క్రష్ అనే టైటిల్ ని కూడా సొంతం చేసుకుంది. సందీప్ వంగా ఆ రోజు తనను నమ్మి జోయా అనే పాత్రను ఆఫర్ చేయకపోతే ఏం జరిగేదో త్రిప్తి ఊహించుకుంటోంది. అందుకే వీలున్న ప్రతిసారీ సందీప్ ని తలచుకుంటోంది. తన జీవితాన్ని మార్చేసిన సినిమాగా యానిమల్‌కు క్రెడిట్ దక్కుతుందని త్రిప్తి చెప్పారు. ఫిలింఫేర్‌తో ఇంటర్వ్యూలో త్రిప్తి మాట్లాడుతూ..యానిమల్ ఒక వరం. లైలా మజ్ను సమయంలో నాకు లభిస్తుందని భావించిన గుర్తింపు, వాస్తవానికి యానిమల్‌తో వచ్చింది. ఇది చాలా చిన్న పాత్ర కాబట్టి గుర్తింపు వస్తుందా? అని అనుకున్నాను.. కానీ దర్శకుడు సందీప్ వంగా సర్ నాపై నమ్మకం ఉంచారు. ఈ సినిమా నాకు చాలా మంచి అవకాశమని అన్నారు. ఆయన చెప్పినదంతా సరిగ్గా జరిగింది. ఇది గొప్ప ఆశీర్వాదం.. నా నటనకు ప్రేమ కురిసింది. యానిమల్ కారణంగా ప్రజలు తిరిగి నా గత చిత్రాలు బుల్బుల్, ఖాలా, లైలా మజ్ను చూడటం నాకు సంతోషాన్నిస్తోంది అని అన్నారు. సెట్‌లో భయపడతారా? అన్న ప్రశ్నకు త్రిప్తి సమాధానం ఇచ్చింది.

నేను ప్రతి సినిమాకి భయపడతాను.. మొదటి ఐదు రోజులు ఈ భయం. ఎదుటి వ్యక్తిని నేను అర్థం చేసుకున్నానా లేదా? అంటూ భయపడుతుంటాను. కొద్దిరోజులు అలవాటయ్యాక ఆస్వాధించడం మొదలవుతుంది. నటిగా స్వీయ విమర్శ సహజం. అది ప్రక్రియలో భాగం అని తెలిపింది. కెరీర్ విషయానికి వస్తే.. త్రిప్తీ తదుపరి ప్రభాస్‌తో స్పిరిట్‌లో నటిస్తుంది. భూల్ భూలయ్యా 3 సహనటి మాధురీ దీక్షిత్‌తో మా బెహెన్ అనే చిత్రానికి సంతకం చేసింది. సందీప్ వంగా యానిమల్ పార్క్‌లోను నటించాల్సి ఉంది.




## రాజమౌళి ఫామ్ హౌస్ లో ప్రియాంక చోప్రా కూతురు సందడి..!





టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రలో నటిస్తున్న సినిమా పై అంచనాలు భారీగా పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమాకి జరగని స్థాయిలో ఈవెంట్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహేష్ బాబు స్టార్‌డంకు ఏమాత్రం తగ్గకుండా, రాజమౌళి భారీ మేకింగ్‌కు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా రూపొందుతోంది. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించడంతో అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా బాలీవుడ్‌లో సైతం ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే విశ్వాసం ఇప్పటి నుంచే మొదలు అయింది అనడంలో సందేహం లేదు.

**మహేష్ బాబు హీరోగా ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా..** ప్రియాంక చోప్రా ఈ సినిమాపై చాలా ఆసక్తిగా ఉంది. గత కొన్నాళ్లుగా హాలీవుడ్‌కే పరిమితం అయిన ప్రియాంక చోప్రా కేవలం రాజమౌళి అడిగిన కారణంగా ఈ సినిమాలో నటించేందుకు రెడీ అయింది. ఇటీవల సోషల్ మీడియాలో ఈమె అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పింది. ఆ సమయంలో ఒక నెటిజన్ మీరు షూటింగ్‌లో ఉన్నప్పుడు ఫ్యామిలీకి దూరంగా ఉంటారా, ముఖ్యంగా మహేష్ బాబు, రాజమౌళి మూవీ షూటింగ్ సమయంలో మీ ఫ్యామిలీ సమయం ఎలా ఉంది, మీరు పూర్తిగా ఫ్యామిలీకి దూరంగా ఉంటున్నారా అని ప్రశ్నించాడు. ఆయన ప్రశ్నకు ప్రియాంక చోప్రా సమాధానం ఇచ్చింది. తాను షూటింగ్‌తో బిజీగా ఉన్న సమయంలో తన కూతురు సైతం హైదరాబాద్‌లోనే ఉందని, తన కూతురు ప్రస్తుతం హైదరాబాద్‌లో మంచి క్వాలిటీ టైం ను స్పెండ్ చేస్తుంది అంటూ ఆమె ఎక్స్ ద్వారా చెప్పుకొచ్చింది.

**రాజమౌళి దర్శకత్వంలో గ్లోబ్ ట్రాటర్...** ఎక్స్‌లో తన కూతురు మాల్తీ గురించి చెబుతూ... నేను గ్లోబ్ ట్రాటర్ షూటింగ్‌లో బిజీగా ఉన్న సమయంలో నా కూతురు మాల్తీ ఎక్కువగా మహేష్ బాబు కూతురు సితారతో సమయం గడుపుతోంది. ఇద్దరు చాలా ఎక్కువ సమయం కలిసి ఆడుకోవడం జరుగుతుందని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా రాజమౌళి గారి ఫామ్ హౌస్‌కి వెళ్లడం, అక్కడ ఆవులతో, చిన్న ఆవు పిల్లలతో ఆడుకోవడంను ఆస్వాదిస్తుందని చెప్పుకొచ్చింది. మంచి మెమోరిస్‌ను తను క్రియేట్ చేసుకుంటుంది. హైదరాబాద్ వచ్చిన సమయంలో మాల్తీ చాలా ఎంజాయ్ చేస్తుందని, తాను షూటింగ్‌తో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎంజాయ్ చేస్తుంది అంటూ ప్రియాంక చోప్రా చెప్పుకొచ్చింది. ఇప్పటికే ప్రియాంక చోప్రా ఈవెంట్ కోసం హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం అందుతోంది. ఇటీవల ఆమె పోస్టర్ ను జక్కన్న రిలీజ్ చేసిన విషయం తెల్సిందే.

**కీరవాణి సంగీతం అందిస్తున్న జక్కన్న సినిమా...** టాలీవుడ్ జక్కన్న రాజమౌళి చాలా కాలం తర్వాత ఒక ప్రస్తుత టైమ్ జోనర్ మూవీని రూపొందిస్తున్నట్లుగా ఇప్పటికే వచ్చిన పోస్టర్స్ ను చూస్తే అర్థం అవుతుంది. తప్పకుండా ఈ సినిమా కూడా మరో బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాను 2026 చివరి వరకు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే అది ఎంతవరకు సాధ్యం అనేది మాత్రం క్లారిటీ లేదు. తప్పకుండా సినిమా ఆలస్యం అవుతుంది అనే అభిప్రాయం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

జక్కన్న సినిమా ఎంత ఆలస్యం అయితే అంతగా వెయిట్ పెరుగుతుంది, అలాగే సినిమా క్వాలిటీ కూడా పెరుగుతుంది అనేది ఇండస్ట్రీ వర్గాల, ప్రేక్షకులు భావిస్తున్నారు.

## సామ్ కనిపిస్తే వెంటపడటమే..!





సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఈమధ్య ఎక్కువగా ముంబైలోనే ఉంటుంది. బాలీవుడ్ వెబ్ సిరీస్ లు చేస్తూ వస్తున్న అమ్మడు ఇప్పుడు అక్కడ సినిమాలను కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది. తెలుగులో ఛాన్స్ లు రావట్లేదా అంటే వస్తున్నా కూడా సమంతకు నచ్చే కథలు దొరకట్లేదట.

ఐతే సమంత ఈమధ్యనే తన ప్రొడక్షన్ ట్రాలాలా బ్యానర్ లో శుభం సినిమా చేసింది. ఆ సినిమాతో అమ్మడు నిర్మాతగా తన లక్ టెస్ట్ చేసుకుంది. కమర్షియల్ గా సూపర్ హిట్ అవ్వకపోయినా శుభం ఒక మంచి ప్రయత్నం అనిపించుకుంది.


**సమంత సీరియస్ అయినా కూడా..** ఐతే సమంత ఎక్కడ కనిపిస్తే అక్కడ ఫోటోలు క్లిక్ అనిపిస్తారు. ప్రెస్ మీట్ లు, సినిమా ప్రమోషన్స్ అయితే ఓకే కానీ ఆమె జిం కి వెళ్లి వస్తుంటే పాపరాజీలు ఆమెను వదలట్లేదు. వెంట పడి మరీ ఆమె ఫోటోలు క్లిక్ అనిపిస్తున్నారు. అంతకుముందు ఆ్రలేడీ సమంత ఈ విషయంపై కాస్త సీరియస్ అయినా కూడా ఆమెను వదలట్లేదు. మామూలుగా అయితే కొందరు హీరోయిన్స్ ఈ పాపరాజీలను కావాలని పెట్టుకుంటారు. అందుకే వాళ్లు జిమ్, ఎయిర్ పోర్ట్ ఇలా పబ్లిక్ లో ఎక్కడ కనిపించినా ఫోటోస్ తీస్తుంటారు. కానీ సమంత విషయంలో ఆమె వద్దంటున్నా కూడా వీళ్లు వదలట్లేదు. ముఖ్యంగా ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్ డైరెక్టర్ రాజ్ తో సమంత చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంది అన్న టాక్ ఉంది. ఇద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. కానీ ఎవరు ఈ విషయంపై ఓపెన్ అవ్వట్లేదు.

ఐతే రాజ్ తో ముంబైలో సమంత కనిపించిన ప్రతిసారి ముంబై మీడియా తెగ హడావిడి చేస్తుంది.

**ఇష్టం లేకుండా ఫోటోలు తీయడం..** లేటెస్ట్ గా ఆమె జిమ్ నుంచి బయటకు వస్తున్న టైం లో కూడా అదే జిమ్ నుంచి రాజ్ కూడా రావడం వల్ల సమంత కనీసం పాపరాజీలను పట్టించుకోకుండా వెళ్లిందట. అయినా సరే సమంత వెంట పడి ఆమెని ఫోటో తీయాలని తెగ ప్రయత్నిస్తున్నారు. సమంత ఈ విషయంలో చాలా డిజప్పాయింటెడ్ గా ఉందని తెలుస్తుంది. స్టార్స్ అయినా సరే వాళ్లకి ఇష్టం లేకుండా ఫోటోలు తీయడం అన్నది కరెక్ట్ కాదు. చూస్తుంటే ఈ విషయంపై సమంత ఏదో ఒక టైం లో గట్టిగా రియాక్ట్ అయ్యేలా ఉంది. సమంత సినిమాల విషయానికి వస్తే అమ్మడు బాలీవుడ్ లోనే నెక్స్ట్ సినిమా చేస్తుందని టాక్. తెలుగులో తన బ్యానర్ లోనే మా ఇంటి బంగారం సినిమా లైన్ లో ఉంది. ఆ సినిమా తర్వాత సమంత తెలుగులో కూడా వరుస ప్రాజెక్ట్స్ చేయాలని చూస్తుంది.

## 43 ఏళ్లలో కూడా స్టిల్ గ్లామర్.. ఆకట్టుకుంటున్న కొత్త మూవీ పోస్టర్!

కొంతమంది హీరోయిన్స్ వయసు పెరిగినా కూడా వన్నె తరగని అందంతో కుర్ర హీరోయిన్ ల లాగే మెరిసిపోతూ ఉంటారు. అలాంటి వారిలో శ్రియా శరణ్ కూడా ఒకరు.. 43 ఏళ్ల వయసున్న శ్రియా శరణ్ ఇప్పటికీ యంగ్ గానే కనిపిస్తోంది. అయితే తాజాగా శ్రియాకి కొత్త సినిమాకు సంబంధించిన ఒక పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్ మొత్తాన్నీ షేక్ చేస్తోంది. ఈ మేరకు శ్రియా శరణ్ కి సంబంధించిన కొత్త పాట పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ పోస్టర్లో శ్రియా అందం చూసి చాలామంది షాక్ అయిపోతున్నారు. వామ్మో 43 ఇయర్స్ లో కూడా మరీ ఇంత గ్లామర్ ఏంటిరా బాబోయ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. శ్రియాకి సంబంధించిన ఈ తాజా పోస్టర్లో పింక్ కలర్ మెరిసే దుస్తులను ధరించి ఒక బోల్డ్ ఫోజ్ పెట్టి స్టిల్ ఇచ్చింది. ఈ పోస్టర్ తో మళ్ళీ శ్రియా సినిమాల్లో తన గ్లామర్ తో కుర్రకారుని ఊర్రూతలూగించడానికి సిద్ధమైపోయిందని అనిపిస్తోంది. శ్రియా శరన్ నటిస్తున్న తాజా మూవీ




నాన్ వైలెన్స్ నుండి పోస్టర్ విడుదలైన కొద్ది క్షణాల్లోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దాంతో ప్రస్తుతం శ్రియా శరన్ కి సంబంధించిన తాజా పోస్టర్ పై చాలా మంది నెటిజన్స్ వైరల్ కామెంట్స్ పెడుతున్నారు. ఇక శ్రియా చివరిసారిగా మిరాయ్ మూవీలో తేజ సజ్జా తల్లి పాత్రలో నటించడంతో పాటు తమిళ హీరో సూర్య నటించిన రెట్రో మూవీలో స్పెషల్ సాంగ్ లో కనిపించింది. అయితే ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ ద్వారా శ్రియా శరన్ కి ఎలాంటి గుర్తింపు కూడా రాలేదు. కానీ ఆమె అభిమానులు మాత్రం శ్రియా మళ్లీ కచ్చితంగా ఏదో ఒక కొత్త సినిమాతో తిరిగి వస్తుందని అనుకున్నారు. అలా ఇప్పుడు తాజాగా ఆనంద్ కృష్ణన్ దర్శకత్వం వహించిన నాన్ వైలెన్స్ అనే మూవీతో మన ముందుకు రాబోతోంది. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ సాంగ్ రేపు ఉదయం 11 గంటలకు విడుదల కాబోతోంది. అయితే తాజాగా వైబ్ చేయడానికి సిద్ధంగా ఉండండి అంటూ టీ సిరీస్ ఈ పోస్టర్ ని షేర్ చేసింది. ప్రకాశవంతమైన లైట్లు, డాన్సర్ల మధ్య శ్రీయ తన మిరుమిట్లు గొలిపే అందంతో మరింత యంగ్ గా కనిపిస్తోంది.. సరికొత్త ఐటమ్ సాంగ్ ఎంతో శ్రియ మరోసారి తన అభిమానులని అలరించబోతోంది.

## కలలోనూ ఊహించలేదు.. తారక్ మూవీ కోసం ఇప్పుడే చెప్పను: రుక్మిణీ

రుక్మిణీ వసంత్.. నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరు ఫుల్ గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్ తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందుగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్ కు వచ్చి తన



నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు. సినిమా కోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించిందని, తాను మూవీలో కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని చెప్పారు. షూటింగ్ టైమ్ లో రిషబ్ శెట్టిని చూసి కొన్నిసార్లు షాక్ అయినట్లు తెలిపారు. హీరో, డైరెక్టర్ గా ఆయన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారని ప్రశంసల వర్షం కురిపించారు. ఆ తర్వాత తాను ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. కెరీర్ లో ఏ ఆఫర్ కూడా వదులుకోలేనని చెప్పారు. ఫ్యూచర్ లో రకరకాల క్యారెక్టర్స్ చేస్తానని, ఆడియన్స్ తన జర్నీ జడ్జ్ చేయాలని తెలిపారు. ఫ్యాన్స్ అంతా క్రష్ అంటున్నారని, లేబుల్స్ మాత్రం నార్మల్ అని తెలిపారు. వాళ్లంతా తన క్యారెక్టర్ కు కనెక్ట్ అవ్వడం హ్యాపీ అని చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536